# Crime News ది క్రైమ్ న్యూస్

తెలుగు దినపత్రిక

గురువారం, ఆగస్టు 14, 2025 | సంపుటి - 20 | సంచిక 314 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.


## సింధు జలాల ఒప్పందం ఆపితే తీవ్రచర్యలు

మర్చిపోలేని విధంగా గుణపాఠం చెబుతాం

మరోమారు పాక్ ప్రధాని ప్రేలాపనలు



ఇస్లామాబాద్ : సింధు జలాల ఒప్పందం నిలిపివేతతో అల్లాడిపోతున్న పాక్ నేతలు ఏం చేయాలో పాలుపోక నోటికి పని చెబుతున్నారు. యుద్ధోన్మాదంతో ఊగిపోతూ పిచ్చి ప్రేలాపనలకు దిగుతున్నారు. తాజాగా పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ భారత్‌పై నోరు పారేసుకున్నారు. భారత్‌కు ఎన్నడూ మర్చిపోలేని గుణపాఠం చెబుతామంటూ హెచ్చరించారు. నీటిని అడ్డుకుంటామంటూ బెదిరింపులకు దిగుతున్న ఈ శత్రువుకు నేను ఒకటే చెబుతున్నా..

2

## తెలంగాణ పట్ల కేంద్రం వివక్ష

అధునాతన ప్యాకేజీ కంపెనీకి దక్కని అనుమతి

కేంద్రం తీరుపై మంత్రి శ్రీధర్ బాబు అసహనం



హైదరాబాద్ : తెలంగాణకు వచ్చే కంపెనీలకు అనుమతి ఇచ్చే విషయంలో కేంద్రం వివక్ష చూపుతోందని మంత్రి శ్రీధర్ బాబు విమర్శించారు. బుధవారం మంత్రి మాట్లాడుతూ.. ఏపీకి కొత్త ప్రాజెక్టులు కేటాయించి, తెలంగాణను మాత్రం పక్కన పెడుతోందన్నారు. ప్రపంచస్థాయి అధునాతన ప్యాకేజింగ్ కంపెనీ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని, ఇందుకోసం మహేశ్వరంలో 10 ఎకరాల విలువైన భూమిని కేటాయించడంతో పాటు-, రాయితీలు ఇచ్చేందుకు ఆమోదిస్తూ అన్ని అనుమతులను రికార్డు స్థాయిలో పూర్తి చేశామన్నారు. అయినా కానీ, కేంద్ర క్యాబినెట్ పరిశ్రమ ఏర్పాటుకు అనుమతి ఇవ్వడం లేదన్నారు. ఏపీలో మాత్రం ఇలాంటి ప్రాజెక్టుకే కేంద్రం ఆమోదం తెలిపిందన్నారు.

మిగతా 2లో

## రాఖీ పౌర్ణమి సందర్భంగా ఆర్టీసీలో రద్దీ

మొత్తం 3.68 కోట్ల మంది రాకపోకలు

అందులో 2.51 కోట్ల ఉచిత ప్రయాణాలు

సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ వెల్లడి



2

## రెండేళ్లయినా ఆరు గ్యారెంటీలేవీ



ఎక్కడికైనా వెళ్లి ప్రజలను అడుగుదామా

డిప్యూటీ సీఎం భట్టికి కేటీఆర్ సవాల్

2

## తెలంగాణ అంతటా రెండ్రోజుల పాటు రెడ్ అలర్ట్

రాష్ట్రంలో ఐదు రోజుల పాటు ఈదురు గాలులు

వాతావరణ కేంద్రం డైరెక్టర్ నాగరత్న

హైదరాబాద్ : తెలంగాణ అంతటికీ రెండ్రోజుల పాటు రెడ్ అలర్ట్ జారీ చేసినట్లు- వాతావరణ కేంద్రం డైరెక్టర్ నాగరత్న తెలిపారు.

మిగతా 2లో

## సావర్కర్, గాడ్సే భావజాలం వారితో ప్రమాదం

తనకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే

రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ : వీరసావర్కర్‌ను ఉద్దేశిస్తూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై పరువునష్టం కేసు నమోదైన విషయం తెలిసిందే. అయితే.. సావర్కర్, గాడ్సే భావజాలాన్ని అనుసరిస్తున్న వారి నుంచి తనకు ముప్పు పొంచి ఉండొచ్చని రాహుల్ పుణె కోర్టుకు తెలిపారు. 2లో

## తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు

పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు

కృష్ణా నది, బుడమేరులకు వరద ఉధృతి

అప్రమత్తంగా ఉండాలని అధికారుల హెచ్చరిక



విజయవాడ : తెలుగు రాష్ట్రాల్లో గత వారం రోజుల నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. భారీ వర్షాల కారణంగా వాగులు, వంకలు పొంగిపొర్లు తున్నాయి. లోతట్టు- ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. రోడ్లు నదులను తలపిస్తున్నాయి. రాబోయే మూడు రోజులు ఏపీలోని పలు జిల్లాల్లో భారీనుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఏలూరు, పశ్చిమ గోదావరి, కృష్ణా, ఎన్టీఆర్, బాపట్ల, పల్నాడు, గుంటూరు, ప్రకాశం, నంద్యాల జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. విజయవాడలో భారీ వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. భారీ వర్షాల కారణంగా రెండు వేర్వేరు ఘటనల్లో ఇద్దరు వ్యక్తులు ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఓ ఘటనలో ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు మ్యాన్‌హోల్‌లో పడి చనిపోయాడు. మృతుడ్ని 53వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు మధుసూదన్‌గా గుర్తించారు. రెండవ ఘటనలో కూలిన చెట్టును ఢీకొని ఓ వ్యక్తి చనిపోయాడు.

మిగతా 2లో

## గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకం రద్దు

సుప్రీంకోర్టు సంచలన తీర్పు

కోదండరాం, అలీఖాన్ నియామకం చెల్లదు

గవర్నర్ నియామకంపై దాసోజ్ శ్రవణ్ పిటిషన్

తదుపరి విచారణ సెప్టెంబర్ 17కు వాయిదా



సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. తెలంగాణలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీ నియామకాలపై సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. గవర్నర్ కోటాలో నియమితులైన ఎమ్మెల్సీ కోదండరాం, అలీఖాన్ నియామకం రద్దు చేస్తూ.. సుప్రీం ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. బీఆర్ఎస్ నేతలు దాసోజు శ్రవణ్, సత్యనారాయణ పిటిషన్‌లపై విచారణ చేపట్టిన న్యాయస్థానం కోదండరాం, అలీఖాన్ నియామకం రద్దు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. రెండు ఎమ్మెల్సీ స్థానాలలో తాజా నామినేషన్లు తమ తుది తీర్పుకి లోబడే ఉంటాయని సుప్రీంకోర్టు చెప్పుకొచ్చింది.

న్యూఢిల్లీ : కోదండరాం, అలీఖాన్‌లు తెలంగాణ గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా నియామకం అయిన విషయం తెలిసిందే. అయితే వీరి నియామకం అక్రమంగా జరిగిందని.. దాసోజు శ్రవణ్, సత్యనారాయణలు గవర్నర్‌కు తెలిపారు. గవర్నర్ వీరి వాదనను తిరస్కరించడంతో.. సుప్రీంకోర్టును ఆశ్రయించారు. వారి నియామకాలపై విచారణ జరిపి నియామకాన్ని రద్దు చేయాలని బీఆర్ఎస్ నేతలు సుప్రీంను కోరారు. ఈ మేరకు బుధవారం విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం.. 2లో

## యూరియాను బీహార్‌కు తరలిస్తున్నారు



యూరియా కోసం రోడ్డెక్కిన అన్నదాతలు

కాంగ్రెస్ ప్రభుత్వంలో మళ్లీ పాత పద్ధతి అమలు

ఇద్దరు కేంద్రమంత్రులు ఉన్నా యూరియా రాదు

యూరియా కోసం క్యూలో ఉన్న రైతులతో హరీష్ రావు

సిద్దిపేట : యూరియా కోసం అన్నదాతలు నడిరోడ్డెక్కి ధర్నాలు చేసే దుస్థితిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించాయని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రైతులకు యూరియా ఇవ్వలేని చేతగాని, దద్దమ్మ ప్రభుత్వాలు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నదాతలను అరిగోస పెడుతున్న కాంగ్రెస్, బీజేపీలకు రైతుల ఉసురు తగులుతుందని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్ గ్రామం వద్ద ఎరువుల కోసం క్యూలో బారులు తీరిన రైతులను చూసి మాజీ మంత్రి హరీష్ రావు ఆగారు. ఈ సందర్భంగా వారిని పలుకరించగా.. ఉదయం 5 గంటల నుండి ఇక్కడే ఉంటున్నాం.. ఒక ఆధార్ కార్డుకి ఒకటే బస్తా ఇస్తామంటున్నారు. ఆధార్ కార్డు, ఓటీపీ అంటూ కాలయాపన చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని హరీశ్‌రావుతో రైతులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు.

మిగతా 2లో

## కాళేశ్వరం జలాశయాలు నింపండి

వెంటనే మోటర్లు ఆన్ చేసి పంపింగ్ చేయాలి

మంత్రి ఉత్తమ్‌కు హరీష్ రావు లేఖ

## అరచాకం నుంచి బయటపడుతున్న పులివెందుల

ప్రజలు ఇప్పుడిప్పుడే స్వేచ్ఛగా ఓటేసే పరిస్థితి

మీడియా చిట్‌చాట్‌లో సీఎం చంద్రబాబు



అమరావతి : పులివెందుల ప్రజలు ఇప్పుడిప్పుడే అరాచకం నుంచి బయట పడుతున్నారని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటేసే స్థితి వచ్చిందన్నారు. 11 మంది పోటీ చేయడం, రెండు పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్జరగడం ఇందుకు నిదర్శనమని అన్నారు. పార్టీ కేంద్ర పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో బుధవారం సీఎం చంద్రబాబు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా పలువురికి ఆర్థిక సాయం చేశారు. అనంతరం మీడియాతో చిట్‌చాట్‌లో మాట్లాడారు. పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికలపై అడిగిన ప్రశ్నలకు చంద్రబాబు సమాధానమిచ్చారు.వైయస్ హయాం నుంచి పులివెందులలో ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నిక జరగలేదు. 2లో

# సింధు జలాల ఒప్పందం ఆపితే తీవ్రచర్యలు

మా నీటిలో మీరు ఒక్క చుక్కను కూడా తీసుకోలేరు. నీటిని అడ్డుకుంటున్నామంటూ మీరు బెదిరింపులకు దిగుతున్నారు. కానీ ఇలాంటి పని చేస్తే పాక్ మీకు ఎన్నటికీ మర్చిపోలేని విధంగా గుణపాఠం చెబుతుందని వార్నింగ్ ఇచ్చారు. అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇస్లామాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాని ఈ కామెంట్స్ చేశారు. సింధు నదీ జలాల పంపిణీ ఒప్పందం పాక్‌కు జీవనాడి అని పాక్ ప్రధాని అన్నారు. ఈ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. ఇటీవల పాక్ విదేశాంగ శాఖ.. ఒప్పందం అమలును కోరుతూ భారత్‌కు లేఖ రాసింది. 'సింధు నదీ జలాల ఒప్పందాన్ని ఎప్పటిలాగే అమలు చేయాలని భారత్‌ను కోరుతున్నాము. ఒప్పందానికి కట్టు-బడి బాధ్యతలు నిర్వర్తించాలని కోరుతున్నామని పాక్ విదేశాంగ శాఖ ఎక్స్ వేదికగా కూడా పోస్టు పెట్టింది. ఈ నేపథ్యంలో పాక్ ప్రధాని మళ్లీ రెచ్చిపోయారు. ఇటీవల పాక్ ఆర్మీ చీఫ్ మునీర్, మరో నేత బిలావల్ భుట్టో కూడా భారత్‌పై యుద్ధోన్మాదంతో రెచ్చిపోతూ నోటికొచ్చినట్టు- మాట్లాడారు. భారత్‌ను ఉద్దేశిస్తూ మునీర్ అణుయుద్ధ హెచ్చరికలు చేశారు. పాక్ ఉనికికి ముప్పు వస్తే తమతో పాటు- సగం ప్రపంచం అంతమవు తుందని వార్నింగ్ ఇచ్చారు. ఇక భారత్‌కు వ్యతిరేకంగా పాక్ ప్రజలు ఏకం కావాలని బిలావల్ భుట్టో పిలుపు నిచ్చారు.

# తెలంగాణ పట్ల కేంద్రం వివక్ష

అయితే అక్కడ ఇప్పటివరకు ఎలాంటి భూకేటాయింపులు జరగలేదని, ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమైనా వారికి అనుమతులు ఎలా ఇచ్చారంటూ ప్రశ్నించారు.కేంద్రం ఇలాంటి చర్యల వల్ల అంతర్జాతీయ పెట్టు-బడిదారులకు ఏం సందేశం ఇవ్వాలనుకుంటుందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇలాంటి రాజకీయ నిర్ణయాలు తెలంగాణ అభివృద్ధికి తీవ్ర ఆటంకం కలిగిస్తున్నాయని, కేంద్ర వ్యవహారశైలిని రాష్ట్ర ప్రభుత్వం తూర్పారబడుతుందన్నారు.

# తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు

భారీ వర్షాల కారణంగా చెట్టు కూలిపోయింది. అటు-వైపు వచ్చిన ఆ వ్యక్తిని చెట్టును ఢీకొన్నాడు. అక్కడికక్కడే చనిపోయాడు. ఈ సంఘటన లయోలా కాలేజీ దగ్గర జరిగింది. విజయవాడలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తుండటంతో.. కృష్ణా నది, బుడమేరు పొంగిపొర్లుతున్నాయి. ఈ నేపథ్యంలో.. కృష్ణానది, బుడమేరు పరివాహక ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్చరించారు. ఫ్లడ్ అలర్ట్ జారీ చేసి, లోతట్టు- ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు. ఇక, భారీ వర్షాల కారణంగా అచ్చంపేట-మాదిపాడు రహదారిపైకి వరద నీరు వచ్చి చేరింది. దీంతో అమరావతి- విజయవాడ మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.

# కాళేశ్వరం జలాశయాలు నింపండి

సిద్దిపేట : నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి హరీశ్‌రావు లేఖ రాశారు. కాళేశ్వరం ప్రాజెక్టు కింద ఉన్న జలాశయాలు నింపాలని అందులో విజ్ఞప్తి చేశారు. మధ్య మానేరు, అన్నపూర్ణ, రంగనాయక్‌సాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ, బస్వాపూర్ జలాశయాలను నింపాలని కోరారు. రైతుల కోసం ఆరో ప్యాకేజీ వద్ద ఉన్న మోటార్లు ఆన్ చేయాలన్నారు. జలాశయాల్లో నీరు నింపకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని పేర్కొన్నారు. ఈ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. వెంటనే కాళేశ్వరం మోటార్లు ఆన్ చేసి రిజర్వాయర్లు నింపాలని లేఖలో పేర్కొన్నారు. రిజర్వాయర్‌లలో నీటిని సకాలంలో నింపకపోవడం వల్ల రైతులు ఆందోళనలో ఉన్నారని చెప్పుకొచ్చారు. ప్రాజెక్టు పరిధిలోని రిజర్వాయర్లను వెంటనే నింపాలని సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ ప్యాకేజ్-6 వద్ద మోటార్లను ఆన్ చేసి నీటి పంపింగ్ చేయాలని కోరారు. కేసీఆర్ హయాంలో హమాలీ ఖర్చులు ఇచ్చి ఇంటికి యూరియా పంపించామని గుర్తు చేశారు. ఉదయం నుంచి రైతులు వచ్చి ఇబ్బందులు పడుతుంటే పట్టించుకొనే అధికారి లేరని అగ్రికల్చర్ అధికారులపై సీరియస్ అయ్యారు. పదేళ్లలో లేని కొరత.. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇప్పుడు ఎందుకు వచ్చిందని ప్రశ్నల వర్షం కురిపించారు. ఎరువుల కొరత మూమ్మాటికీ ఈ బీజేపీ , కాంగ్రెస్ ప్రభుత్వాల వైఫల్యమేనని విమర్శించారు. పదేళ్లలో కేసీఆర్ హయాంలో ఎరువుల ఇబ్బంది లేదని చెప్పుకొచ్చారు. ఈ ప్రభుత్వం రైతుల పట్ల చిన్న చూపునకు నిదర్శనమని ఆక్షేపించారు హరీష్‌రావు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

# అరచాకం నుంచి బయటపడుతున్న పులివెందుల

ఈసారి అరాచకాలు జరగలేదనే అసహనంతో జగన్ ఉన్నారు. ఆయన వైఖరి ఏలాంటిదో ప్రజలకు తెలిసిందే. నామినేషన్ వేసేందుకే భయపడే పరిస్థితి నుంచి 11 మంది పోటీ- చేశారు. రెండు పోలింగ్ బూత్‌ల్లో ఎప్పుడైనా రీపోలింగ్ జరిగిందా?శాంతిభద్రతలు పటిష్ఠంగా ఉన్నాయి కనుకే ప్రజలు ధైర్యంగా ఓటేశారని చంద్రబాబు పేర్కొన్నారు. మరోవైపు రాష్ట్రంలో విస్తారంగా కురుస్తున్న వర్షాలపై అప్రమత్తంగా ఉన్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. భారీ వర్షాల కారణంగా పలువురు మరణించడం బాధాకరమన్నారు. నష్ట నివారణకు ఎక్కడికక్కడ ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జిల్లాల్లో సంబంధిత మంత్రులు సమన్వయం చేసుకుంటున్నారని పేర్కొన్నారు.

# సుప్రీం తీర్పుతో కళ్లు తెరవాలి

### రాజ్యాంగ రక్షణకే తమ పోరాటం అన్న దాసోజు

హైదరాబాద్,ఆగస్ట్13 : తెలంగాణలో గవర్నర్ కోటాలో ఇద్దరు ఎమ్మెల్సీ నియామకాలను సుప్రీంకోర్టు నిలిపివేస్తూ తీర్పు వెలువరిండాన్ని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ స్వాగతించారు. రాజ్యాంగాన్ని అతిక్రమించి పనిచేసే వారికి ఇదో హెచ్చరిక అన్నారు. బుధవారం హైదరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ.. ఈ అంశంపై తాను రెండేళ్ల పాటు- పోరాటం చేశానన్నారు. ఇది వ్యక్తులపై పోరాటం కాదని.. రాజ్యాంగ బద్ధ హక్కుల కోసం చేసిన పోరాటమని ఆయన అభివర్ణించారు. రాజ్యాంగ బద్ధంగా ప్రభుత్వాలు పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎవరికి తగినట్లు- వారు రాజ్యాంగాన్ని అనువదించుకొని అమలు చేయడం సరి కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కేసు విషయంలో సెప్టెంబర్ 17వ తేదీన మరోసారి విచారణ జరగనుందని గుర్తు చేశారు. అయితే తెలంగాణ రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి తన రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇక గతంలో తన అభ్యర్థిత్వాన్ని గవర్నర్ తిరస్కరించారని చెప్పారు. ఈ నేపథ్యంలో ధర్మం గెలిచినట్లుగా తాను భావిస్తున్నానని తెలిపారు. గతంలో హైకోర్టు తమ నియామక నిర్ణయాన్ని సైతం తప్పుబడుతూ తీర్పు ఇచ్చిందని తెలిపారు. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన పాత ఆర్డర్‌ను తీసుకు వచ్చి.. ఈ ఇద్దరితో ఎమ్మెల్సీలుగా ప్రమాణ స్వీకారం చేయించారని వివరించారు. సుప్రీంకోర్టు ఆర్డర్ కాపీ పూర్తిగా వచ్చిన తర్వాత మిగతా వివరాలు తెలుస్తాయన్నారు. సెప్టెంబర్ 17వ తేదీన సుప్రీంకోర్టు ఏం చెప్తుందో చూడాలని తెలిపారు. భవిష్యత్తులో ఏ గవర్నర్ కూడా ఇలాంటి తప్పిదాలు చేయకుండా సుప్రీంకోర్టు ఆర్డర్ ఇవ్వబోతుందని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ స్పష్టం చేశారు. 2024 ఆగస్టు 14న సుప్రీంకోర్టు తీర్పులో మార్పులు చేసిందని గుర్తు చేశారు.

# గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకం రద్దు

ఆగస్టు 14, 2024 తీర్పులో మార్పులు చేస్తూ.. వారి నియామకం చెల్లదని తీర్పును వెలువరించింది. తదుపరి విచారణను సెప్టెంబర్ 17వ తేదీకి వాయిదా వేసింది. తెలంగాణ జనసమితి అధ్యక్షుడు కోదండరామ్, అమీర్ అలీఖాన్ నియామకాలపై సర్వోన్నత న్యాయస్థానం స్టే విధించింది. వారి నియామకాలను నిలిపివేస్తూ తీర్పు ఇచ్చింది. తదుపరి ఉత్తర్వులకు అనుగుణంగా ఎంపిక ఉండాలని పేర్కొంటూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను ధర్మాసనం సవరించింది. మధ్యంతర ఉత్తర్వుల తర్వాత ప్రమాణస్వీకారం చేయడం తప్పు అని సుప్రీంకోర్టు పేర్కొంది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చాక గవర్నర్ కోటాలో కోదండరామ్, ఆమీర్ అలీఖాన్ నియామకమైన విషయం తెలిసిందే. ఇద్దరిని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా నామినేట్ చేసింది. అయితే, దీన్ని సవాల్ చేస్తూ బీఆర్‌ఎస్ అప్పటి ఎమ్మెల్సీ అభ్యర్థులు దాసోజు శ్రావణ్, సత్యనారాయణ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు ఆయా పిటిషన్లపై విచారించిన సుప్రీంకోర్టు.. ఎమ్మెల్సీలుగా కోదండ రామ్, ఆలీఖాన్ ప్రమాణ స్వీకారాన్ని తప్పుపట్టింది. గతంలో ఇద్దరు ఎమ్మెల్సీల ఎన్నికపై సుప్రీంకోర్టు స్టే విధించిన విషయం తెలిసిందే. తదుపరి ఉత్తర్వులకు అనుగుణంగా ఎంపిక ఉండాలని మధ్యంతర ఉత్తర్వులు వెలువరించింది. గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను ధర్మాసనం సవరించింది. మధ్యంతర ఉత్తర్వుల తర్వాత ప్రమాణస్వీకారం చేయడం తప్పని సుప్రీంకోర్టు పేర్కొంది. ఉత్తర్వులు జారీ చేస్తామని జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహత ధర్మాసనం స్పష్టం చేసింది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు కేసీఆర్ ప్రభుత్వం ఎమ్మెల్సీలుగా దాసోజు శ్రావణ్, సత్యనారాయణను ఎమ్మెల్సీలుగా నామినేట్ చేసింది. వీరిద్దరిని అభ్యర్థిత్వాలను అప్పటి గవర్నర్ తమిళసై తిరస్కరించారు. గవర్నర్ అభ్యర్థిత్వాలను తిరస్కరించడంతో శ్రావణ్, సత్యనారాయణ ఇద్దరూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఎన్నికల అనంతరం 2024 జనవరి 13న ప్రొఫెసర్ కోదండ రామ్, అలీఖాన్ పేర్లను రేవంత్‌రెడ్డి సర్కారు ప్రతిపాదించింది. గవర్నర్ వీరిద్దరి అభ్యర్థిత్వాలను ఆమోదించారు. గవర్నర్ నిర్ణయంపై హైకోర్టును ఆశ్రయించారు. కోదండ రామ్, అలీఖాన్ నియామకాలను హైకోర్టు రద్దు చేసింది. ఆ తర్వాత మరోసారి రేవంత్ సర్కారు మళ్లీ అవే పేర్లను గవర్నర్‌కు సిఫారసు చేసింది. గవర్నర్ ఆమోదంతో ఇద్దరు ఎమ్మెల్సీలుగా నియామకమయ్యారు. గవర్నర్ నిర్ణయంపై ఆగస్టు 4న దాసోజు శ్రవణ్, సత్యనారాయణ ఇద్దరు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గవర్నర్ కార్యాలయం సైతం సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం కోదండ రామ్, ఆలీఖాన్ ప్రమాణస్వీకారాన్ని తప్పుపట్టింది. అయితే ఈ విషయంపై తాజాగా ఎమ్మెల్సీ ఆమీర్ అలీఖాన్ స్పందించారు. సుప్రీం కోర్టు ఈ విధమైన తీర్పు ఇస్తుందని అనుకోలేదని అసహనం వ్యక్తం చేశారు. కోర్టు ఆర్డర్ చదివిన తర్వాత అన్ని మాట్లాడుతానని పేర్కొన్నారు. లాయర్ కాల్ చేసి సుప్రీం కోర్టులో జరిగిన విషయాలు చెప్పారని వివరించారు. తాను మొన్నటి వరకు జర్నలిస్టును అని ఎలాంటి రాజకీయం బ్యాక్ గ్రౌండ్ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తనతో ఇంకా ప్రభుత్వ పెద్దలు మాట్లాడలేదని అలీఖాన్ స్పష్టం చేశారు.

# సావర్కర్, గాడ్సే భావజాలం వారితో ప్రమాదం

ఈ నేపథ్యంలో తనకు అవసరమైన భద్రత అందించడం కేంద్రం బాధ్యత అని పేర్కొన్నారు. 2023లో లండన్ పర్యటన సమయంలో సావర్కర్‌ను ఉద్దేశిస్తూ రాహుల్ గాంధీ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో సావర్కర్ మునిమనవడు సాత్యకి సావర్కర్ ఆయనపై పరువునష్టం దావా దాఖలు చేశారు. ఈ కేసుకు సంబంధించి ప్రాథమిక ఆధారాలు ఉన్నట్లు- పోలీసులు గతంలో తేల్చారు. దీనిపై పుణెలోని ప్రజాప్రతినిధుల కోర్టులో విచారణ ఇంకా ప్రారంభం కావాల్సి ఉంది. ఈ క్రమంలోనే రాహుల్ గాంధీ తరఫు న్యాయవాది కోర్టుకు తాజాగా ఓ వినతిపత్రం సమర్పించారు. తనకు నాథూరాం గాడ్సే, సావర్కర్ కుటుంబాలతో సంబంధం ఉందని సాత్యకి గతంలో వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఆయన గత చరిత్రను దృష్టిలో పెట్టుకుని, ప్రస్తుత రాజకీయ వాతావరణాన్ని పరిగణనలోకి తీసుకుంటే.. సావర్కర్, గాడ్సే భావజాలానికి మద్దతు ఇచ్చే వ్యక్తుల నుంచి రాహుల్ గాంధీకి ముప్పు పొంచి ఉండే అవకాశాలను కొట్టిపారేయలేం. ఇటు-వంటి పరిస్థితుల్లో ఆయనకు రక్షణ కల్పించడం రాజ్యాంగబద్ధమైన బాధ్యతని అందులో పేర్కొన్నారు. విచారణను ఆలస్యం చేయాలనే ఉద్దేశంతోనే రాహుల్ గాంధీ ఈ అప్లికేషన్‌ను దాఖలు చేశారని సాత్యకి సావర్కర్ ఆరోపించారు. అందులో పేర్కొన్న వాస్తవాలకు, ప్రస్తుత కేసుతో ఎటు-వంటి సంబంధం లేదని మీడియాతో అన్నారు. ఇదిలా ఉండగా.. ఈ కేసులో రాహుల్ గాంధీకి కోర్టు ఇప్పటికే బెయిల్ మంజూరు చేసింది.

# యూరియాను బీహార్‌కు తరలిస్తున్నారు



కేసీఆర్ ఉన్నప్పుడు ఈ గోస లేదని.. కాంగ్రెస్ వచ్చాక నీళ్ళు లేవు, యూరియా లేదు అంటూ రైతులు ఆవేదన వెలిబుచ్చారు. యూరియా ఎప్పుడు వేసుకోవాలి.. ఎప్పుడు పంట పండాలి అంటూ ఆందోళన వ్యక్తం చేశారు.కేసీఆర్ హయంలో హమాలీ ఖర్చులు ఇచ్చి ఇంటికి యూరియా పంపించామని హరీశ్‌రావు గుర్తు చేశారు. ఉదయం నుండి రైతులు వచ్చి ఇబ్బందులు పడుతుంటే పట్టించుకొనే అధికారి లేడు అని అగ్రికల్చర్ అధికారులపై హరీశ్‌రావు సీరియస్ అయ్యారు. 8 మంది బీజేపీ ఎంపీలు గెలిచి రాష్ట్రానికి ఎరువుల కొరత తీర్చడంలో విఫలం అయ్యారని హరీశ్‌రావు మండిపడ్డారు. ఇద్దరు కేంద్ర మంత్రులు ఉండి ఎరువుల కొరతపై నోరు మెదపడం లేదు.. రైతుల ఉసరు ఉట్టిగా పోదు.. 4 రోజుల నుండి వ్యసాయ పనులు వృధా చేసుకొని యూరియా కోసం రైతులు పడిగాపులు కాస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్, బిజేపీలకు తగిన గుణపాఠం చెపుతారని హరీశ్‌రావు పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి 51 సార్లు ఢిల్లీకి పోయాడు.. కానీ ఎరువుల కొరత తీర్చలేదు. మీ ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి అన్నాడు. రేవంత్ రెడ్డి తిట్లు- ఎక్కువ పని తక్కువ అని. ప్రజలకు కావాల్సింది తిట్లు కాదు, పని కావాలి. రేవంత్ రెడ్డికి తిట్ల మీద ఉన్న ధ్యాస.. పని మీద లేదు. రైతులు సూటిగా అడుగుతున్నారు కేసీఆర్ ఉన్నపుడు ఎరువులు ఎట్లా వచ్చాయి.. ఇప్పుడు ఎట్లా రావు అని. వెంటనే ఓటీ-పీ, ఒక్క బస్తా విధానాన్ని తొలగించాలని డిమాండ్ చేస్తున్నట్లు- హరీశ్‌రావు పేర్కొన్నారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో ఎరువుల ఇబ్బంది లేదు. ప్రతి మండలానికి గోదాంలు ఏర్పాటు- చేసుకొని, వేసవి కాలంలోనే ఎరువులు స్టాక్ పెట్టినం. గ్రామం నుండి రైతు కాలు బయట పెట్టకుండా.. హమాలీ, ట్రాన్స్‌పోర్ట్ ఖర్చు లేకుండా రైతు సమయం వృధా కాకుండ గ్రామంలోనే ఎరువులు అందిచాం. నాలుగు రోజుల నుండి ఇక్కడికి వచ్చి ఉంటే ఒక్క బస్తా ఇస్తామని చెప్పడం బాధాకరం. దేవుడు దర్శనం దొరుకుతుంది కానీ ఎరువుల బస్తా దొరకడం లేదని మహిళా రైతు భాగ్యమ్మ చెప్పడం ఈ ప్రభుత్వం రైతుల పట్ల చిన్న చూపునకు నిదర్శనం. వెంటనే ఓటీ-పీ విధానం, ఒక బస్తా విధానంను తీసేయాలని డిమాండ్ చేశారు. రైతుల అవసరాలకు అనుగుణంగా ఎరువుల బస్తాలు ఇవ్వాలని డిమాండ్ హరీశ్‌రావు డిమాండ్ చేశారు. మళ్ళీ పాత రోజులు వచ్చాయి.. ఇదేనా కాంగ్రెస్ మార్పు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ రైతు వ్యతిరేక ప్రభుత్వం, నానో యూరియా వాడాలని చెప్పడం రైతులపై 500 రూ. అదనపు భారం వేయడమే. నానో యూరియ తో రైతులకు ఎకరానికి రూ. 500లు భారం పడుతుంది. ప్రభుత్వం సబ్సిడీ నుండి తప్పించుకోడానికి కృత్రిమ ఎరువులను సృష్టిస్తుంది. ఎన్నికలు ఉన్నాయని బీహార్‌కు ఎరువులను తరలిస్తున్నారని హరీశ్‌రావు పేర్కొన్నారు. ప్రభుత్వం సబ్సిడీ నుంచి తప్పించుకునేందుకు కృత్రిమ కొరతను సృష్టిస్తోందని విమర్శించారు. ఎన్నికలు ఉన్నాయని బిహార్‌కు ఎరువులు తరలిస్తున్నారని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్, భాజపాకు గుణపాఠం చెప్పాలన్నారు.

# అత్యవసర సేవలకు సిద్ధంగా ఉండాలి

### భారీ వర్షాల నేపథ్యంలో మంత్రి దామోదర ఆదేశం

హైదరాబాద్,ఆగస్ట్13 : రాష్ట్రానికి 3 రోజుల పాటు భారీ వర్ష సూచన ఉన్నందున ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మంత్రి దామోదర రాజనర్సింహ సూచించారు. ఈ మేరకు బుధవారం ఉదయం ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో మంత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. హాస్పిటళ్ల సూపరింటెండెంట్లు, ఆర్‌ఎంవోలు, మెడికల్ ఆఫీసర్లు, డాక్టర్లు, సిబ్బంది ఈ మూడు రోజులు కచ్చితంగా హాస్పిటల్స్‌లోనే ఉండాలన్నారు. ఇందుకు అనుగుణంగా ఏర్పాట్లు- చేసుకోవాలన్నారు. అందరి సెలవులు రద్దు చేయాలని ఉన్నతాధికారులను మంత్రి ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో వచ్చే రోగులకు, గర్భిణులకు తక్షణమే వైద్య సేవలు అందించాలని, ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్టిమే-టె-డ్ డెలివరీ డేట్ దగ్గరగా ఉన్న గర్భిణులను హాస్పిటల్స్‌లోని బర్త్ వెయిటింగ్ రూమ్స్‌కు తరలించి సేవలందించాలన్నారు. అంబులెన్స్‌లు, 102 వాహనాలు అన్నీ సిద్ధంగా ఉంచుకోవాలని, ఎక్కడ ఎమర్జెన్సీ ఉన్నా తక్షణమే వెళ్లి పేషెంట్‌ను తరలించేలా డ్రైవర్లు, ఈఎంటీ-లను 24 గంటలు అందుబాటు-లో ఉంచుకోవాలన్నారు. హాస్పిటళ్లలో విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని, పవర్ కట్ అయిన మరుక్షణమే జనరేటర్స్ ప్రారంభించి రోగులకు ఇబ్బంది లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. భారీ వర్షాల నేపథ్యంలో హాస్పిటల్స్ లోపలికి నీరు చేరకుండా, నిల్వ ఉండకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులంతా ఈ మూడు రోజులు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ, ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.

# రాఖీ పౌర్ణమి సందర్భంగా ఆర్టీసీలో రద్దీ

హైదరాబాద్ : రాఖీ పౌర్ణమి సందర్భంగా తెలంగాణ ఆర్టీసీ బస్సులను మహిళలు పెద్ద ఎత్తున వినియోగించుకున్నారని.. ఆరు రోజుల్లో మొత్తం 3.68 కోట్ల మంది రాకపోకలు సాగించగా.. అందులో 2.51 కోట్ల ఉచిత ప్రయాణాలు ఉన్నాయని సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ తెలిపారు. ఈ నెల 9న రాఖీ పండుగ రోజున 45.62 లక్షల మంది మహిళలు ప్రయాణించగా.. ఈ నెల 11న అత్యధికంగా 45.94 లక్షల మంది రాకపోకలు సాగించారని పేర్కొన్నారు. ఒక్కరోజులో ఇంతమంది మహిళలు ప్రయాణించడం ఇదే తొలిసారి అని పేర్కొన్నారు. గత ఏడాది రాఖీకి 2.75 కోట్ల ప్రయాణికులను గమ్యస్థానాలకు చేసిందని, ఈ ఏడాది 3.68 కోట్ల మంది రాకపోకలు సాగించారన్నారు. గతేడాదితో పోలిస్తే 92.95 లక్షల మంది ఎక్కువగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారని.. ఈ ఏడాది 2.28 కోట్ల కిలోమీటర్లు ఆర్టీసీ బస్సులు తిరిగాయన్నారు. గత ఏడాదితో పోల్చితే 53 లక్షల కిలో మీటర్లను అదనంగా సంస్థ బస్సులను తిపిందని చెప్పుకొచ్చారు. రాఖీ పౌర్ణమికి మహాలక్ష్మి పథకాన్ని మహిళలు పెద్ద ఎత్తున వినియోగించుకుని ఉచితంగా రాకపోకలు సాగించడంపై రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సైతం హర్షం వ్యక్తం చేశారు. అన్నాచెల్లెల్ల బంధం ఎంత గొప్పదో ఈ రాఖీ గణాంకాలు తెలియజేస్తున్నాయన్నారు. సంస్థ సామర్థ్యాన్ని అంతా ఉపయోగిం చుకుని రాఖీ పండుగకు రికార్డుస్థాయిలో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేసిన ఆర్టీసీ అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. రాఖీ పండుగను త్యాగం చేసి, భారీ వర్షాల్లోనూ నిబద్దత, అంకితభావం, క్రమశిక్షణతో పనిచేశారంటూ ప్రశంసించారు. రద్దీలోనూ మహాలక్ష్మి-మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్య పథకాన్ని విజయవంతంగా అమలు చేశారన్నారు. ముందస్తు ప్రణాళికతో పాటు- సిబ్బంది నిబద్ధతతో పనిచేయడం వల్లే రాఖీ పండుగకు లక్షలాది మంది ప్రయాణికులను క్షేమంగా సిబ్బంది గమ్యస్థానాలకు చేర్చారని టీ-జీఎస్‌ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ తెలిపారు. ఈ రాఖీ పండుగ ఆపరేషన్స్ సంస్థలో సరికొత్త రికార్డులను నమోదు చేసిందని, ఈ నెల 11న ఒక్క రోజులో అత్యధికంగా 68.45 లక్షల మంది ప్రయాణించారని చెప్పారు. ప్రజారవాణా వ్యవస్థపై ప్రజల ఆదరాభిమానాలు ఎంతలా ఉన్నాయో చెప్పేందుకు ఈ రికార్డులే నిదర్శనమని చెప్పారు. ఆర్టీసీకి సహకరిస్తూ.. ప్రజా రవాణా వ్యవస్తను ఆదరిస్తోన్న, ప్రోత్సహిస్తోన్న ప్రయాణికులందరికీ సజ్జనార్ కృతజ్ఞతలు తెలిపారు.

# రెండేళ్లయినా ఆరు గ్యారెంటీలేవీ

హైదరాబాద్ : డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బుధవారం తన ఎక్స్ ఖాతా వేదికగా విమర్శలు గుప్పించారు. అందులోభాగంగా డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్కకు ఆరుగ గ్యారెంటీల వాగ్దానం గుర్తుందా ? అని ప్రశ్నించారు. 100 రోజులు కాదు.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి దాదాపు 2 సంవత్సరాలు అయినా ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను ఇంకా నెరవేర్చలేదంటూ మండిపడ్డారు. ఇచ్చిన హామీలు అమలు చేశామని తెలంగాణలోని ఏ గ్రామానికైనా వెళ్లి చెప్పగలరా? అంటూ డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్కను కేటిఆర్ తన ఎక్స్ ఖాతా వేదికగా సూటిగా ప్రశ్నించారు. ఇప్పటికే అబద్దాలు చెప్పిన మీ నాయకులను ప్రజలు వెంబడిస్తున్నరని ఆగ్రహం వ్యక్తం చేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు- క్యాబినెట్ మంత్రులంతా తెలంగాణలో ఎక్కడికైనా వెళ్లి.. తమ ప్రభుత్వం ఆరు హామీలు నెరవేర్చామని చెప్పాలని ఆయన సూచించారు. మీ అబద్ధాలు, తప్పుడు ప్రచారాలపై ప్రజలు మిమ్మల్ని తరిమికొట్టక పోతే.. నేను రాజకీయాలను విడిచి పెడతానంటూ డిప్యూటీ- సీఎం మల్లు భట్టి విక్రమార్కకు బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీ-ఆర్ సవాల్ విసిరారు.

# తెలంగాణ అంతటా రెండ్రోజుల పాటు రెడ్ అలర్ట్

రాష్ట్రంలో ఐదు రోజుల పాటు- గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయి. ఉత్తర తెలంగాణలో 17న వర్ష తీవ్రత అధికంగా ఉండే అవకాశం ఉంది. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో నాలుగు రోజుల పాటు- భారీ వర్షాలు కురుస్తాయని నాగరత్న తెలిపారు. సంగారెడ్డి, వికారాబాద్, మెదక్, మేడ్చల్-మల్కాజ్‌గిరి, యాదాద్రి భువనగిరి, ఖమ్మం, భద్రాద్రి, భూపాలపల్లి, ములుగు జిల్లాలకు రెడ్ కలర్ వార్నింగ్ జారీ చేసినట్లు- తెలిపారు. హైదరాబాద్, హనుమకొండ, ఆదిలాబాద్, జనగామ, కామారెడ్డి, కుమురం భీం, ఆసిఫాబాద్, మహబూబాబాద్, మంచిర్యాల, నల్గొండ, రంగారెడ్డి, సిద్దిపేట, వరంగల్ జిల్లాలకు ఆరెంజ్ కలర్ వార్నింగ్ జారీ చేసినట్లు- చెప్పారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. రాష్ట్రమంతటా రేపు కూడా వర్షాలు కొనసాగే అవకాశం ఉందని నాగరత్న వివరించారు. నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేశాం. రేపు మెదక్, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో అత్యంత భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో వర్ష తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ఇవాళ జీహెచ్‌ఎంసీ పరిధిలో రెడ్ అలర్ట్.. రేపు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశామని అన్నారు.

# బెట్టింగ్ యాప్ కేసు

### ఇడి విచారణకు హాజరైన మంచు లక్ష్మి

హైదరాబాద్ : బెట్టింగ్ యాప్ ప్రమోషన్ల కేసులో సినీ నటి మంచు లక్ష్మి బుధవారం ఇడి విచారణకు హాజరైయ్యారు. బషీర్‌బాగ్‌లోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) ప్రాంతీయ కార్యాలయానికి ఉదయం 11 గంటలకు విచారణకు వచ్చిన మంచు లక్ష్మిని అధికారులు సుమారు మూడున్నర గంటల పాటు- విచారించారు. విచారణ అనంతరం మంచు లక్ష్మి మీడియాతో మాట్లాడకుండానే వెళ్లిపోయారు. బెట్టింగ్ యాప్ ప్రమోషన్లకు సంబంధించి తీసుకున్న పారితోషకం గురించి ఇడి అధికారుల ఆరా తీసినట్లు- తెలిసింది. ఇడి అధికారులకు మంచు లక్ష్మి తన బ్యాంకు ఖాతాల వివరాలను అందచేసినట్లు- సమాచారం. కాగా, మంచు లక్ష్మి వైఓఎల్‌ఓ 247 అనే బెట్టింగ్ యాప్‌ను ప్రమోట్ చేశారు. కాగా, బెట్టింగ్ యాప్‌లు ప్రమోట్ చేశారని సినీ నటు-లు, టీవీ హోస్ట్‌లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయన్సర్లపై రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో 29 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో మనీ లాండరింగ్ జరిగిందనే కోణంలో ఇడి ఎన్‌ఫోర్స్‌మెంట్ రిపోర్ట్(ఇసిఐఆర్) రిజిస్టర్ చేసింది. ఈ క్రమంలో వరుసగా సినీ నటులను విచారిస్తోంది. ఈ కేసులో ఇడి మరికొంత మందికి నోటీసులు ఇచ్చే అవకాశం ఉన్నట్లు- తెలుస్తోంది.

# భారీ వర్షాలతో నిండుకుండలా సాగర్

### 26గేట్లు ఎత్తి నీటిని విడుదల చేసిన అధికారులు

నాగార్జునసాగర్,ఆగస్ట్13 : నాగార్జునసాగర్ జలాశయం నిండుకుండలా మారింది. దీంతో ప్రాజెక్టులో 26 గేట్లు- ఎత్తి నీరు విడుదల చేస్తున్నారు. జలాశయం వద్ద ఇన్‌ఫ్లో 2,28,601 క్యూసెక్కులు, ఔట్‌ఎ÷-లో 2,47,986 క్యూసెక్కులుగా ఉంది. నాగార్జునసాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు.. కాగా ప్రస్తుత నీటిమట్టం 589.20 అడుగులుగా నమోదైంది. పూర్తి నీటినిల్వ సామర్థం 312.04 టీ-ఎంసీలు.. కాగా ప్రస్తుతం 309.65 టీఎంసీలకు చేరింది. తెలంగాణ వ్యాప్తంగా గత వారం రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పలు జిల్లాల్లో వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. పలు చెరువులు, కుంటలు వరదలతో నిండిపోయాయి. దీంతో దుగువ ప్రాంతాలకు వరద ప్రవాహం ఉధృతంగా కొనసాగుతోంది. ఇక, భారీ వర్షాలతో నాగార్జునసాగర్ జలాశయంలోకి పెద్ద ఎత్తు వరద నీరు వచ్చే చేరుతుంది. దీంతో సాగార్ డ్యామ్ నిండుకుండలా మారింది. ఈక్రమంలో అధికారులు జలాశయం 26 గేట్లను ఎత్తి నీటిని కిందకు విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం వద్ద జలకళ సంతరించుకోవడంతో అధిక సంఖ్యలో జనాలు వస్తున్నారు. సాగర్ అందాలను చూసేందుకు వచ్చే సందర్శకులతో డ్యామ్ వద్ద సందడి వాతావరణం నెలకొంది.

# గురుకులాలపై ఇంత దిగజారుడు విమర్శలా

## 600 కోట్ల గుడ్ల అవినీతిపై ఆధారాలు చూపగలరా

## టెండర్ ప్రక్రియపూర్తి కాకుండానే మాట్లాడితే ఎలా

## ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ వ్యాఖ్యలపై మండిపడ్డ అడ్లూరి



జగిత్యాల,ఆగస్ట్13 : గురుకులాలకు కోడిగుడ్ల సరఫరా చేసేందుకు జరిగిన టెండర్లలో రూ.600 కోట్ల అవినీతి జరిగిందంటూ బిఆర్ఎస్ నేత ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్ మతిభ్రమించి మాట్లాడుతున్నారని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మండిపడ్డారు. జగిత్యాల మెడికల్ కళాశాల అతిథి గృహంలో బుధవారం ఏర్పాటు-చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి అడ్లూరి మాట్లాడుతూ..కోడిగుడ్ల సరఫరాకు సంబంధించి టెండర్ పక్రియ జరుగుతోందని, టెండర్ పక్రియలో ఉండగా రూ.600 కోట్ల అవినీతి ఎలా జరిగిందో స్పష్టం చేయాలని నిలదీశారు. ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. తెలిసీ తెలియక మాట్లాడితే సహించేది లేదన్నారు. గురుకులాల కార్యదర్శిగా పనిచేసిన ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ తన పదవికి రాజీనామా చేసి బిఎస్‌పి నేతగా గురుకులాల విషయంలో, పరిపాలనలో మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌పై ఎన్ని విమర్శలు చేశారో గుర్తుచేసుకోవాలని హితవు పలికారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో ఏ ఒక్కరోజైనా కెసిఆర్, మంత్రులు గురుకులాలకు వెళ్లి విద్యార్థుల కష్ట సుఖాలను తెలుసుకునే ప్రయత్నం చేశారా, వారితో కలిసి ఏనాడైనా భోజనం చేశారా అని నిలదీశారు. గురుకులాల్లో తరచూ ఫుడ్ పాయిజన్ ఎందుకు అవుతుందనే విషయంపై లోతుగా విచారణ చేపట్టి అల్యూమినియం పాత్రల వల్లే జరుగుతుందని గుర్తించామని అన్నారు. వాటి స్థానంలో రూ.7 కోట్లు- వెచ్చించి స్టీల్ వంట పాత్రలను అందించామని అన్నారు. గురుకులాలకు గత ప్రభుత్వం బకాయి పడ్డ రూ.400 కోట్లు- తమ ప్రభుత్వం చెల్లించిందని అన్నారు. బకాయి లేనివి లేకుండా చేసేందుకు ప్రతి మూడు నెలలకు ఒకసారి గురుకులాల బకాయిలు చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు- వివరించారు. జిఓ 17 గురించి పూర్తి అవగాహన లేని ప్రవీణ్‌కుమార్ అవినీతి జరిగిందంటూ మాట్లాడటం చూస్తే ఆశ్చర్యం వేస్తోందని అన్నారు. ఆయనతో మాట్లాడించిన వారు కూడా వాస్తవాలు తెలుసుకోవాలని చురకలంటించారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి,మైనారిటీ-విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్యనందించాలనే గొప్ప సంకల్పంతో తమ ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి యంగ్ ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను మంజూరు చేసిందని అన్నారు. రూ.200 కోట్లతో 25 ఎకరాల స్థలంలో అన్ని హంగులతో కూడిన భవనాన్ని నిర్మించేందుకు -టె-ండర్ పక్రియ చేపడుతున్నట్లు-తెలిపారు. తమది సంక్షేమ ప్రభుత్వమని, సంక్షేమ శాఖ మంత్రిగా గురుకులాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు- పేర్కొన్నారు. ఈ సమావేశంలో జగిత్యాల ఎంఎల్ఎ డాక్టర్ సంజయ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు గాజెంగి నందయ్య, ఒరుగల శ్రీనివాస్, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు

# బైక్‌ను తప్పించబోయి బోల్తాపడ్డ స్కూల్ బస్సు

నాగర్ కర్నూల్,ఆగస్ట్13 : నాగర్ కర్నూల్ జిల్లాలో పెను ప్రమాదం తప్పింది. ఓ బైక్ ను తప్పించబోయి స్కూల్ బస్సు బోల్తా పడింది. ఈ ఘటన గన్యాగుల గ్రామ శివారులో చోటు-చేసుకుంది. బుధవారం ఉదయం పెద్దకొత్తపల్లి ఆల్ సెంట్స్ మోడల్ స్కూల్ బస్సు విద్యార్థులను ఎక్కించుకుని తీసుకెళ్తుండగా.. ఎదురుగా వస్తున్న బైక్ ను తప్పించే క్రమంలో బస్సు అదుపుతప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ప్రమాద సమయంలో పొలంలో వారి నాట్లు- వేస్తున్న కూలీలు వెంటనే స్పందించి.. బస్సులో చిక్కుకున్న విద్యార్థులను సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. ఈ ఘటనలో పలువురు విద్యార్థులకు స్వల్ప గాయాలు కాగా.. మిగతా వారందరూ క్షేమంగా బయటపడటంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రమాద సమయంలో బస్సులో దాదాపు 20 మంది విద్యార్థులు ఉన్నారు.

# భారీ వర్షాలకు కట్టలేరు చెక్‌డ్యామ్‌పై వరద ఉధృతి

ఖమ్మం,ఆగస్ట్13 : జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు నదులు, వాగులు, చెరువులు పొంగిపొర్లుతున్నాయి. ఎర్రుపాలెం మండలం కట్టలేరు చెక్ డ్యాంపై నుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. అదేవిధంగా మధిర- వైరా ప్రధాన రహదారిపై కృష్ణాపురం వద్ద పాలవాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది. మరోవైపు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు సరిహద్దుగా ఉన్న మధిర చిలుకూరు సమీపంలోని కూడలి వద్ద వైరా నది, కట్టలేరు కలిసే సంగమ ప్రాంతంలో వరద ప్రవాహం ఉధృతంగా కొనసాగుతోంది. దీంతో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు

# నెక్లెస్ రోడ్డులో నేడు హర్ ఘర్ తిరంగా యాత్ర

హైదరాబాద్,ఆగస్ట్13 : దేశ ప్రజల్లో జాతీయ భావాన్ని మరింత పెంచేందుకు బిజెపి చేపట్టిన 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా గురువారం నెక్లెస్ రోడ్డు నుంచి అంబేద్కర్ విగ్రహం వరకూ భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు- ఆ పార్టీ ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్ రెడ్డి తెలిపారు. 79వ స్వాతంత్య్ర దినోత్సవం పురస్కరించుకుని మూడు రోజులుగా దేశ వ్యాప్తంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలు జరుగుతున్నాయని మనోహర్ రెడ్డి బుధవారం విలేఖరుల సమావేశంలో చెప్పారు. ఇదిలాఉండగా గురువారం ఉదయం 10.30 గంటలకు నెక్లెస్ రోడ్డు నుంచి ప్రారంభమయ్యే తిరంగా ర్యాలీలో పార్టీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ఇతర ముఖ్య నాయకులూ పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ ర్యాలీలో విద్యార్థులూ పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా 4-0 లక్షల ఇండ్లపై త్రివర్ణ పతాకాలు ఎగుర వేసేందుకు ఏర్పాట్లు-చేశామని ఆయన చెప్పారు. కుల, మతాలకు, రాజకీయాలకు అతీతంగా నాయకులు, కార్యకర్తలు, ప్రజలూ ఇందులో పాల్గొనాలని ఆయన కోరారు. ఇప్పటికే రెండు రోజులుగా తిరంగా ర్యాలీలు జరుగుతున్నాయని ఇందులో తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొంటు-న్నారని ఆయన తెలిపారు. ప్రజలంతా ఐక్యంగా నిలబడి దేశ భక్తిని చాటాలని మనోహర్ రెడ్డి కోరారు. ప్రధాని నరేంద్ర మోడి పిలుపుతో ప్రజల మధ్య జాతీయ ఐక్యతను చాటే ఘనత దక్కిందన్నారు.

# కొలిక్కిరాన సినీ కార్మికుల సమస్య

## ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు

హైదరాబాద్,ఆగస్ట్13 :సినీకార్మికుల వేతనాల పెంపు అంశం ఇంకా కొలిక్కి రాలేదని నిర్మాత, ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు తెలిపారు. నిర్మాతలు, ఫెడరేషన్ నాయకుల మధ్య చర్చలు కొనసాగుతున్నాయని, మరో రెండు, మూడు సార్లు చర్చలు జరగాల్సి ఉందన్నారు. పని విధానాలకు అంగీకరిస్తే వేతనాలు పెంచేందుకు నిర్మాతలు సుముఖంగా ఉన్నట్లు- చెప్పారు. వేతనాలు పెంచాలని గత కొద్దిరోజులుగా ఫెడరేషన్ వాళ్లు డిమాండ్ చేస్తున్నారు. అయితే, నిర్మాతల నుంచి కొన్ని షరతులు ఉన్నాయి. ముఖ్యంగా 2018, 2022లలో జరిగిన అగ్రిమెంట్స్‌లో ఉన్న రెండు షరతులను వాళ్లు అమలు చేయడం లేదు. ముందు వాటిని ఒప్పుకోవాలి. వీటితో పాటు- మరో రెండు షరతులు కూడా ఉన్నాయి. ఇదే విషయాన్ని ఛాంబర్ ద్వారా వాళ్ల దృష్టికి తీసుకొచ్చాం. వాటిపై చర్చించి తుది నిర్ణయం తీసుకుంటే, వేతనాలు పెంచడానికి నిర్మాతలు సిద్ధంగా ఉన్నాం. రూ.2వేలు కన్నా తక్కువ వేతనం తీసుకునే వారికి ఒక పర్సంటేజీ ఆఫర్ చేస్తున్నాం. దాని కన్నా ఎక్కువ వేతనం తీసుకునే వాళ్లకు మరొక పర్సంటేజీ ఇవ్వాలని ప్రతిపాదించాం. ఫెడరేషన్‌లోని అన్ని యూనియన్‌లతో మాట్లాడుకుని వస్తే, దీనిని పరిష్కరిస్తాం. దాదాపు నాలుగు గంటల పాటు- జరిగిన సమావేశంలో అన్ని అంశాలను చర్చించాం. ప్రస్తుతం సానుకూల ధోరణిలో చర్చలు జరుగుతున్నాయని దిల్‌రాజు తెలిపారు.

# పౌరసత్వం రాకుండానే సోనియాకు ఓటు

## ఓటర్ జాబితాలో పేరుపై కాంగ్రెస్ సమాధానమివ్వాలి

## భాజపా నేత అమిత్ మాలవీయ

న్యూఢిల్లీ,ఆగస్ట్13 : భారత పౌరసత్వం లభించకముందే సోనియాకు ఓటర్ల జాబితాలో పేరు ఎలా వచ్చిందని బిజెపి ప్రశ్నించింది. దీనికి కాంగ్రెస్ నేతలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేసింది. భాజపా, ఎన్నికల సంఘం కలిసి ఎన్నికల్లో 'భారీ నేరపూరిత మోసానికి' పాల్పడ్డాయని కాంగ్రెస్ ఆరోపణలు గుప్పిస్తోంది. వాటిని కాషాయ పార్టీ తిప్పి కొట్టింది. ఎన్నికల్లో అవకతవకల గురించి భారీ ప్రసంగాలు, నిరసనలు చేపడుతున్న కాంగ్రెస్ పార్టీ గతంలో ఎన్నో మోసాలకు పాల్పడిందని భాజపా నేత అమిత్ మాలవీయ అన్నారు. కాంగ్రెస్ నేత సోనియా గాంధీ భారత పౌరసత్వం పొందకముందే ఓటర్ల జాబితాలో ఆమె పేరు ఉందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో ఈ విధంగా పౌరసత్వం లేని వారికి ఓటు- హక్కు ఎలా కల్పించారో చెప్పాలని ప్రశ్నించారు. భారత ఓటర్ల జాబితాతో సోనియా గాంధీ పేరు చేర్చి అనేక ఉల్లంఘనలకు పాల్పడ్డారని మాలవీయ అన్నారు. 'భారత పౌరసత్వం పొందడానికి మూడేళ్ల ముందు ఎన్నికల జాబితాలో సోనియా గాంధీ పేరు ఉంది.. అప్పటికి ఆమె ఇటాలియన్. ఆ సమయంలో ఓటర్ల జాబితాలో ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, సంజయ్ గాంధీ, మేనకా గాంధీలతో పాటు- సోనియా గాంధీ పేరు కూడా చేర్చారు. ఈ విషయంపై 1982లో నిరసనలు వ్యక్తమవ్వడంతో ఆమె పేరును తొలగించారు. 1983 జనవరిలో తిరిగి చేర్చారు. ఆ ఏడాది ఏప్రిల్ 30న ఆమెకు భారత పౌరసత్వం మంజూరయ్యింది. ఈ విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా ప్రవర్తించింది. పౌరసత్వం లేని సోనియా గాంధీ పేరును ఓటరు జాబితాలో చేర్చి ఎన్నికల ఉల్లంఘనలకు పాల్పడిందని అమిత్ మాలవీయ ఆరోపించారు. దీనిపై కాంగ్రెస్ నేతలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను వ్యతిరేకిస్తున్న ప్రతిపక్షాలు.. మంగళవారం 'మింతా దేవి' అనే మహిళా ఓటరు ఫొటోతో ఉన్న టీ- షర్టులు ధరించి పార్లమెంట్ వెలుపల నిరసన చేపట్టిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ చేసిన పని వల్ల మీడియా వాళ్లు తమ ఇంటికి వచ్చి ప్రశ్నల మీద ప్రశ్నలు సంధిస్తున్నారని మింతా దేవి కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. అనుమతి లేకుండా తమ ఫొటోలను ఎలా ముద్రిస్తారని మండిపడ్డారు. దీనిపై కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు స్పందిస్తూ.. సాధారణ గృహిణికి సంబంధించిన వివరాలు, ఫొటోలను అనుమతి లేకుండా కాంగ్రెస్ నేతలు బయటకు ఎలా విడుదల చేశారని నిలదీశారు.

# ఐసిఐసిఐ బ్యాంక్ యూటర్న్

## కనీస నిల్వలపై నిర్ణయం వాపస్

న్యూఢిల్లీ,ఆగస్ట్13 : ప్రముఖ ప్రైవేటు రంగ బ్యాంక్ ఐసీఐసీఐ యూటర్న్ తీసుకుంది. రూ.50వేల కనీసం బ్యాలెన్స్ ఉండాలన్న నిబంధనపై వెనక్కి తగ్గింది. ఇటీవలి నిర్ణయంపై పెద్దఎత్తున విమర్శలు రావడంతో తన నిర్ణయం మార్చుకుంది. ఈ మేరకు కనీస సగటు- బ్యాలెన్స్ మొత్తాలను సవరించింది. మెట్రో,అర్బన్ ఖాతాదారులు రూ.15,000 నెలవారీ సగటు- బ్యాలెన్స్ కలిగి ఉండాలని పేర్కొంది. సెమీ అర్బన్ ప్రాంతాల్లో అయితే రూ.7,500 ఉండాలన్న నిబంధన విధించింది. గ్రామీణ ఖాతాదారులకు మాత్రం ఎప్పటిలానే రూ.2,500 సగటు మినిమమ్ బ్యాలెన్స్ ఉంచితే సరిపోతుందని పేర్కొంది. పొదుపు ఖాతాల్లో కనీస నిల్వ లేనిపక్షంలో విధిస్తున్న అపరాధ రుసుమును ప్రభుత్వరంగ బ్యాంకులు పూర్తిగా ఎత్తివేయగా.. ఐసీఐసీఐ బ్యాంక్ మాత్రం అందుకు భిన్నంగా ఖాతాదార్లకు ఇటీవల షాకిచ్చిన విషయం తెలిసిందే. పొదుపు ఖాతాల్లో కనీస నిల్వ మొత్తాన్ని భారీగా పెంచుతూ నిర్ణయం తీసుకుంది.ఆగస్టు 1 తర్వాత ఖాతా తెరిచిన వారికే వర్తిస్తుందని స్పష్టంచేసింది. మెట్రో, అర్బన్ ప్రాంతాల్లో ఖాతాదార్లు కనీస నిల్వ పరిమితిని రూ.50 వేలకు పెంచేసింది. గతంలో ఈ మొత్తం రూ.10 వేలుగా ఉండేది. సెమీ అర్బన్ ఖాతాదార్ల కనీస నిల్వ మొత్తాన్ని రూ.5 వేల నుంచి రూ.25 వేలకు పెంచింది. గ్రామీణ ఖాతాదార్లకు రూ.2,500 నుంచి రూ.10 వేలకు సవరించింది. దీనిపై ఆర్‌బీఐ జోక్యం చేసుకోనప్పటికీ.. పౌరుల నుంచి మాత్రం పెద్దఎత్తున విమర్శలు వ్యక్తమయ్యాయి. దీంతో ఈ మొత్తాలను స్వల్పంగా సవరిస్తూ తాజా నిర్ణయం తీసుకుంది.

# ఖమ్మం జిల్లాలో జోరు వర్షాలు

## ఆకేరు వాగులోని చెక్‌డ్యాం మీదుగా వరద నీరు

## గతేడాది వరదలు తలచుకుని ముందస్తు చర్యలు

ఖమ్మం,ఆగస్ట్13 : జిల్లాలో రెండు రోజులుగా జోరుగా వర్షాలు కురుస్తున్నాయి. భారీగా వరద రావటంతో పాలేరు జలాశయం మత్తడి దుంకి ప్రవహించింది. సాయంత్రం 18,500 క్యూసెక్కులకు వరద ఉధృతి పెరగటంతో అలుగు ఉప్పొంగుతోంది. ఆ స్థాయి వర్షాలు మున్నేరు ఎగువన కురిసి ఉంటే ఇప్పటికే వాగు ఉగ్రరూపం దాల్చేదే. ఆకేరు వాగులోని చెక్‌డ్యాం మీదుగా వరద నీరు పారుతోంది. పరిసరాల్లోని చెరువులు నిండటానికి సిద్ధంగా ఉన్నాయి. ఎగువ నుంచి వరద వస్తుండటంతో మున్నేరులో ప్రస్తుతం పది అడుగుల వద్ద నీరుంది. ఆకేరు పరిసరాల్లో వర్షం కురిస్తే రాత్రి వరకు 14అడుగులకు చేరుకుంటుందని నీటిపారుదలశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. మున్నేరు వరద విలయంతో గతేడాది సెప్టెంబరు 1న ఖమ్మం జిల్లాకేంద్రం అతలాకుతలమైంది. పరీవాహక కాలనీల్లోని ఇళ్లు నీట మునగటంతో జరిగిన నష్టం నుంచి పేదలు ఇంకా కోలుకోలేదు. నాటి విషాద దృశ్యాలను తలచుకుంటే ఒళ్లు జలదరిస్తుందని, భారీ వర్షాలు కురవనున్నాయని తెలిస్తే వణుకు పుడుతోందని బాధితులు ఆందోళన చెందుతున్నారు. భారీ వర్షాలు కురవనున్నాయని వాతావరణశాఖ హెచ్చరించటంతో అప్రమత్తమయ్యారు. గతంలో మున్నేరుకు వచ్చే వరదను అంచనా వేయకపోవటంతోనే రాత్రికిరాత్రే ఉపద్రవం ఎదురైంది. ఈసారైనా అధికారులు అప్రమత్తంగా ఉంటూ.. ఆకేరు వాగు, ఎగువనున్న చెరువులను ఎప్పటికప్పుడు పరిశీలించి వరద రాకను పసిగట్టి ప్రజలకు సూచనలిస్తేనే ముప్పు తప్పుతుంది. ఈనెల 14నుంచి 17వరకు భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ హెచ్చరించింది. అధికారులకు సెలవులు రద్దు చేస్తున్నామని కలెక్టర్ అనుదీప్‌ప్రకటించారు. యంత్రాంగం కార్యస్థానంలో ఉండాలన్నారు.

# బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావం

## అల్లకల్లోలంగా సముద్ర తీరం

## అప్రమత్తంగా ఉండాలని మత్స్యకారులకు హెచ్చరిక

మచిలీపట్టణం,ఆగస్ట్13 : కృష్ణా జిల్లా అవనిగడ్డ నియోజకవర్గం ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కోడూరు మండలం, పాలకాయతిప్ప వద్ద సముద్రం అల్లకల్లోలంగా మారింది. ఏడు నుంచి ఎనిమిది మీటర్ల ఉవ్వెత్తున అలలు ఎగసిపడుతున్నాయి. సముద్రం వద్దకు వెళ్లిన పర్యాటకులను స్థానిక పోలీసులు వెనక్కి పంపుతున్నారు.. మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. వారికి సంబంధించిన వేట బోట్లు-, వలలు సురక్షిత ప్రాంతాల్లో భద్ర పర్చుకోవాలని మత్స్యశాఖ అధికారులు సూచించారు. సముగద్ర అల్లకల్లోలంగా ఉండటంతో మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని కోడూరు మండల ఇన్‌ఛార్జి తాహసీల్దార్ సౌజన్య కిరణ్మయి హెచ్చరికలు జారీ చేశారు. ?మరోవైపు బంగాళాఖాతంలో మంగళవారం ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. దీని ప్రభావంతో పశ్చిమ మధ్య, వాయవ్య బంగాళాఖాతంలో బుధవారం అల్పపీడనం ఏర్పడే అవకాశముందని భారత వాతావరణ విభాగం అంచనా వేసింది. దీని ప్రభావంతో రాబోయే మూడు రోజుల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది. బుధవారం నంద్యాల, ప్రకాశం, బాపట్ల, పల్నాడు, గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వానలు, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, కాకినాడ, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, పార్వతీపురం మన్యం జిల్లాల్లో భారీ వర్షాలు పడొచ్చని వివరించింది.

# ప్రతికూల వాతావరణ పరిస్థితులు

## శంషాబాద్‌కు రావాల్సిన ఐదు విమానాల దారిమళ్లింపు

హైదరాబాద్,ఆగస్ట్13 : శంషాబాద్ ఎయిర్ పోర్ట్ కు రావలసిన ఐదు విమానాలను అధికారులు దారిమళ్లించారు. పలు ప్రాంతాల నుంచి శంషాబాద్ ఎయిర్ పోర్ట్ కు రావాల్సిన మూడు విమానాలను విజయవాడకు మళ్ళించిన ఆధికారులు.. మరో రెండు విమానాలను తిరుపతి, బెంగళూరుకు మళ్ళించారు. శంషాబాద్ ఎయిర్ పోర్ట్ లో వాతావరణం అనుకూలించకపోవడంతో దారి మళ్లించినట్లు- తెలిపారు. బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటికే భారీ వర్షాలు కురుస్తున్నాయి. గత మూడు రోజులుగా తెలంగాణతో పాటు- ఏపీలో పలు జిల్లాలు అతలాకుతలం అయ్యాయి. ప్రధాన రహదారులు చెరువుల్లా తలపిస్తున్నాయి.తెలంగాణ, ఏపీల్లో పలు గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. చెరువులు, కుంటలు ఉప్పొంగి పొర్లుతున్నాయి. రానున్న మూడు రోజుల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. తెలంగాణ రాష్ట్రంలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి , ఖమ్మం, మెదక్, మేడ్చల్ మల్కాజిగిరి, ములుగు, సంగారెడ్డి, సూర్యాపేట, వికారాబాద్ , యాదాద్రి భువనగిరి జిల్లాల్లో పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని రెడ్ అలెర్ట్ జారీ చేసింది ఐఎండీ.

# ఎమ్మెల్సీలపై సుప్రీం తీర్పు చెంపపెట్టు

## కాంగ్రెస్, బిజెపిలకు ఇదో గుణపాఠం కావాలి: కెటిఆర్

హైదరాబాద్,ఆగస్ట్13 : ఎమ్మెల్సీలు కోదండరాం, అలీఖాన్‌ల నియామకం రద్దు చేస్తూ.. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్వాగతించారు. అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చిన సంచలన తీర్పు అటు- బీజేపీకి, ఇటు కాంగ్రెస్‌కు చెంపపెట్టు అని విమర్శించారు. గతంలో బీజేపీ గవర్నర్ వ్యవస్థను దుర్వినియోగం చేసి బీఆర్ఎస్ పంపిన ఇద్దరు ఎమ్మెల్సీ ప్రతిపాదనలకు అడ్డుపడ్డారని గుర్తు చేశారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఆ పక్రియ పెండింగ్‌లో ఉండగానే మరో ఇద్దరి పేర్లను సిఫార్సు చేసి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిందని మండిపడ్డారు. బీఆర్ఎస్ గతంలో నామినేట్ చేసిన బడుగు, బలహీనవర్గాలకు చెందిన దాసోజు శ్రవణ్, సత్యనారాయణల అభ్యర్థిత్వాలకు అడ్డుతగిలిన కాంగ్రెస్, బీజేపీల నిజస్వరూపం మరోసారి బట్టబయలైందని ఆయన పేర్కొన్నారు. రాజ్యాంగంపై ఏమాత్రం గౌరవం లేని ఈ రెండు ఢిల్లీ పార్టీల అప్రజాస్వామిక విధానాలు ఎంతమాత్రం సాగనివ్వమని చాటిచెప్పిన న్యాయవ్యవస్థకు బీఆర్ఎస్ పక్షాన శిరస్సు వంచి సలాం చేస్తున్నట్లు కేటీఆర్ స్పష్టం చేశారు.

# రాహుల్‌పైనా మీ విమర్శలు

## జగన్ తీరుపై మండిపడ్డ చామల

హైదరాబాద్,ఆగస్ట్13 : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిపై వైకాపా అధ్యక్షుడు జగన్ చేసిన వ్యాఖ్యలు సరికాదని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో జగన్ చేసిన వ్యాఖ్యలపై చామల స్పందించారు. ఏపీ ఎన్నికలపై రాహుల్ మాట్లాడలేదనడం సరికాదు. చంద్రబాబు, రేవంత్ వల్లే రాహుల్ మాట్లాడలేదని జగన్ అన్నారు. ఎన్నికల్లో ఓడిపోయినా ఆయన ఆలోచనా విధానం మారలేదు. ఏపీలో తప్పులు జరిగితే ఈసీ, మోదీని విమర్శించండి. వారిని తప్పుపట్టకుండా రాహుల్‌ను విమర్శించడమేంటి? విజయవాడ ధర్నాలో రాహుల్‌తో కలిసి జగన్ పాల్గొనాలని చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు.

# మీరు దాడి చేస్తే.. బ్రహ్మోస్‌తో జవాబుచెబుతాం

## పాక్ ప్రధాని వ్యాఖ్యలపై మండిపడ్డ ఓవైసీ

హైదరాబాద్ : తాము సింధూ జలాల కోసం ఎంత వరకైనా పోరాడతామన్న పాక్ ప్రధాని వ్యాఖ్యలపై మైదరాబాద్ ఎంపిఓవైసీ ఘాటుగా స్పందించారు. ఈ హెచ్చరికలపై తాజాగా హైదరాబాద్ ఎంపీ, ఏఐఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ స్పందించారు. అర్థంలేని మాటలు మాట్లాడొదంటూ ఫైర్ అయ్యారు. మీరు కయ్యానికి కాలు దువ్వితే మేము ఏం ఖాళీగా కూర్చోము అని సమాధానం ఇచ్చారు. మా వద్ద బ్రహ్మోస్ ఉన్నాయి. పాక్ ప్రధాని ఇలాంటి చెత్తమాటలు మాట్లాడటం మానుకోవాలంటూ హెచ్చరించారు. ఇలాంటి బెదిరింపులు భారత్ విషయంలో ఎంతమాత్రం పనిచేయవని స్పష్టం చేశారు. ఇక చాలు అయ్యిందేదో అయిపోయిందని అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. గతంలో పాక్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ 'అణు' హెచ్చరికలు చేయడాన్ని కూడా ఒవైసీ తిప్పికొట్టారు. భారత్ విషయంలో ఆయన మాట్లాడిన మాటలు, వాడిన పదజాలం గర్హనీయమని అన్నారు. అమెరికా వేదిక నుంచి ఆయన ఈ మాటలు మాట్లాడటం దురదృష్టకరమన్నారు.

# పాతకక్షలకు వ్యక్తి దారుణ హత్య

నెల్లూరు,ఆగస్ట్13 : నగరంలో పాత కక్షలు ఓ నిండు ప్రాణాన్ని బలి తీసుకున్నాయి. నెల్లూరు అలంకార్ సెంటర్‌లో కొందరు వ్యక్తులు ఓ యువకుడిని దారుణంగా హత్య చేశారు. లైక్ అనే యువకుడిపై దుండుగులు కత్తితో దాడి చేయడంతో అతను ప్రాణాలు కోల్పోయాడు. నూర్ అనే యువకుడికి లైక్‌కి పాత కక్షలు ఉన్నాయని.. ఈ నేపథ్యంలోనే హత్య జరిగిన ఉండొచ్చని పోలీసులు చెబుతున్నారు. ఒకప్పుడు వీరిద్దరు స్నేహితులుగా ఉన్నట్లు- తెలుస్తోంది.

# సంపాదకీయం

## పార్లమెంట్ సమావేశాలు ఎందకు?

బీహార్‌లో ఓట్ల సవరణలో జరిగిన అవతవకలు వేరు...పార్లమెంట్‌లో చర్చించాల్సిన అంశాలు వేరు. ఈ రెంటినీ ఒకే గాటన కట్టిన విపక్షాలు పార్లమెంట్ వర్షాకాల సమావేశాలను వృధా చేశాయి. సమస్యలపై చర్చించే అవకాశం ఉన్నా...ప్రభుత్వాన్ని నిలదీసే ప్రయత్నం చేయలేదు. కేవలం ఆందోళనతో తాము అనుకున్న లక్ష్యాన్ని చేరుకున్నారు. పార్లమెంట్‌ను స్తంభింపచేయడమే అతిపెద్ద గోల్ అన్నట్లుగా విపక్షాల తీరు కొనసాగింది. దీంతో జూలై 21న ప్రారంభమైన పార్లమెంట్ సమావేశాల్లో ఒక్కటే చర్చ జరిగింది. ఆపరేషన్ సిందూర్ తప్ప మరో అంశం చర్చకు రాలేదు. దీనికి విపక్షాలదే బాధ్యత. వీలైనన్ని ఎక్కువ సమస్యలు, ముఖ్యంగా ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను లేవనెత్తి చర్చించివుంటే బాగుండేది. ప్రతిపక్షాలు లేవనెత్తిన అంశాలపై చర్చ జరిపించడం కోసం అధికారంలో ఉన్నవారు ఎప్పుడూ ముందుకు రారు. అయితే వాయిదా తీర్మానాల రూపంలో వాటిని ప్రస్తావిస్తే కుదరదు. పార్లమెంట్ నిబంధనల మేరకు చర్చను కోరివుంటే బీహార్ ఓట్ల సవరణ అంశం కూడా చర్చకు వచ్చేది. కానీ విపక్షాలకు అలా చేయడం ఇష్టం లేదు. గందరగళం సృష్టిస్తేనే మంచిది. పార్లమెంటు సమావేశాలు ఒకప్పుడు అర్థవంతమైన చర్చలు, వాదోపవాదాలతో ఎంతో ఆసక్తి కలిగించేవి. ప్రధాన సమస్యలపై చర్చకు ప్రభుత్వాలు కూడా అనుమతించేవి. అయితే ఆనాటి నాకులు వేరు. వారు ఎంతో హుందాతనం కలిగిన వారు. కానీ ఇప్పుడు విపక్షాలకు సమస్యలపై చర్చ చేయడం కన్నా ప్రభుత్వం విమర్శలుచేశామా, పార్లమెంట్ నడవకుండా చేశామా లేదా అన్నదే ముఖ్యంగా కనిపిస్తోంది. అందుకే ఈ వర్షాకాల సమావేశాల్లో ఆపరేషన్ సిందూర్‌పై తప్ప ఏ అంశంపైనా చర్చ జరగకుండా పోయింది. 'ఆపరేషన్ సిందూర్' తర్వాత పార్లమెంటులో ప్రభుత్వం ఏదైనా జవాబు చెబుతుందా అని ప్రతిపక్షాలతో పాటు ప్రజలు కూడా ఆశించారు. కానీ రెండు రోజుల సుదీర్ఘ చర్చ, ప్రధానమంత్రి నరేంద్రమోదీ సుదీర్ఘ ప్రసంగం తర్వాత కూడా అనేక ప్రశ్నలకు జవాబులు లభించకుండా మిగిలిపోయాయి. ముఖ్యంగా పహల్గామ్ సంఘటనకు దారి తీసిన భద్రతా వైఫల్యం నుంచి ఆపరేషన్ సిందూర్ కేవలం 88 గంటల్లోనే ముగించిన తీరుపై ప్రజల్లో అనుమానాలు ఉన్నాయి. పాక్‌కు బుద్ధి చెప్పే అవకాశం వచ్చినా కాల్పుల విరమణకు అంగీకరించడం జరిగింది. ఇకపోతే ఈ ఆపరేషన్ తరవాత పాక్ పట్ల అమెరికా స్నేహంగా వ్యవహరించడం చూస్తున్నాం. సంఘటనకు కారకులైన ఉగ్రవాదుల ఆచూకీ, విదేశాంగ విధానం గురించి ప్రజల్లోను, ప్రతిపక్షాల్లోనూ ఉన్న ప్రశ్నలకు సమాధానాలు రాలేదు. ఇకపోతే బిహార్‌లో ఎస్ఐఆర్ పేరిట జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణ గురించి ప్రతిపక్షాలు తీవ్ర గందరగోళం సృష్టిస్తున్నప్పటికీ దానిపై మాట్లాడేందుకు ప్రభుత్వం సిద్ధంగా లేదు.ఎస్ఐఆర్‌పై గందరగోళం జరుగుతున్న సమయం లోనే ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ దేశంలో ఓట్ల చోరీ జరుగుతోందని ఆరోపించారు. గత పార్లమెంటు ఎన్నికల్లో కర్ణాటకలో ఒక అసెంబ్లీ నియోజకవర్గంలోనే లక్షకు పైగా బోగస్ ఓట్ల పోలింగ్ జరిగిందని ఆయన సాక్ష్యాధారాలతో బయటపెట్టారు. దేశంలో ఎన్నికల కమిషన్ బీజేపీని గెలిపించేందుకు చేసే ప్రయత్నాల్లో భాగంగానే ఈ ఓట్ల చోరీ జరుగుతోందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఎస్ఐఆర్ పైనే కాదు, ఓట్ల చోరీపై కూడా ఉభయ సభల్లో ప్రతిపక్షాలు వాయిదా తీర్మానాలు ప్రవేశపెట్టి చర్చను డిమాండ్ చేశారు. అయితే ఈ అంశాలపైచర్చకు పార్లమెంట్ రూల్స్ ప్రకారం అవకాశం ఉంది. కానీ విపక్షాలు దానిని ఉపయోగించుకోలేదు. పార్లమెంటులో చర్చించి ఎన్నికల సంస్కరణలపై ప్రతిపక్షాలతో కలిసి ఏకాభిప్రాయం తెచ్చేందుకు ప్రయత్నిస్తే బాగుండేది. ఒక్క బీహార్ గురించి కాకుండా మొత్తం ఎన్నికల సంస్కరణలపై చర్చించి ఉంటే విపక్షాలకు గౌరవం దక్కేది. దేశానికి ప్రయోజనం కలిగేది. దొంగ ఓట్లు లేకుండా పర్మినెంట్ ఓటర్ల ముసాయిదా ఉండేలా చేయించుకునే అవకాశం ఉండేది. అయితే విపక్షాల లక్ష్యం వేరు కనక వారు ఆ దిశగా ఆలోచన చేయలేదు. పార్లమెంటును సాగనివ్వకపోవడం వల్ల ప్రతిపక్షాలకు ప్రయోజనం లభించక పోవచ్చు. ప్రతిపక్షాలు లేవనెత్తుతున్న ప్రశ్నలకు జవాబు ఎప్పలేకపోతే,పార్లమెంటును వాయిదా వేసివుంటే విపక్షాల వాదనకు ప్రజల్లో ఆమోదం లభిస్తుంది. ప్రభుత్వం ప్రజలకు జవాబుచెప్పుకోలేని పరిస్థితిలో పడుతుంది. ప్రతిరోజూ పార్లమెంటు ఆవరణలో ప్రతిపక్షాలు నిర్వహిస్తున్న నిరసన ప్రదర్శనలు, ఎన్నికల కమిషన్‌కు ఊరేగింపుగా వెళ్ళి అనేకమంది అరెస్టు కావడం వంటి సంఘటనలు కావాలని కోరుకున్నవే. విపక్షాలు గందరగోళానికి ప్రాధాన్యం ఇచ్చారే తప్ప సమస్య పరిష్కారం కోసం కాదన్నది ముమ్మాటికీ నిజం. మొత్తంగా పార్లమెంట్ సమావేశాలను విపక్షాలు కావాలనే దుర్వినియోగ పరిచారు. కేవలం రాజకీయ ప్రయోజనాలు ఆశించి చేసిన వ్యవహారం తప్ప మరోటి కాదు. ఇదే సమయాన్ని ప్రజల కోసం ఉపయోగిం చుకుని, ఆయా అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీసి ఉంటే బాగుండేది. విపక్షాల తీరు కారణంగా జిఎస్టి, ధరలు,నిరుద్యోగం, అమెరికాతో సంబంధాలు వంటి అనేకానేక అంశాలు చర్చకునోచుకోకుండా పోయాయి. గత ఐదారేళ్లుగా ఇలాగే జరుగుతోంది. ఇది వాంఛనీయంకాదు. పార్లమెంట్ అన్నది ప్రజల సమస్యలను చర్చించడానికి అన్న విషయం మరచిపోతున్నారు. అధికార, విపక్షాలకు ఇదో తంతుగా మారింది. ప్రజలు ఏమయితే మనకేంటన్న ధోరణిలో ఉన్నారు. ఓట్లు వేశారా, అధికారంలో ఉన్నామా లేదా అన్న తీరుమారాలి. ప్రధాన సమస్యల విషయంలో ఇకముందు అయినా పద్దతి మారాలి.

# ఓట్ల చోరీపై ఆగని విపక్షాల పోరు



బీహార్‌లో ఓట్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్), ఓట్ల చోరీపై కాంగ్రెస్‌తోసహా 'ఇండియా' కూటమి నేతలు నిరంతర పోరాటం సాగిస్తున్నారు. ఈ మేరకు సోమవారం ర్యాలీగా బయలుదేరిన నేతలను పోలీసులు అడ్డుకుని ప్రియాంక గాంధీ, అఖిలేష్ యాదవ్, శివసేన నేత సంజయ్ రౌత్ సహా 29 మంది ఎంపిలను అదుపులోకి తీసుకుని తరువాత విడిచిపెట్టిన సంగతి తెలిసిందే. ఓట్ల చోరీపై ప్రారంభమైన భారీ ప్రజా ఉద్యమంలో గడచిన 24 గంటల్లోనే 15 లక్షల మంది మద్దతుగా తమ ధ్రువీకరణ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవడం, అలాగే 10 లక్షల మిస్ కాల్స్ రావడం ఈ ఉద్యమానికి మద్దతు విశేషంగా పెరుగుతుందనడానికి సంకేతం. మంగళవారం కూడా ఈ పోరు కొనసాగింది. పార్లమెంట్ ఉభయ సభలు వాయిదా పడడంతో పార్లమెంట్ వెలుపల కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీతో సహా పలువురు ప్రతిపక్ష నేతలు 'మింతాదేవి' అనే బీహార్ ఓటరు ఫోటోతో ఉన్న టీషర్టులు ధరించి నిరసన నిర్వహించారు. బీహార్ ఓటరు మింతాదేవి వయసు 124 ఏళ్లుగా ఓటరు ఐడి కార్డులో ముద్రించి ఉండడం ఎన్నికల కమిషన్ ఓటర్ల జాబితా తయారీలో అక్రమాలు జరిగాయనడానికి సాక్షంగా విపక్షాలు నినాదాలు చేశారు. ప్రపంచంలోనే అత్యంత వృద్ధ వ్యక్తి వయసు కంటే మింతాదేవి వయసే ఎక్కువని రాహుల్ వ్యాఖ్యానించారు. కేంద్ర ఎన్నికల సంఘం తన పని తాను సక్రమంగా చేయడం లేదని, దీని తీరు భారత రాజ్యాంగాన్ని అపహాస్యం చేసేలా ఉందని విమర్శించారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఒక మనిషి, ఒక ఓటు అనేది రాజ్యాంగానికి భూమిక అని, కానీ ఎన్నికల కమిషన్ దీన్ని తుంగలో తొక్కిందని, ఇది రాజ్యాంగానికి విఘాతమని రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు. రాజ్యాంగ పరిరక్షణలో వెనకడుగు వేసే ప్రసక్తే లేదన్నారు. బిజెపి, కేంద్ర ఎన్నికల సంఘం కుమ్మక్కై ఎన్నికల్లో భారీ మోసానికి పాల్పడ్డాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ గత కొద్ది రోజులుగా సంచలన ఆరోపణలు చేస్తున్నారు. 'ప్రజాస్వామ్యం వినాశనమైంది' అన్న నినాదంతో ఆయన ఇండియా కూటమి నేతలకు ప్రజెంటేషన్ కూడా ఇచ్చారు. ఓటు చోరీకి వ్యతిరేకంగా ఒక వెబ్ పేజీని ప్రారంభించారు. అవకతవకలు గుర్తిస్తే ఈ వెబ్ పేజీకి ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్ వెలుపల మీడియాతో లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ మాట్లాడుతూ గత ఏడాది కర్ణాటక, మహారాష్ట్రల్లో బిజెపితో కలిసి ఓట్ల చోరీ చేసిన ఎన్నికల కమిషన్ ఈ ఏడాది చివర్లో జరగనున్న బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఓట్ల చోరీకి ప్రత్యేక సమగ్ర సవరణ పేరుతో సన్నద్ధమవుతోందని ఆరోపించారు. ఒకటి రెండు సీట్లలో కాకుండా చాలా సీట్లలో ఓట్ల చోరీ జరుగుతోందని, ఇది ఒక పద్ధతిలో జాతీయ స్థాయిలో జరుగుతోందని విమర్శించారు. ఇదంతా ఎన్నికల కమిషన్‌కు తెలుసనీ, గతంలో దీనికి ఆధారాలు లేవనీ, ఇప్పుడు ఉన్నాయని పేర్కొన్నారు. ఇప్పుడు ఈ పోరు మరో మలుపు తిరిగింది. గత సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్ల జాబితాలో అక్రమాలు చోటుచేసుకున్నందున లోక్‌సభ ఎన్నికలు మళ్లీ నిర్వహించాలని డిమాండ్ విపక్షాల నుంచి వస్తోంది. తప్పుల ఓటర్ల జాబితా ఆధారంగా బిజెపి అధికారం లోకి వచ్చిందని, ప్రధాని మోడీ, హెూం మంత్రి అమిత్ షాలు ఆ విధంగానే ఎన్నికయ్యారని, అందువల్ల లోక్‌సభను రద్దు చేసి కొత్తగా ఎన్నికలు నిర్వహించాలని మంగళవారం తృణమూల్ కాంగ్రెస్ ఎంపి అభిషేక్ బెనర్జీ డిమాండ్ చేశారు. గుజరాత్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌ల్లో ఓటర్ల జాబితాలు సరిగ్గానే ఉన్నాయని, బెంగాల్, బీహార్‌లో మాత్రమే తప్పుగా ఉన్నాయని ఇసి చెప్పడం అనుమానాలను తావిస్తోంది. ఎస్ఐఆర్‌ను నిర్వహించాలనుకుంటే ముందుగా లోక్‌సభను రద్దు చేయాలని, ఆ తరువాత దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్‌ను నిర్వహించాలని విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. బీహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ నిర్వహించాలన్న ఎన్నికల కమిషన్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీం కోర్టు మంగళవారం కూడా విచారణ చేపట్టింది. బీహార్‌లో ఓ నియోజక వర్గంలో 12 మంది చనిపోయారని ఇసి పేర్కొందని, కానీ వారు బతికే ఉన్నారని ఆర్‌జెడి నేత మనోజ్ ఝా తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబాల్ కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. అంతేకాదు మరో సందర్భంలో బతికే ఉన్న వ్యక్తులను చనిపోయినట్టు ప్రకటించినట్టు బయటపడింది. అయితే ఎన్నికల కమిషన్ మాత్రం ఇది కేవలం ముసాయిదా జాబితా కావడం వల్ల ఈ తప్పిదాలను సరిదిద్దవచ్చని చెప్పింది. ఈ సందర్భంగా వాస్తవాలు, గణాంకాలతో సిద్ధంగా ఉండాలని ఎన్నికల సంఘానికి సుప్రీం ధర్మాసనం సూచించడం గమనార్హం. ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభానికి ముందు ఎంతమంది ఓటర్లు ఉన్నారు, గతంలో నమోదైన మరణాల సంఖ్య, ఇప్పుడు నమోదు చేసిన మరణాల సంఖ్య తదితర వివరాలపై ప్రశ్నలు ఎదురయ్యే అవకాశం ఉందని సుప్రీం కోర్టు అభిప్రాయపడింది. ప్రాథమిక పత్రాలుగా ఆధార్, రేషన్ కార్డుతోపాటు స్వయంగా ఓటరు ఐడీ కార్డును పరిగణనలోకి తీసుకోవాలని సుప్రీం కోర్టు ఎన్నికల కమిషన్‌కు మొదట సూచించిన సంగతి తెలిసిందే. కానీ అప్పటికే సవరణ ప్రక్రియ పూర్తిచేసి ఆగస్టు 1న ముసాయిదా జాబితాను ఎన్నికల కమిషన్ ప్రచురించింది. సవరణ ప్రక్రియకు ముందు బీహార్‌లో మొత్తం నమోదిత ఓటర్ల సంఖ్య 7.9 కోట్లు ఉండగా, ముసాయిదా జాబితాలో 7.24 కోట్లకు సంఖ్య తగ్గింది. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 30 న తుది జాబితా విడుదల కానుంది. మరి ఆ జాబితా ఎంతవరకు సక్రమంగా ఉంటుందో చూడాలి.

## బీహార్‌లో ఓటర్ల జాబితా సవరణపై విచారణ

### ఎక్కువ ధృవీకరణ పత్రాలకు అనుమతి మంచిదే

### విచారణ సందర్భంగా సుప్రీం వ్యాఖ్య

న్యూఢిల్లీ,ఆగస్ట్13 : బీహార్‌లో ఓటర్ల జాబితాను సవరించాలనే ఎన్నికల కమిషన్ నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు బుధవారం మరోసారి విచారించింది. ఈ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చీ ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. గతంలో ఏడు ధ్రువీకరణ పత్రాలకంటే.. ప్రస్తుతం 11 పత్రాలను అనుమతించడం ఓటర్లకు ప్రయోజనకరంగా ఉంటుందని ధర్మాసనం పేర్కొంది. ఆధార్ మినహా అనేక ఇతర డాక్యుమెంట్లను పరిగణలోకి తీసుకోవడాన్ని ధర్మాసనం గుర్తు చేసింది. గతంలో బిహార్‌లో నిర్వహించిన రివిజన్‌లో ఏడు ధ్రువీకరపత్రాలను అనుమతించారని.. ప్రత్యేక సవరణలో 11 డాక్యుమెంట్లను ఈసీ అనుమతి ఇస్తుందని.. దీన్ని పరిశీలిస్తే ఓటర్లకు అనుకూలంగానే కనిపిస్తుందని ధర్మాసనం తెలిపింది. ఆధార్ అనుమతించడం లేదనే పిటిషనర్ల వాదనను అర్థం చేసుకున్న ప్పటికీ అనేక పత్రాలను పరిగణలోకి తీసుకుంటున్నట్లుగా ధర్మాసనం గుర్తు చేసింది. అయితే, ఈ వాదనలతో పిటిషనర్ తరఫు న్యాయవాది అభిషేక్ సింఘ్వీ విభేదించారు. ధ్రువపత్రాల సంఖ్య ఎక్కువగా ఉన్నా.. అందరికీ అందుబాటులో లేవని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పాస్‌పోర్టులను ఉదహరించారు. బిహార్‌లో కేవలం ఒకటి నుంచి రెండుశాతం మంది వద్దే పాస్ పోస్టులు ఉన్నాయన్నారు. దీనికి స్పందించిన ధర్మాసనం 36లక్షల మందికి పాస్‌పోర్టులు ఉన్నాయని.. ఇది మంచి సంఖ్యగానే కనిపిస్తోందని చెప్పింది. ఆయా ప్రభుత్వ విభాగాల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకున్న తర్వాతే ధ్రువపత్రాల జాబితా రూపొందిస్తారని జస్టిస్ జోయ్‌మల్య బాగ్చీ తెలిపారు. ఇదిలా ఉండగా.. ఈ అంశంపై మంగళవారం సైతం సుప్రీంకోర్టులో విచారణ జరిగిన విషయం తెలిసిందే. పౌరులను చేర్చడం, కానివారిని ఓటరు జాబితా నుంచి మినహాయించడం ఎన్నికల కమిషన్ అధికార పరిధిలోనిదని ధర్మాసనం పేర్కొంది. సర్‌లో ఆధార్, ఓటర్ కార్డును పౌరసత్వానికి రుజువుగా పరిగణించలేమన్న ఈసీ వాదనలను సమర్థించింది. పార్లమెంట్ లోపల, వెలుపల 'సర్' అంశంపై వివాదం పెరుగుతున్న నేపథ్యంలో.. ఈసీ చేపట్టిన ఈ కార్యక్రమంపై విశ్వాసం కోల్పోవడమే సమస్య అని.. అంతకు మించి ఏమీ లేదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.

## కుక్కల తరలింపు తీర్పు పరిశీలిస్తా

### అభ్యంతరాల నేపథ్యంలో సుప్రీం చీఫ్ జస్టిస్ వెల్లడి

న్యూఢిల్లీ : కుక్కల తరలింపు అంశపై సుప్రీం చీఫ్ జస్టిస్ సానుకూలంగా స్పందించారు. దీనిని సమీక్షిస్తానని వెల్లడించారు. ఢిల్లీ, ఎన్‌సీఆర్ ప్రాంతం నుంచి వీధి కుక్కలన్నింటినీ తొలగించాలంటూ సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పుపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. సుప్రీం తీర్పుపై జంతు హక్కుల సంస్థలు ఆక్షేపణ తెలిపాయి. ఈ నేపథ్యంలో తీర్పు ఉత్తర్వులను తాను పరిశీలిస్తానని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ పేర్కొన్నారు. వీధి కుక్కల దాడుల వల్ల ఢిల్లీ, ఎన్సీఆర్‌ల పరిధిలో రేబిస్ మరణాల సంఖ్య పెరుగుతోందని వస్తున్న వార్తలను పరిగణనలోకి తీసుకున్న జస్టిస్ పార్దివాలా, జస్టిస్ ఆర్. మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం.. 8 వారాల్లోపు అన్ని వీధి కుక్కలను షెల్టర్లకు తరలించాలని ఆదేశించిన సంగతి తెలిసిందే. ఢిల్లీలో ఎక్కడా వీధి కుక్కలు ఉండటానికి వీల్లేదని స్పష్టంచేసింది. ఈ చర్యలను అడ్డుకోవడానికి ఏవైనా సంస్థలు ప్రయత్నిస్తే కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించింది. దీనిపై కేంద్ర ప్రభుత్వ వాదనలు మాత్రమే వింటామని.. తమ ఆదేశాలకు వ్యతిరేకంగా జంతు ప్రేమికులు, ఇతర పార్టీలు, సంస్థలు వేసిన పిటిషన్లను విచారించబోమని స్పష్టం చేసింది. కేంద్ర మాజీమంత్రి, జంతు హక్కుల కార్యకర్త మేనకా గాంధీ అభ్యంతరం తెలిపారు. తీర్పు ఆచరణ సాధ్యం కాదన్నారు. ఢిల్లీలో 3 లక్షల వీధికుక్కలు ఉన్నాయి. వీటికోసం 3 వేల షెల్టర్లు కావాలి. వీటి ఏర్పాటుకు రూ.15 వేల కోట్లు ఖర్చు చేసే పరిస్థితిలో ఢిల్లీ ప్రభుత్వం ఉందా? అని ప్రశ్నించారు. ఈ తీర్పు దశాబ్దాలుగా మనం అనుసరిస్తూ వచ్చిన మానవీయ, సైన్స్ ఆధారిత విధానాల నుంచి వెనకడుగు వేసినట్లుగా ఉందని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. వీధి కుక్కలన్నింటినీ గంపగుత్తగా తొలగించాలన్న నిర్ణయం క్రూరమైనదని అన్నారు. కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకాగాంధీ, ప్రముఖ సినీనటులు జాన్ అబ్రహాం, జాన్వీ కపూర్, వరుణ్ ధావన్, సిద్ధార్థ్ ఆనంద్, అడివి శేష్ తదితరులు వీధి కుక్కల సంరక్షణపై స్పందించారు. దీంతో చీఫ్ జస్టిస్ గవాయ్ పెద్ద మనసుతో ముందుకు వచ్చారు. తీర్పును సమీక్షిస్తానని ప్రకటించారు.

## కంచగచ్చిబౌలి భూముల్లో పర్యావరణం పునరుద్ధరణ

### తెలంగాణ ప్రభుత్వం చర్యలకు సుప్రీం అభినందన

న్యూఢిల్లీ : కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై బుధవారం సుప్రీంకోర్టులో మరోమారు విచారణ జరిగింది. కంచ గచ్చిబౌలి భూముల్లో పర్యావరణ పునరుద్ధరణ చర్యలు చేపడుతున్నామని కోర్టుకు తెలంగాణ ప్రభుత్వం తెలిపింది. సమగ్ర ప్రణాళికను సమర్పించేందుకు ఆరు వారాలు గడువు కోరింది ప్రభుత్వం. తదుపరి విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది సీజేఐ జస్టిస్ బీ.ఆర్ గవాయి ధర్మాసనం. అభివృద్ధికి తాము అడ్డుకాదని సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది. పర్యావరణ పరిరక్షణను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ సూచించారు. కంచ గచ్చిబౌలి భూముల్లో ప్రభుత్వ పర్యావరణ పరిరక్షణ చర్యలు మంచి ఫలితాలు ఇస్తే తప్పకుండా మెచ్చుకుంటామని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ అభిప్రాయం వ్యక్తం చేశారు.

## పశ్చాత్తాప శ్రమ దినాలు

మానవుడు ఎంతటి మహనీయుడో, తప్పులు చేసి అంతటి బలహీనుడైపోతాడు కూడా. ఆ బలహీనత నుంచి మళ్లీ కోలుకోవాలి. తిరిగి శక్తిని పుంజుకోవాలి. ఇక్కడే ప్రతి మనిషీ తన మతాన్ని, దైవశక్తినీ ఆశ్రయిస్తాడు. ఈ ప్రక్రియలో భాగంగా ఒక్కో మతం ఒక్కో రకమైన నియమాలు సూచిస్తున్నది. క్రైస్తవ సమాజం నలభైరోజులపాటు క్రీస్తుకు శిలువ వేసిన సంఘటనలు ధ్యానించుకొంటుంది. శుభ శుక్రవారానికి కచ్చితంగా నలభై రోజుల ముందు నుంచే ఈ నియమాలు పాటిస్తారు. ప్రభువు మరణానికి సంబంధించి ఆయన ప్రజల కోసం పడిన పాట్లు ధ్యానించుకుంటారు. ఈ నేపథ్యంలో తాము చేసిన తప్పులు, పాపాలను తలుచుకుంటారు. అంటే అబద్ధాలు ఆడటం దగ్గర నుంచి ఇతరుల్ని మోసం చేయడం, హింసించడం, ద్వేషించడం, సోమరితనానికి అలవాటు పడి ఇతరుల శ్రమను దోచుకోవడం లాంటి దుష్కార్యాలను సంస్కరించుకుంటారు. ఇలాంటి పనులు ఇక మీదట చేయకూడదని మనసు మార్చుకొనే ప్రయత్నం చేస్తారు. తమ ప్రవర్తనను మార్చుకోవడానికి ప్రభువు బోధనలను స్మరించుకుంటారు. ఇందుకోసం ఈ నలభై రోజులను ఆధ్యాత్మికంగా గడిపే ప్రయత్నం చేస్తారు. క్రైస్తవ సమాజం ఈ నలభై రోజులను పశ్చాత్తాప శ్రమ దినాలుగా పేర్కొన్నది. ఈ కాలంలో క్రీస్తుకు దగ్గర కావడానికి కొంత శ్రమపూరిత జీవన విధానంతో, చిత్తశుద్ధితో పాటించి తీరాలని నిర్ణయించుకొంటారు. ముఖ్యంగా విలాసవంతమైన ఆహారపానీ యాలకు దూరంగా ఉంటారు. సుఖసౌఖ్య భోగాల్ని తగ్గించుకుంటారు. త్యాగమయ జీవనాన్ని కొనసాగిస్తారు. ఉపవాసాలు ఆచరిస్తారు, ఉపదేశాలను వింటారు. జీవన విలువ తెలుసుకొని, జీవిత పరమార్థం సాధించుకోడానికి ప్రయత్నిస్తారు.



ఆధ్యాత్మికం

# ముస్లింల సంక్షేమానికి కృషి

- ఝాన్సీ రెడ్డిని కలిసిన మసీదు కమిటీ సభ్యులు







**తొర్రూరు, (ది క్రైమ్ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో టిపిసిసి ఉపాధ్యక్షురాలు హనుమాన్ల ఝాన్సీ రాజేందర్రెడ్డి ని తొర్రూర్ జమా మసీద్ నూతన కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పుష్ప పుచ్ఛంతో ఘనంగా సత్కరించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన మజీద్ కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ అలీమ్, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అమీర్, కోశాధికారి గౌస్ మొహినుద్దీన్, కమిటీ సభ్యులను శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఝాన్సీ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లిం ల సంక్షేమానికి కట్టుబడి ఉంటుందని, తొర్రూరులోని ముస్లిం కమ్యూనిటీ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ముస్లింల అభ్యున్నతికి తమ సహకారం ఎప్పటికి ఉంటుందని తెలిపారు. నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ తమ ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ముస్లిం సోదరులు మహమ్మద్ మౌలానా పాషా, యం డి షబ్బీర్ అలీ, ఎండి యాకూబ్ పాషా, ఎస్ డి చాంద్ పాషా, ఎండీ యాకుబ్, ఎండి ఎజాస్, ఎండి గని, మహమ్మద్ ఇస్లాం, గుంశావలి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బీఎస్ఎన్ఎల్ టవర్ ఉన్నా.. సిగ్నల్ మాత్రం శూన్యం

**ముత్తారం.ఆగష్టు.13.(ది క్రైమ్ న్యూస్):** ముత్తారం మండల పరిసర ప్రాంత ప్రజలు బీఎస్ఎన్ఎల్ నెట్వర్క్ సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ పరిధిలో బీఎస్ఎన్ఎల్ టవర్ ఉన్నప్పటికీ సిగ్నల్ అందకపోవడం వలన ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఓటీపీలు రాకపోవడం, ప్రభుత్వ ఉద్యోగులతో మాట్లాడడం వంటి అత్యవసర పరిస్థితుల్లో కాల్స్ కూడా సాధ్యం కాకపోవడం అసౌకర్యానికి దారి తీస్తోంది. విద్యుత్తు లేని సమయంలో సిగ్నల్ మరింత తీవ్రంగా మారుతోంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు, గుత్తేదారులు తక్షణ చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

BSNL Connecting India Faster

## పూర్వ విద్యార్థుల గుర్తుగా బీరువా బహుకరణ



**ముత్తారం.ఆగష్టు.13.(ది క్రైమ్ న్యూస్):** ముత్తారం మండలంలోని అడవి శ్రీరాంపూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పూర్వ విద్యార్థులు వారి గుర్తుగా పాఠశాలకు బీరువాను బహూకరించారు. 2003-04 సంవత్సరంలో 10వ తరగతి వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులంతా కలిసి వారి గుర్తుగా పాఠశాల అవసరాలకై ముఖ్యమైన వస్తువులను భద్రపరచుకోవడానికి బీరువాను బహుకరించారు. బీరువాను బహూకరించిన పూర్వ విద్యార్థులకు ఉపాధ్యాయ బృందం కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు,అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్,ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## రైతులపై ఎరువుల వ్యాపారుల అత్యుత్సాహం



**ముత్తారం.ఆగష్టు.13.(ది క్రైమ్ న్యూస్):** ముత్తారం మండలంలోని రైతులు యూరియా బస్తాల కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని పలు ఎరువుల దుకాణాల్లో రైతులు యూరియా బస్తా కొనుగోలు చేయాలంటే ఇతర ఎరువులను తప్పనిసరిగా కొనుగోలు చేయాలనీ వ్యాపారులు షరతులు పెడుతున్నట్లు రైతులు ఆరోపించారు. యూరియా బస్తా ధర రూ.267 కాగా,రూ.300 పైగా వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.వీటిపై సంబంధిత అధికారులు స్పందించి వెంటనే దుకాణాలపై తనిఖీలు నిర్వహించి దోపిడీని అరికట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

## స్వామి వారిని దర్శించుకున్న ధర్మపురి నూతన ఎం.ఆర్.ఓ శ్రీనివాస్



**ధర్మపురి, ఆగష్టు 13, (ది క్రైమ్ న్యూస్):** ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానమునకు నూతన తహశీల్దార్ గా నియామకం అయిన శ్రీనివాస్ ముందుగా శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని అలాగే అనుబంధ దేవాలయంలో గల స్వామివార్లను బుధవారం దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. తదుపరి దేవస్థానం పక్షాన వేద పండితులు అర్చకులు ఆశీర్వచనం ఇచ్చిన తదుపరి దేవస్థాన ట్రస్ట్ బోర్డు చైర్మన్ అధ్యక్షులు జక్కు రవీందర్ శ్రీ స్వామివారి శేష వస్త్రం ప్రసాదం చిత్రపటం ఇచ్చి సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో దేవస్థానం ట్రస్ట్ బోర్డు అధ్యక్షులు జక్కు రవీందర్ తో పాటు దేవస్థానం వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ, ట్రస్ట్ బోర్డ్ సభ్యులు రాపర్తి సాయికిరణ్, ముఖ్య అర్చకులు చిలక ముక్కు రమణయ్య, అర్చకులు నంబి నరసింహమూర్తి, సీనియర్ అసిస్టెంట్ అల్వాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

# టాస్క్ కోర్సుల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించాలి

◆ డిగ్రీ, ఇంజనీరింగ్ ముగిసిన విద్యార్థులు టాస్క్ కోర్సులలో నమోదు చేసుకోవాలి ◆ టామ్ కామ్ ద్వారా విదేశాలలో ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలి ◆ యువతకు ఉపాధి కల్పన పై డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌లతో సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష





**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** జిల్లాలో ఉన్న ప్రాంతీయ టాస్క్ సెంటర్ ద్వారా అందించే కోర్సుల పై విద్యార్థులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష యువతకు ఉపాధి కల్పన పై డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ లతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, మన జిల్లాలో డిగ్రీ ఇంజనీరింగ్ వివిధ వృత్తి కోర్సులు చదివే విద్యార్థులకు మంచి ఉపాధి అవకాశాలు లభించేలా వారికి అవసరమైన వివిధ నైపుణ్యాలలో శిక్షణ అందించేందుకు ప్రాంతీయ టాస్క్ సెంటర్ ద్వారా వివిధ కోర్సులు ఉచితంగా అందిస్తున్నామని అన్నారు. పెద్దపల్లి టాస్క్ కేంద్రంలో శిక్షణ పొందిన విద్యార్థులకు మల్టీ నేషనల్ కంపెనీల నుంచి 3 నుంచి 7 లక్షల ప్యాకేజీలతో ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయని అన్నారు. ఆగస్టు 2025 నెలలో టాస్క్ కేంద్రం నుండి నూతనంగా 7 విద్యార్థులకు ఆఫర్ లెటర్స్ వచ్చాయని అన్నారు.పెద్దపల్లి ప్రాంతీయ టాస్క్ సెంటర్ లో డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన నిరుద్యోగ యువత యువకులకు వివిధ కోర్సులలో శిక్షణ ఉచితంగా అందించి ఉద్యోగ అవకాశాలు కూడా చూపించడం జరుగుతుందని అన్నారు. టాస్క్ కోర్సుల పట్ల డిగ్రీ ,ఇంజనీరింగ్ కళాశాలలో చదివి విద్యార్థులకు అవగాహన ఉండేలా ప్రిన్సిపల్స్ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోరారు.టామ్ కామ్ ద్వారా విదేశాలలో వివిధ ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయని, వీటిని మనం జిల్లాలో అర్హత కల్గిన నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. యువతకు నాణ్యమైన ఉపాధి అవకాశాలు సృష్టించేందుకు అవసరమైన నైపుణ్య శిక్షణ కోసం నిధులు, లాజిస్టిక్స్ ఇతర సౌకర్యాల కల్పనకు జిల్లా కలెక్టరేట్ నుంచి సంపూర్ణ సహకారం అందిస్తామని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధి అధికారి తిరుపతి రావు, ముఖ్య ప్రణాళిక అధికారి రవీందర్, టాస్క్ సిబ్బంది కౌసల్య, గంగ ప్రసాద్, డిగ్రీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్స్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సమస్య రహిత డివిజన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం

◆ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్





కూకట్పల్లి ఆగస్టు 13 (ది క్రైమ్ న్యూస్): అభివృద్ధి పనుల్లో రాజీలేని కృషి చేస్తున్నట్లు కూకట్పల్లి సర్కిల్ ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని ఇంద్రహిల్స్ కాలనీ లో డ్రైనేజీ, సీసీ రోడ్ల కు సంబంధించిన పెండింగ్ వర్క్స్ ఉన్నాయని కాలనీ వాసులు డివిజన్ కార్పొరేటర్ శ్రీ దొడ్ల వెంకటేష్ గౌడ్ దృష్టికి తీసుకురాగా స్పందించిన కార్పొరేటర్ ఇంద్రహిల్స్ కాలనీ లో పాదయాత్ర చేసి సమస్యలను జి.ఎచ్.ఎం.సి ఇంజినీరింగ్, జలమండలి, హైడ్రా అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీ లో డ్రైనేజీ లైన్ తరుచుగా పొంగి ఓవర్ ఫ్లో అవ్వడంతో కాలనీ వాసులు ఇబ్బంది పడుతున్నారని, మ్యాన్ హొల్స్ లో మట్టి పూడుకుపోయి సమస్య ఏర్పడుతుందని మ్యాన్ హొల్స్ లోపల ప్లాస్టింగ్ చేసి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు తెలిపారు. అదేవిధంగా కాలనీ లో కొంతమేర పెండింగ్ లో ఉన్న సీసీ రోడ్లను కూడా త్వరలో నిర్మాణ పనులు చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. ఇప్పటికే ఇంద్రహిల్స్ కాలనీ లో డ్రైనేజీ, సీసీ రోడ్లు, త్రాగు నీరు వంటి అన్ని మౌలిక సదుపాయాలు అందించి అభివృద్ధి చేశామని, కొంతమేర మిగిలి ఉన్న పెండింగ్ వర్క్స్ కూడా పూర్తిచేసి ఆదర్శవంతమైన కాలనీగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు వెంకట్ నాయక్, రామారావు, నాగేందర్, కిషోర్, రమేష్, విఠల్, విజయ్, శ్రీశైలం, రాకేష్, వర్క్ ఇన్స్పెక్టర్ రవి కుమార్, సూపర్వైజర్ శివ, హైడ్రా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గంజాయికి వ్యతిరేకంగా విద్యార్థులు ఉద్యమించాలి

◆ ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు ఇరుగురాల భూమేశ్వర్



**జగిత్యాల, ఆగస్ట్,13 (ది క్రైమ్ న్యూస్):** అఖిల భారత విద్యార్థి సమైక్య ఏఐఎస్ఎఫ్ 90 ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జగిత్యాల జిల్లా కేంద్రంలోని స్థానిక ఎస్ కె ఎన్ ఆర్ జూనియర్ కళాశాల ముందు అఖిల భారత విద్యార్థి సమైక్య ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. (ఏఐఎస్ఎఫ్) మాజీ నాయకులు ఇరుగురాల భూమేశ్వర్ ముఖ్య అతిథిగా హాజరయ్యి జెండా ఆవిష్కరణ చేసి ఏఐఎస్ఎఫ్ విద్యార్తి నాయకులకు స్వీట్లు పంపిణీ చేసి ఈ సందర్భంగా మాట్లాడుతూ 1936 ఆగస్టు 12 న ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం లక్నో బెనారస్ లో ఏఐఎస్ఎఫ్ ఏర్పాడి నేటికి 90 ఏళ్ళు అయింది చదువుతూ పోరాడు చదువుకై పోరాడు అని నినదించి స్వాతంత్ర్య పోరాటాల్లో పాల్గొనీ తెలంగాణ తొలి దశ మలి దశ ఉద్యమంలో పాల్గొని పోరాడిన చరిత గల భారత దేశ మొట్ట మొదటి ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని 90 వ వసంతం ల్లోకి అడుగుపెడుతుందని. ఏఐఎస్ఎఫ్ జెండాను విద్యార్థులు తమ హక్కుగా చేర్చుకొని విద్య వ్యతిరేక పోరాటాలు చేయాలని పిలుపు ఇచ్చారు.ఒకవైపు ప్రభుత్వం అరకొర నిధులు ఇచ్చి విద్యను నిర్లక్ష్యం చేస్తుంటే మరో వైపు విచ్చలవిడిగా గంజాయి సరఫరా జరుగుతున్న అధికార యంత్రాంగం దాన్ని నియంత్రణ చేయడం లో విఫలము అవుతుంది ఇది కొంత మంది విద్యార్థుల పై తీవ్రంగా ప్రభావం పడుతుంది అని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు గంజాయికి వ్యతిరేకంగా పోరాడాలని భవిష్యత్తు సమర శిల పోరాటాలకు విద్యార్థులు సిద్దంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు వెన్న మహేష్ ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి అక్రమాలీక్ ఉపాధ్యక్షులు మంద రాకేష్ వర్కింగ్ ప్రెసిడెంట్ భుక్య భరత్ రాథోడ్ వేణు సంజయ్ రేవంత్ సాయి హర్ష నిఖిల్ మణి దీప్ సోహైల్ సాహిబ్ సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

# పేద ప్రజల అభివృద్దే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్





**ఎండపల్లి,ఆగస్టు13(ది క్రైమ్ న్యూస్ ):** పేద ప్రజల అభివృద్దే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. బుధవారం రోజున నూతనంగా ఏర్పడిన ఎండపల్లి మండల కేంద్రంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని అధికారులతో కలిసి ప్రారంభించారు.అనంతరం ఎండపల్లి ఎంపీడీవో నరేష్ కుమార్ ను తన చాంబర్లో కూర్చోబెట్టి స్వీట్లు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ... ప్రజల సౌకర్యార్థం కొరకే నూతన ఎంపీడీవో కార్యాలయాన్ని ప్రారంభించామని తెలిపారు. ఇంతకుముందు ఏ అభివృద్ధి పనులు ఉన్న ఉమ్మడి వెల్గటూర్ లోని కొన్ని గ్రామాలు వెల్గటూర్ కి, మరికొన్ని గ్రామాల ప్రజలు పాలకుర్తి మండలానికి పనులకై వెళ్లేవారని ఇప్పుడు అందరికీ అందుబాటులోనే కార్యాలయాన్ని మండల కేంద్రంలోనే ఏర్పాటు చేయడం జరిగిందని దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అభివృద్ధిలోనే ఎండపల్లి మండలం ముందంజలో ఉండాలని దీనికి అందరు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో అనిల్ కుమార్, ఆర్ ఐ అన్వేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తాటిపర్తి శైలేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చేర్మెన్ గుండేటి గోపిక జితేందర్ రెడ్డి, గాజుల విజయ్,గెల్లు శ్రీనివాస్, పుదారి రమేష్, సంఘ రమేష్, సోమిశెట్టి రమేష్, బాలసాని మల్లేశం గౌడ్, రంగు తిరుపతి, అందుర్తి గంగాధర్, బురగడ్డ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# మెగా రక్తదాన శిబిరంకు విశేష స్పందన

**ధర్మపురి ఆగష్టు 13, (ది క్రైమ్ న్యూస్):** ధర్మపురి పట్టణం లోని స్థానిక మాత్ర శ్రీ ఏసీ ఫంక్షన్ హాల్ లో బుధవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. ధర్మపురి కి చెందిన కస్తూరి శరత్ కుమార్ న్యాయవాది పది సంవత్సరాల క్రితం 13/8/2015 రోజున ధర్మపురి బ్లడ్ బ్యాంక్ అనే పేరుతో వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ గ్రూప్ ద్వారా బండారి అనిల్, కస్తూరి శరత్, మరియు వారి మిత్రులు ధర్మపురి యువకులు వివిధ ప్రాంతాల్లో అత్యవసర పరిస్థితుల్లో ఉన్న బాధితులకు సరైన సమయంలో రక్తదానం చేసి ప్రాణాలు కాపాడటం జరిగింది. ఇట్టి గ్రూప్ ఏర్పాటు చేసి నేటికి 10 సంవత్సరాలు పూర్తి అవుతున్న సందర్భంగా బండారి అనిల్, కస్తూరి శరత్ కుమార్, వాట్సప్ గ్రూప్ టీమ్ అధ్వర్యంలో పట్టణంలోని స్థానిక మాత్ర శ్రీ ఏసీ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో సుమారు 32 మంది యువకులు రక్తదానం చేయడం జరిగిందని ఆర్గనైజింగ్ గ్రూప్ సభ్యులు తెలిపారు. ఈ రక్తాన్ని జగిత్యాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని బ్లడ్ బ్యాంక్ కి ఇవ్వడం జరిగిందని వారు పేర్కొన్నారు. నూతన డోనార్ లకి జ్యోతి హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో రక్త నమూనా పరీక్షలు ఏర్పాటు చేయడం జరిగిందని వారు వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ పిల్లల వైద్యులు



డా. ఎల్లాల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రక్తదానం చేయాలి అంటే ఆరోగ్యవంతంగా ఉండాలి అని ఆరోగ్యవంతమైన పోషకాలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలి అని జంక్ ఫుడ్ లకి దూరంగా ఉండాలని ఆరోగ్యంగా ఉన్నప్పుడే మీరు మానసికంగా దృఢంగా ఉండి అనుకున్న లక్ష్యాలు సాధించ గలుగుతారని అదేవిధంగా ఆల్కహాల్ గంజాయి డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఆయన తెలిపారు. వాటి బారినపడి వారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు అని ఉన్నత చదువులు చదువుకొని తల్లితండ్రులకి






మంచి పేరు ప్రఖ్యాతలు తెచ్చి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డా, ఇందారపు రామకృష్ణ, డా మామిడి వినయ్, ఉపాధ్యాయులు గొల్లపల్లి గణేష్, చల్ల శ్రీనివాస్, గరిగె శ్రీనివాస్, వేముల గోపికృష్ణ. శ్రీనివాస్, సాయి, ల్యాబ్ టెక్నీషియన్ తిరుపతి మరియు కేరళ ఇంగ్లీష్ మీడియం, ఆంగ్లోవేదిక్ ఏ.సి.ఈ స్కూల్ లకు చెందిన సుమారు 200 మంది విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు.

# వ్యక్తి నిర్మాణంతోనే దేశం నిర్మితమవుతుంది

### - ఆర్.ఎస్.ఎస్.జిల్లా ప్రచార ప్రాముఖ్ రంగు లక్ష్మీ నరహరి

**ధర్మపురి, ఆగష్టు 13, (ది క్రైమ్ న్యూస్):** వ్యక్తి నిర్మాణం తోనే దేశం నిర్మితమవుతుందని ఆర్.ఎస్.ఎస్.జిల్లా ప్రచార ప్రాముఖ్ రంగు లక్ష్మీ నరహరి అన్నారు. రాష్ట్రీయ స్వయంసేవక సంఘ ప్రచార విభాగం ఆధ్వర్యంలో కర్నే అక్క పెల్లి కళ్యాణ మండపంలో కేవలం ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా విలేకరుల కోసం బుధవారం ఏర్పాటు చేసిన రక్షాబంధన కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు సంగనభట్ల రామకృష్ణయ్య పాల్గొని మాట్లాడుతూ 1925 సంవత్సరంలో ప్రారంభమై దేశమంతా విస్తరించిన ఆర్ఎస్ఎస్ ధర్మపురిలో 1965 సంవత్సరంలో ప్రారంభమైందని అన్నారు. ఐ.జె.యూ. రాష్ట్ర సభ్యులు, సీనియర్ పాత్రికేయులు ధర్మపురి పట్టణానికి చెందిన జైస్ కిరణ్ సురేందర్ మాట్లాడుతూ రక్షలు కట్టుకోవడం వల్ల సమాజం లేదా వ్యక్తుల మధ్యన ఆత్మీయత అనుభందం ఏర్పడుతుందని అన్నారు. అనంతరం ధర్మపురి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మధు మహాదేవ్ మాట్లాడుతూ క్రమశిక్షణ అనుశాసనము, దేశభక్తి సంస్కృతి పట్ల రక్షణ అవగాహన ఏర్పడతాయని అన్నారు. చిన్నప్పుడు నేను కూడా శాఖకు వెళ్లాలని అక్కడ అనేక విషయాలు తెలుసుకున్నానని కొంక వరప్రసాద్ అన్నారు. రక్షాబంధనం అన్నా చెల్లెలు అక్క తమ్ముళ్ల మధ్య సహజంగా జరుగుతుందని రాష్ట్రీయ స్వయం సేవక సంఘంలో స్వయం



సేవకులందరూ ఒకరికి ఒకరు రక్ష కట్టుకోవడం ద్వారా ఈ దేశం నాది ఈ దేశాన్ని ధర్మాన్ని రక్షించాలనే భావన నిర్మాణం చేస్తుందని పేర్కొన్నారు. సమాజంలో ఉచ్చ నీచ భావనని తొలగించడం కోసం సమరసత సాధించాలని, హక్కులతో పాటు బాధ్యతలతో మెలగాలని, పర్యావరణ పరిరక్షణ కోసం అలాగే కుటుంబ జీవన విలువలు పెంపొందించుకోవాలని వ్యక్తి నిర్మాణం తోనే దేశం నిర్మితమవుతుందని ఆర్.ఎస్.ఎస్. జిల్లా ప్రచార ప్రాముఖ్ రంగు లక్ష్మీ నరహరి అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పత్రికల విలేకరులు మరియు ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు పాల్గొన్నారు.

# కట్ల రంగారావు ఆధ్వర్యంలో ఘనంగా రాజ్యసభ సభ్యురాలు రేణుక చౌదరి జన్మదిన వేడులు వృద్ధాశ్రమంలో అన్నదానం....

**ఖమ్మం ఉమ్మడి జిల్లా, ప్రతినిధి, ఆగష్టు 13 (ది క్రైమ్ న్యూస్):** కేంద్ర మాజీ మంత్రి,రాజ్యసభ సభ్యురాలు రేణుక చౌదరి జన్మదినాన్ని పురస్కరించుకొని టిపిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు ఆధ్వర్యంలో వైరా లో బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు జన్మదిన కేక్ ను కట్ల రంగారావు తో పాటు రాష్ట్ర మాజీ మార్క్ ఫెడ్ వైస్ చైర్మన్ బొర్రా. రాజశేఖర్, వైరా మాజీ మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు శీలం.వెంకట నర్సిరెడ్డి కలిసి కేక్ ను కట్ చేశారు. మిఠాయిలు పంచిపెట్టారు.అనంతరం వైరా మండల పరిధిలోని గొల్లపూడి గ్రామం లోని వృద్ధాశ్రమం నందు వృద్ధులకు, అనాధ పిల్లలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు మాట్లాడుతూ రేణుక చౌదరి కార్పొరేటర్ స్థాయి నుంచి జాతీయస్థాయిలో కేంద్ర మంత్రివర్యులుగా ఎన్నో పదవులను అలంకరించి ఖమ్మం జిల్లా ఆడబిడ్డగా జిల్లా అభివృద్ధికి ఎంతో కృషి చేశారని వారు నిండు నూరేళ్లు ఆయురారోగ్య ఐశ్వర్యాలతో మరిన్ని ఉన్నత పదవులు అదిరోదించాలని భద్రాచల సీతారాముల వారి ఆశీస్సులు మెండుగా ఉండాలని ఆకాంక్షించారు.. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వైరా వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బిడికే రత్నం,ఎస్డి అన్వర్, రేచర్ల నాగేశ్వరరావు, మిట్టపల్లి నాగి, రేచర్ల రాముడు, ధర్నా రాజశేఖర్, గుత్తికొండ. వీరబాబు, రాచబంటి.రామకృష్ణ, తేజావత్ రామకృష్ణ, కట్ల సంతోష్, కట్ల నాగరాజు, ఎస్కే మోషిన్, రేచర్ల సత్యం, జాలాద్రి రామకృష్ణ, రేచర్ల పుల్లయ్య, యమాల భాస్కర్, దేవిశెట్టి సైదులు, మణిదీపు, మూల దుర్గా ప్రసాద్, వైరా నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు గరిడేపల్లి కిషోర్, తెలగవరపు సురేష్, బుడిగి వెంకన్న, గుడిమల్ల రత్తయ్య, అబ్బూరి కాంతయ్య, దగ్గుపాటి రవి, జాకోబు, రేచర్ల విశ్వనాథం, రేచర్ల ప్రభాకర్, రేచర్ల జనార్ధన్, రేచర్ల నరసింహా రావు, ,, కట్ల సాయికుమార్, గొల్లపూడి గ్రామ కాంగ్రెస్ నాయకులు ఎస్కే సైదా, మేదూరి రామారావు, మిట్టపల్లి సతీష్, విరపోలు వెంకటప్పయ్య, గ్రంధి ప్రవీణ్, మిట్టపల్లి శ్రీను, దాసరి రాము, బండ్ల కృష్ణ, ఏపూరి సతీష్, ఎస్కే రసూల్, షేక్ అఫ్జల్, శభాష్ రామారావు, ఎస్.కె అబ్దుల్, ఎస్డి అలీమ్ తదితరులు పాల్గొన్నారు.





# వివాహ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు



**తిమ్మాపూర్, ఆగష్టు 13,(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం అల్గునూరుకు చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయ ఇంచార్జీ గోపు మల్లారెడ్డి కుమార్తె వివాహం బుధవారం స్థానిక లక్ష్మీ నరసింహ ఫంక్షన్ హాల్ లో జరుగగా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తన సతీమణి వైద్యురాలు అనూరాధతో కలిసి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

# శంకరపట్నం ఆరోగ్య కేంద్రంలో సాదారణ ప్రసవం



**శంకరపట్నం, ఆగష్టు 13,(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలకేంద్రంలోని ఆరోగ్యకేంద్రంలో బుధవారం ప్రసవానికి వచ్చిన ఓ మహిళకు సాదారణ ప్రసవం జరిగినట్లు మండల వైద్యాధికారి శ్రావణ్ కుమార్ తెలిపారు. మండలంలోని ఆముదాలపల్లి చెందిన సౌమ్య (24)అనే వివాహిత రెండవ ప్రసవానికై ఆరోగ్య కేంద్రంలో చేరగా సాదారణ ప్రసవం జరిగి ఆడ శిశుకు జన్మనిచ్చింది. 2.5కిలోల బరువుతో పుట్టిన శిశువుకు టికాలు ఇచ్చామని ఈ ప్రసవంతో ఆరోగ్య కేంద్రంలో 8ప్రసవాలు జరిగినట్లు వైద్యాధికారి శ్రావణ్ కుమార్ తెలిపారు. వైద్యురాలు మనుచిత్ర, వైద్యులు సురేష్, సూపర్వైజర్ సరోజనా, ఏఎన్ఎంలు శ్రీవాణి, స్వర్ణ, హెల్త్ సూపర్వైజర్ అనీల్ కుమార్,స్టాఫ్ నర్స్ రజిత ప్రసవ విధి నిర్వహణలో పాల్గొన్నారు.

# పెరిగిన గోదావరి నీటిమట్టం

### - భక్తులను అప్రమత్తం చేసిన ఎస్సై ఉదయ్ కుమార్





**ధర్మపురి, ఆగష్టు 13, (ది క్రైమ్ న్యూస్):** జగిత్యాల జిల్లా ధర్మపురి గోదావరిలో నీటి మట్టం పెరగడంతో వెంటనే భక్తులను స్థానిక ఎస్సై అప్రమత్తం చేశారు. బుధవారం ఉదయం 10గం, సమయంలో గోదావరి నీటి మట్టం పెరగడంతో ఎస్సై ఉదయ్ కుమార్ సిబ్బంది తో కలిసి భక్తులను అప్రమత్తం చేశారు. గోదావరి ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో పాటు కడెం ప్రాజెక్టు నుండి నీటి విడుదల కారణంగా నీటిమట్టం ఒక్కసారిగా పెరగడంతో ఆలయ అధికారులు, ఎస్సై ఉదయ్ కుమార్ లు భక్తులను అప్రమత్తం చేసి ఒడ్డుకు చేర్చారు. శ్రావణ మాసం కావడంతో భక్తులు గోదావరి స్నానానికి పెద్ద సంఖ్యలో రాగా వారు నదీ లోనికి వెళ్లి స్నానాలు ఆచరిస్తున్నారన్న స్థానికుల సమాచారం మేరకు వారందరిని ఒడ్డుకు చేర్చింట్లు వారు పేర్కొన్నారు.

# పాత పెన్షన్ హామీ విస్మరిస్తే పోరాటమే

### - పిఆర్టీయూ టీ ఎస్ పెద్దపల్లి జిల్లా శాఖ అధ్యక్షులు గండు కృష్ణమూర్తి




**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీ ప్రకారం పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించే వరకు పోరాటం ఆపేది లేదంటూ పి ఆర్ టీ యూ టీ ఎస్ పెద్దపల్లి జిల్లా శాఖ అధ్యక్షులు గండు కృష్ణమూర్తి అన్నారు. 35, 40 సంవత్సరాలు సేవచేసి పదవి విరమణ పొందిన సీపీఎస్ ఉద్యోగి ఆసరా పెన్షన్ కంటే తక్కువ పెన్షన్ పొందబోతున్నాడని,కాంట్రిబ్యూటరీ పెన్షన్ ను రద్దు చేసి పాత పెన్షన్ అమలు చేస్తామని మేనిఫెస్టో లో పెట్టి అధికారంలోకి రాగానే తాత్సారం చేస్తూ ఉద్యోగుల అత్మాభిమానం దెబ్బతీస్తే సహించేది లేదని అయన అన్నారు. పీఆర్ టి యు టి ఎస్ రాష్ట్ర శాఖ రూపొందించిన సిపిఎస్ వ్యతిరేక మహాధర్నా గోడ ప్రతి బుధవారం జిల్లా కేంద్రంలోని పాత మండల రిసోర్స్ సెంటర్ ఆవరణలో జిల్లా ప్రధాన కార్యదర్శి కానుగంటి శ్రీనివాస్ తో కలిసి ఆవిష్కరించారు.సెప్టెంబర్ 1 పెన్షన్ విద్రోహదినం సందర్బంగా రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఇందిరపార్క్ వద్ద మహాధర్నాకు పెద్దపల్లి జిల్లా నుండి పెద్దసంఖ్యలో సిపిఎస్ ఉద్యోగులు తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మెతుకు తిరుపతి, రాములు, శ్రీరాముల రాజయ్య, దొమ్మటి రాజేందర్, వేగోలపు సత్యనారాయణ, నీలం నరేందర్, శ్రీనివాస్, ప్రతాపరెడ్డి, రాజమౌళి, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

# సనత్‌నగర్‌లో గణేష్ పండల్ నిర్వాహకులతో సమన్వయ సమావేశం



**హైదరాబాద్ (ది క్రైమ్ న్యూస్):** ఎర్రగడ్డలోని విక్టోరియా గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో గణేష్ పండల్ నిర్వాహకులు, గణేష్ ఉత్సవ సమితి సభ్యులు మరియు స్థానిక పెద్దలతో సనత్‌నగర్ పోలీసులు సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో బాలానగర్ ఏసీపీ పాల్గొన్నారు, పండళ్లు మరియు విగ్రహాల భద్రతా చర్యలకు సంబంధించి ఆదేశాలు జారీ చేశారు, అలాగే ధ్వని నియంత్రణ మార్గదర్శకాలను జారీ చేశారు. సుమారు 150 మంది పాల్గొనేవారు తమ అభిప్రాయాలను పంచుకున్నారు మరియు వివిధ ఆందోళనలను లేవనెత్తారు. ఇచ్చిన సూచనలు మరియు ఆదేశాలకు నిర్వాహకులు సానుకూలంగా స్పందించడంతో సంభాషణ నిర్మాణాత్మకంగా ఉంది.

# యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

### - ముత్తారం పోలీస్ శాఖ



**ముత్తారం.ఆగష్టు.13.(ది క్రైమ్ న్యూస్):** ముత్తారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఎస్ఐ గోపతి నరేష్ ఆదేశాల మేరకు డ్రగ్స్,మాదక ద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి హెడ్ కానిస్టేబుల్ మధునయ్య మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్, గంజాయి, మాదక ద్రవ్యాలకు అలవాటు పడి విలువైన భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, మీ తల్లిదండ్రులు మీపై ఎంతో నమ్మకం పెట్టుకున్నారని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని అన్నారు. గ్రామంలో ఉన్న శాంతి భద్రతల గురించి ప్రజలకు వివరించాలని అలాగే అత్యవసర సమయంలో పోలీస్ వాళ్ళ సహాయం పొందాలని,అనుమానిత వ్యక్తులు కనిపిస్తే 100 కు డయల్ చేయాలని దగ్గరలో ఉన్న సిబ్బంది నిమిషాల వ్యవధి లోని వచ్చి తగు చర్యలు తీసుకోవటం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది శ్రావణ్ రెడ్డి, సౌజన్య, గోపాల్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# ధర్మపురి పోలీస్ శాఖ హెచ్చరిక



**ధర్మపురి, ఆగష్టు 13, (ది క్రైమ్ న్యూస్):** ధర్మపురి పాఠశాల, కళాశాల గ్రౌండ్ లో విద్యార్థులు, చిన్న పిల్లలు ఆడుకుంటారని ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున ఈ ప్రాంగణంలో కార్లు, బైక్ లు నేర్చుకోవడం, ప్రమాదకరంగా నడపడం నిషేధం అని ధర్మపురి సిఐ రాం నర్సింహారెడ్డి తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్, ప్రధానోపాధ్యాయుల అనుమతి లేకుండా ఎవరి వాహనము లోపలికి వెళ్ళకూడదని సిఐ హెచ్చరించారు. ప్రైవేట్ వాహనాలేవీ లోపల పార్క్ చేయకూడదని, ఎవరైనా అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకొనబడునని అంతే కాకుండా ఎటువంటి పంచాయితీలు ఈ ప్రాంగణంలో నిర్వహించరాదని సిఐ రాం నర్సింహారెడ్డి పేర్కొన్నారు. రాత్రుళ్ళు ఎవరైనా అనుమానాస్పద స్థితిలో గ్రౌండ్ లో కనబడినా, అవాంఛిత పనులు చేసినట్లైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సిఐ తెలిపారు.

## గాలిపల్లిలో చీడపీడల నివారణపై రైతులకు అవగాహన



**ఇల్లంతకుంట, ఆగష్టు 13,(ది క్రైమ్ న్యూస్):** రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం గాలిపెల్లిలో గాలిపెల్లి, జవారిపేట, తాళ్లపల్లి, నర్సక్కపేట గ్రామాల రైతులకు పత్తి, పొలంలోని చీడపీడల నివారణపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. యుపిఎల్ కంపెనీ "ఉలాల,మెకరీనా"ను పత్తిలో "కెవుక" పోలంలో ఉపయోగాలను తెలిపి స్వీప్ పవర్ యొక్క ఐదు లక్షల యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ ను వివరించారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు రంజిత్ రెడ్డి. విష్ణు రావు,గుంటి మహేష్. డీలర్లు ఎల్లారెడ్డి, మధుకర్ రెడ్డి రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## భద్రత చర్యల్లో భాగంగా డాగ్ స్క్వాడ్ బాంబ్ డిస్పోజల్ టీమ్ సమగ్ర తనిఖీలు




**ధర్మపురి, ఆగష్టు 13, (ది క్రైమ్ న్యూస్):** జగిత్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలలో భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయడం కోసం బుధవారం ధర్మపురి లో ప్రత్యేక డ్రైవ్ ను నిర్వహించారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో, డాగ్ స్క్వాడ్ మరియు బాంబ్ డిస్పోజల్ (బి.డి) టీమ్ సహకారంతో భద్రతా తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సమయంలో ఆలయ ప్రధాన ద్వారం , మండపాలు, భక్తుల ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, పార్కింగ్ స్థలాలు, వసతి గృహాలు మరియు పరిసర ప్రాంతాలను ఒక్కొక్కటిగా పరిశీలించారు. అనుమానాస్పద వస్తువులు, ప్యాకేజీలు, సంచులు లేదా భద్రతకు ముప్పు కలిగించే అంశాలపై ప్రత్యేక తనికి నిర్వహించారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే ప్రదేశాలలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకొని తనికిలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ముఖ్యమైన ఆలయాల్లో పుణ్యక్షేత్రాల్లో పండుగ రోజుల్లో భద్రతా చర్యలు మరింత కట్టుదిట్టం చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రజల సహకారంతోనే భద్రతా చర్యలు సమర్థవంతంగా కొనసాగుతాయని, ఎవరైనా అనుమానాస్పద వస్తువులు, వాహనాలు లేదా వ్యక్తులు కనిపించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా 100 నంబర్ కి సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డాగ్ స్క్వాడ్, బాంబ్ డిస్పోజల్ టీమ్‌తో పాటు, స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పంచాయితీ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి



**శంకరపట్నం, ఆగష్టు 13,(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం గొల్లపల్లిలో నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ బుధవారం ప్రారంభించారు.అనంతరం మండలకేంద్రంలోని రైతువేదికలో లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేశారు.కార్యక్రమంలో ఎంపీడీవో జి. కృష్ణప్రసాద్, పీసీసీ సభ్యుడు, మాజీ జడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గోపగోని బస్వయ్య గౌడ్, కొత్తగట్టు ఆలయ చైర్మన్ కోరం రాజిరెడ్డి, మాజీ చైర్మన్ ఉప్పుగళ్ల మల్లారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాంపల్లి తిరుపతి, మహిళా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు కవ్వ పద్మ, మహిళా కాంగ్రెస్ మండలాధ్యక్షురాలు సిహెచ్ పద్మ,నాయకులు గట్టు తిరుపతి, బండారి తిరుపతి, ఎగ్గని రమేశ్, ఖాజామొహినుద్దీన్, బి.శ్రీనివాస్ రెడ్డి, గొట్టె మధు, కనకం రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లంతకుంటలో వరదనీటి తొలగింపుకు చర్యలు



**ఇల్లంతకుంట, ఆగష్టు 13,(ది క్రైమ్ న్యూస్):** రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లే దారిలో గతరాత్రి కురిసిన వర్షానికి భారీగా వరద నీరు నిలిచి ఉండడంతో బుధవారం స్థానిక ఎంపీడీవో వై.శశికళ,ఎంపీఓ శ్రీనివాస్ పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శి సంధ్య సిబ్బందితో నీటిని తొలగింపుకు చర్యలు చేపట్టారు.

# మొన్న నిర్మాణం.. నిన్న ఆర్భాటం.. నేడు ఖతం

● నాయకుల పనితీరుకు నిదర్శనం ● బిల్డప్ ఎక్కువ.. బిజినెస్ తక్కువ ● కొట్టుకుపోయిన మరమ్మత్తులు ● రాకపోకలకు మళ్లీ అంతరాయం ● మా గతి గింతే అంటున్న ప్రజానీకం

● నక్కల వాగు మరమ్మత్తు పనులపై ది క్రైమ్ న్యూస్ స్పెషల్ స్టోరీ....



కొద్దిరోజుల క్రితమే మరమ్మత్తులు చేసిన దృశ్యం

**(ది క్రైమ్ న్యూస్) బ్యూరో:** పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలం జొన్నల మల్యాల నుండి పోచంపల్లి వెళ్లే మార్గంలో ఉన్న నక్కల వాగులో కొద్ది రోజుల క్రితం పెద్దపల్లి మండలం గౌరెడ్డి పేటకు చెందిన కూలీలు మల్యాల గ్రామానికి వరి నాటు కోసం వచ్చి తిరుగు ప్రయాణంలో ప్రవాహంలో చిక్కుకొని ప్రాణాపాయ స్థితి నుండి బయట పడ్డ సంగతి ని ది క్రైమ్ న్యూస్ కొద్దిరోజుల క్రితం ప్రచురించిన వార్త పాఠకులకు తెలుసు. రెండు గ్రామాలకు మధ్య రాకపోకలు నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డ వ్యవసాయదారుల దుస్థితిని.. వాగులో చిక్కుకున్న మహిళలను మల్యాల గ్రామస్తులు రక్షించిన దృశ్యాలను,వీడియోలను వివిధ మాధ్యమాల ద్వారా అధికారుల నాయకుల దృష్టికి తీసుకెళ్లడంలో ది క్రైమ్ న్యూస్ ప్రముఖ పాత్ర పోషించింది. వెంటనే స్పందించిన స్థానిక అధికార పార్టీ నాయకులు మరమ్మత్తు పనులను యుద్ధ ప్రాతిపదికన మమ అన్న విధంగా చేయించడం జరిగింది.

తూతూ మంత్రంగా సాగిన పనులు బురదలో రాయేసి దాటిన సామెత తీరుగా ఉండడంతో గ్రామస్తులు ఎవరూ కూడా ఈ పనుల మీద హర్షం వ్యక్తం చేయలేకపోయారు. కానీ స్థానిక నాయకులు మాత్రం రెండు గ్రామాల ప్రజలు నభూతో నభవిష్యత్ అన్నారని.... వేనోళ్ల వాళ్ళ పనులను కొనియాడారని, పట్టలేనంత సంతోషంతో నాయకు లందరికీ కృతజ్ఞతలు తెలిపారని కొన్ని మీడియాల ద్వారా విపరీతమైన ప్రచారం చేసుకున్నారు. కానీ వాస్తవానికి వాళ్లు చేసిన మరమ్మత్తు పనులు మూన్నాళ్ళ ముచ్చటే అన్న సంగతి గ్రామస్తులకు చాలా క్లియర్ గా తెలుసు. అధికార దర్పంతో సమస్యను లేవనెత్తిన వాళ్లను నానారకాలుగా హేళన చేస్తూ, అడ్డగోలుగా మాట్లాడి చేసిన పనులు మూడు రోజులు కూడా నిలువలేకపోయాయి.

పనులు చేయించిన నాయకులకు చిత్తశుద్ధి లేదని, ఏమాత్రం అవగాహన లేకుండా పనులు చేశారు అనడానికి చక్కని నిదర్శనం. ఇదే నక్కల వాగుపై కిలోమీటర్ పైన కాల్వ శ్రీరాంపూర్ నుండి జమ్మికుంటకు వెళ్లే ప్రధాన రహదారి ఉంటుంది. గూడెం సబ్ స్టేషన్ సమీపంలో 5 పైపులు అమర్చినలో లెవెల్ బ్రిడ్జి పై నుండి రాకపోకలు సాగుతుంటాయి. అయితే కుంభ వర్షం పడిన సమయాల్లో ఈ ఐదు పైపుల ద్వారా నీళ్లు వెళ్లడం సాధ్యం కాకపోవడంతో రోడ్డు పై నుండి ప్రవాహం సాగడం మూలాన ఈ మార్గంలో చాలా సందర్భాలలో పోలీసులు, గ్రామపంచాయతీ సిబ్బంది దగ్గరుండి వాహనాలను నిలిపివేస్తూ ఉంటారు. మరి ఇంతకంటే దిగువన ఉన్న ఈ దారికి మొన్న మరమ్మత్తులు చేయించిన నాయకులు కేవలం మూడు పైపులను మాత్రమే అమర్చడం వీళ్ళ అవివేకత్వానికి, తెలివి తక్కువ తనానికి ఆలోచన రాహిత్యానికి పరాకాష్టగా చెప్పవచ్చు.

ఒర్రెలు, వాగులు, నదులకు దిగువకు వెళ్తున్న కొద్దీ ప్రవాహం ఎక్కువవుతుందన్న కనీస పరిజ్ఞానం కూడా లేకుండా కేవలం మూడు పైపులను మాత్రమే అమర్చి మేమేదో గొప్ప ఘనకార్యం చేశామంటూ చేతులు దులుపుకున్నారు. ఇలా తక్కువ పైపులను అమరచడం వలన తిరిగి రహదారి పూర్తిగా కొట్టుకు అయిందని ఆవేదనతో ఈ ప్రాంత వ్యవసాయదారులు చెప్పుకొచ్చారు.

ఎన్నిసార్లు మా గోడును నాయకులకు అధికారులకు వెల్లబోసుకున్నా పట్టించుకునే నాధుడే లేడు అంటూ... ఇక మా గతి ఇంతే అంటూ నిత్యం ఈ దారి నుండి అవతలి వైపుకు పనుల నిమిత్తం వెళ్లే రైతులు ఇది క్రైమ్ న్యూస్ తో చెప్పడం జరిగింది. ఏది ఏమైనా మాకు శాశ్వత పరిష్కారం చేయాలంటూ కోరుతున్నారు.



# ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న ప్రభుత్వానికి అండగా ఉండాలి

● కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు రెడ్డిగాని రాజు


**తిమ్మాపూర్, ఆగష్టు 13,(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం నేదునూరులో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు రెడ్డిగాని రాజు ఆధ్వర్యంలో బుధవారం లబ్దిదారులకు నూతన రేషన్ కార్డులను పంపిణీ చేశారు. రెడ్డిగాని రాజు మాట్లాడుతూ.... పేద, బడుగు బలహీన వర్గాలకు రేషన్ కార్డులివ్వకుండా గత ప్రభుత్వం అన్యాయం చేస్తే,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో సన్న బియ్యం, ఇందిరమ్మ ఇండ్లతో పాటు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా పేదలకు నెరవేర్చడం జరుగుతుందన్నారు. గ్రామాల్లోని సమస్యలను అధికారుల ద్వారా పరిష్కరిస్తూ అనారోగ్య సమస్యలకు సైతం ఆసుపత్రి ద్వారా సేవలందిస్తూ ఎమ్మెల్యే కవ్వంపల్లి పేదలకు అందుబాటులో ఉంటున్నారని కొనియాడుతూ మున్ముందు ఏ ఎన్నికలు వచ్చినా ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి అన్ని వర్గాల ప్రజలు అండగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో



నేదునూరు కాంగ్రెస్ అధ్యక్షులు, మహిళా అధ్యక్షులు,నాయకులు మల్లెత్తుల ఆంజనేయులు,రెడ్డి గాని మొగిలి, బొంతపల్లి అనిల్, కాల్వ కుమార్, పొందుర్తి దినేష్ ,అందె లక్ష్మణ్, ఎలగందుల రవీందర్, అందె శంకర్, కవ్వంపల్లి బాబు, ఎలగందుల మల్లయ్య, కవ్వంపల్లి రాజ్ కుమార్, కోరపు శంకర్ మహిళలు గ్రామస్తులు పాల్గొన్నారు.

## అందుబాటులోకి యూరియా.... దుష్ప్రచారాలకు ఆందోళన చెందవద్దు

**- మాజీ ఎంపీపీ ఊట్కూరి వెంకటరమణ రెడ్డి**



**ఇల్లంతకుంట, ఆగష్టు 13,(ది క్రైమ్ న్యూస్):** రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని సహకార సంఘాలు, ఎరువుల దుకాణాల్లో అవసరమైనన్ని యూరియా బస్తాలను అందుబాటులోకి తెస్తున్నామని రైతులు ఆందోళన చెందవద్దని మాజీ ఎంపిపి ఊట్కూరి వెంకటరమణ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాకాలంలో 3200 మెట్రిక్ టన్నులు అవసరమైతే 2000 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు సరఫరా చేశామని, ఈనెలాఖరులోగా 800 మెట్రిక్ టన్నుల సరఫరాకై ప్రభుత్వం చర్యలు తీసుకుని వచ్చే నెలలో అవసరమైన 400 మెట్రిక్ టన్నుల యూరియాను అందరికి అందిస్తామన్నారు. బుదవారం మండల వ్యాప్తంగా పెద్దలింగాపూల్ లో ప్యాక్స్ ద్వారా-20.0 మెట్రిక్ టన్నులు, ప్రైవేట్ డీలర్ ద్వారా 10.0మెట్రిక్ టన్నులు, కందికట్కూర్ లో ప్యాక్స్ ద్వారా-15.0 మెట్రిక్ టన్నులు, పొత్తూరులో -ప్రైవేటు డీలర్ల ద్వారా 10.0 మెట్రిక్ టన్నులు, రేపాకలో ప్యాక్స్ ద్వారా 15.0 మెట్రిక్ టన్నులు-ప్రైవేటు డీలర్ల ద్వారా 10.0 మెట్రిక్ టన్నులు, ముస్కానిపేటలో -ప్రైవేటు డీలర్ల ద్వారా 5.0 మెట్రిక్ టన్నులు, ఇల్లంతకుంటలో ప్యాక్స్ ద్వారా-15.0 మెట్రిక్ టన్నులు, ప్రైవేటు డీలర్ల ద్వారా -10.0 మెట్రిక్ టన్నులు,గాలిపెల్లి లో ప్రైవేటు డీలర్ల ద్వరా 5.0 మెట్రిక్ టన్నులు,ఓగులాపూర్ లో ప్రైవేట్ డీలర్ల ద్వారా 10.0 మెట్రిక్ టన్నులు,ఎంజీసి ఇల్లంతకుంతకుట ద్వారా 10.0 మెట్రిక్ టన్నులు మొత్తం ప్యాక్స్ ద్వారా-65.0 మెట్రిక్ టన్నులు,ప్రైవేటు డీలర్ల ద్వారా 70.0 ద్వారా పంపిణీ చేశామని పేర్కొన్నారు.యూరియా వినియోగం పెరగడంతో రెండు మూడు రోజులకోసారి సహకార గోదాంల వద్ద, ఎరువుల దుకాణాల్లో బస్తాలు అందుబాటులో ఉంచుతామని రైతు శ్రేయస్సే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే కవ్వంపల్లి పనిస్తున్నారని యూరియాపై ప్రతిపక్షాలు కావాలనే చేస్తున్న దుష్ప్రచారాలను నమ్మి ఆందోళన చెందవద్దని రైతులను కోరుతున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

## పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి భూమి పూజ



**ముత్తారం.ఆగష్టు.13.(ది క్రైమ్ న్యూస్):** ముత్తారం మండలంలోని అడవి శ్రీరాంపూర్ గ్రామంలో ముదిరాజ్ ల కుల ఆరాధ్య దైవమైన పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి బుధవారం భూమి పూజ చేశారు. ముదిరాజ్ సంఘం మహిళలు మంగళ హారతులతో విచ్చేసి అమ్మవారి పూజలో పాల్గొన్నారు.ఈ భూమి పూజలో ముదిరాజ్ పెద్దలు,కులస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆగస్టు 15వరకు తిరంగ యాత్రను విజయవంతం చేయండి: తిప్పర్తి నిఖేష్




**గన్నేరువరం, ఆగష్టు 13,(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలకేంద్రంలో బుధవారం బిజెపి నాయకులు ప్రజలతో కలిసి తిరంగ యాత్రను నిర్వహించారు.బిజెపి మండలాద్యక్షుడు తిప్పర్తి నికేష్ మాట్లాడుతూ..... దేశ సమైక్యత, సమగ్రత కోసం ప్రతిజ్ఞ చేసి దేశభక్తి పూరిత కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు.ఆపరేషన్ సింధూర్ తో దేశ ధైర్య సాహసాలు, శక్తి సామర్థ్యాలకు ప్రపంచమే నివ్వరపోయి దేశ ఖ్యాతి విశ్వంలో మార్మోగిపోతుందన్నారు.స్వాతంత్ర్య వేడుకలను మరింత ఘనంగా నిర్వహించేలా రూపొందించిన కార్యక్రమంలో వీరుల త్యాగాలను గుర్తించేలా ప్లకార్డులు ప్రదర్శించాలని సూచించారు.ఆగస్టు15 లోపు నాయకులు, కార్యకర్తలందరి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసి 15తేదీ వరకు చేపట్టిన తిరంగ యాత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.అనంతరం మహనీయులకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.కార్యక్రమంలో విలాసారం రామచంద్రం, ఎలేటి చంద్రారెడ్డి,బండి తిరుపతి, అటీకం రామచంద్రం, పుల్లెల రాము, జీల కుమార్ యాదవ్,గోవర్ధన్ రెడ్డి,సాయి గణేష్, నందికొండ స్వామి రెడ్డి, కాంతాల రాజిరెడ్డి, కూర హరీష్, గంటా గౌతం, కాట్నపల్లి అజయ్ రెడ్డి,విలాసారం రాజమల్లు, గూడూరు జగన్, కొంకటి రవి, రంగనవేని కుమార్, బొమ్మ కంటి శ్రీను, దానవేని ప్రశాంత్,సాయిని మల్లేశం, ఎలేటి శేఖర్ రెడ్డి, జీల తిరుపతి యాదవ్, పుల్లెల శ్రీనివాస్, బిజెపి అనుబంధ సంఘాల నాయకులు మహిళలు కార్యకర్తలు పాల్గొన్నారు.

# క్షేత్ర స్థాయిలో అధికారులు అందుబాటులో ఉండాలి

## ◆ జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**భూపాలపల్లి, ఆగస్టు -13:(ది క్రైమ్ న్యూస్):** జిల్లాకు వాతావరణ శాఖ సూచన మేరకు భారీ వర్ష సూచన వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో బుధవారం ఐడిఓసి కార్యాలయంలో కలెక్టర్ రాహుల్ శర్మ ఎస్పీ కిరణ్ ఖరే తో కలిసి రెవెన్యూ, పంచాయతి రాజ్, ఇరిగేషన్, వైద్య, విద్యుత్తు, వ్యవసాయ, ఆర్ అండ్ బి, మున్సిపల్ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 72 గంటల పాటు భారీ వర్షాలు వచ్చే అవకాశం ఉన్న సందర్భంగా ప్రజలు బయటికి రాకుండా ఇంటిపట్టునే ఉండేలా గ్రామాలు, మున్సిపాలిటీలో టాం టాం వేయించాలి ఆదేశించారు. ఏ సమయంలో క్లౌడ్ బరెస్ట్ అయ్యే అవకాశం ఉందని అన్ని శాఖల అధికారులు గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇబ్బందులు ఎదురైతే కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన 9030632608 కంట్రోల్ రూము నంబర్ కు ఫోన్ చేయాలని ప్రజలకు సూచించారు. రానున్న 3 రోజులు వాతావరణ శాఖ భారీ వర్షసూచన చేసిన నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. భారీ వర్షాల సూచన మేరకు మంగళవారం ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి తగు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలను అన్ని శాఖల అధికారులు తప్పక పాటించాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు ప్రతీ శాఖ అధికారులు, సిబ్బంది వారి పరిధిలో గల విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కాజ్ వే లపై ప్రజలు ప్రయాణం చేయకుండా నిలుపుదల చేయాలని భారీ కేడింగ్, ట్రాక్టర్లు అడ్డు పెట్టాలని పోలీస్, రెవెన్యూ, పంచాయతి, ఆర్ అండ్ బి సిబ్బంది పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. చెరువులు తెగే పరిస్థితి ఉంటే వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు అధికారులు, సిబ్బంది కార్యస్థానాల్లో అందుబాటులో ఉండి ప్రజలకు ఎలాంటి నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యుత్తు ప్రమాదాలు వాటిల్లకుండా సంబంధిత శాఖల అధికారులు రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. శిధిలావస్థలో ఉన్న ఇళ్లలో నివసించే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి వసతి, భోజన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. అన్ని సంక్షేమ హాస్టల్ లో విద్యార్థులు పట్ల జాగ్రత్తగా ఉండాలని, బయటకు వెళ్లకుండా పర్యవేక్షణ చేయాలన్నారు. పొంగి పొర్లే వాగులు, చెరువులు, రిజర్వాయర్లు, నదుల వద్దకు ప్రజలు వెళ్లకుండా నియంత్రణ చేయాలని సూచించారు. వర్షాల వల్ల నీరు కలుషితమై దోమలు ప్రబలి సీజనల్ వ్యాధులు ప్రబల కుండ వైద్య సిబ్బంది ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రసవ సమయం దగ్గర ఉన్న గర్భిణి లను, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వ్యక్తులను గుర్తించి ముందస్తుగా ఆసుపత్రిలో చేర్పించాలని వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. ప్రతి శాఖ అధికారులు వారి వారి సిబ్బంది సమావేశం ఏర్పాటు చేసి అప్రమత్తం చేయాలని పేర్కొన్నారు. టామ్ టామ్ వేపించి ప్రజలను అలర్ట్ చేయాలన్నారు. మున్సిపల్, రెవెన్యూ డివిజన్ పరిధిలోని కాటారం సబ్ కలెక్టర్, ఆర్డిఓ కార్యాలయాల్లో కంట్రోల్ రూములు ఏర్పాటు చేస... ప్రజలకు కంట్రోల్ నెంబర్లు ఏర్పాటు చేయాలని వివరించారు. భారీ వర్షాలు వల్ల వరదలు, ఇళ్లకు నష్టం, రహదారులు ధ్వంసం, చెట్లు కూలిపోవడం వంటి విపత్కర పరిస్థితులు ఎదురైన సందర్భంలో వెంటనే కంట్రోల్ రూములకు సమాచారం అందించాలాని కలెక్టర్ తెలిపారు. జిల్లా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, యంత్రాంగం సలహాలు, సూచినలు పాటించి యంత్రాంగానికి సహకరించాలని సూచించారు. అనంతరం మండల వారిగా సంసిద్ధత వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎస్పి కిరణ్ ఖరే మాట్లాడుతూ అకస్మాత్తుగా వర్షం వచ్చే అవకాశం ఉన్న దృష్ట్యా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. 25మంది ఎన్ డిఆర్ ఎఫ్ సిబ్బంది సేవలు అందించడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఎలాంటి సమస్యలు వచ్చిన ఎదుర్కొడానికి యంత్రాంగం సంసిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఇరిగేషన్, విద్యుత్తు, పంచాయతీరాజ్, వైద్య, మత్స్య శాఖ, అధికారులతో పాటు అన్ని మండలాల తహసిల్దారులు, ఎంపీడీఓలు, డివిజన్ అధికారు లు తదితరులు పాల్గొన్నారు.

# దొంగ ఓట్లతో గద్దెనెక్కిన బిజెపి గద్దె దిగాలి

### ◆ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాడుతున్న రాహుల్‌కు ప్రజా సంఘాల మద్దతు
### ◆ రాజ్యాంగ శక్తుల ఐక్యతతోనే ప్రజాస్వామ్య రక్షణ ◆ ప్రజాసంఘాల నాయకుడు పీక కిరణ్



**భూపాలపల్లి/కాటారం/ఆగస్టు - 12: (ది క్రైమ్ న్యూస్) :** బుధవారం కాటారంలో పత్రికా విలేకరుల సమావేశంలో ప్రజాసంఘాల నాయకుడు పీక కిరణ్ మాట్లాడుతూ. ప్రజాస్వామ్యంలో ఎన్నికల్లో ప్రధాన పాత్ర పోషించే ఓట్లను తారుమారు చేసి దొంగ ఓట్లతో గద్దెనెక్కిన బిజెపి ప్రభుత్వం వెంటనే దిగిపోవాలని ప్రజా సంఘాల నాయకులు, డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా జరగాల్సిన సార్వత్రిక ఎన్నికలను ఇవిఎంల ద్వారా నాశనం చేయడంతో పాటు దొంగ ఓట్లను నమోదు చేసి అక్రమ పద్ధతిలో గెలిచి రాజ్యమేలుతున్న బిజెపి ప్రభుత్వం వెంటనే గద్దె దిగి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కిరణ్ డిమాండ్ చేశారు. దొంగ ఓట్ల కుంభకోణాన్ని కళ్ళకు కట్టినట్లు బట్టబయలు చేసిన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి దేశంలోని ప్రగతిశీల ప్రజాస్వామ్య శక్తులు అండగా నిలవాలని వారు పిలుపునిచ్చారు. భారతదేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాడుతున్న శక్తులన్నీ ఐక్యం కావాలని, ఇవిఎంలు రద్దయ్యేవరకు పోరాడాలని పిలుపునిచ్చారు. గత 20 సంవత్సరాల నుండి బ్యాంసెఫ్ లాంటి సంస్థలు ఇవిఎంల రద్దు కోసం పోరాటం చేస్తున్న దొడ్డి దారిన అధికారంలోకి రావడానికి అలవాటుపడిన పాలకవర్గాలు ఇవిఎంలను వీడడం లేదని అన్నారు. దేశంలో బలమైన ప్రతిపక్ష స్థానంలోనున్న కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమి నేడు ఇవిఎం లను రద్దు చేసి బ్యాలెట్ ద్వారా ఎన్నికలు నిర్వహించాలని పోరాడడం మంచి పరిణామమని అన్నారు. ఇవిఎం రద్దుతో పాటు దొంగ ఓట్లను తొలగించడం కోసం జరిగే పోరాటంలో రాజ్యాంగ శక్తులు రాహుల్ కు అండగా నిలవాలని కిరణ్ పిలుపునిచ్చారు. దొంగ ఓట్ల కుట్ర, రాజ్యాంగ రక్షణ, ఇవిఎంల రద్దుకై గ్రామ గ్రామాన జరిగే చైతన్య పోరాటంలో ప్రజా సంఘాలు ముందు వరుసలో ఉంటాయని తెలిపారు. దొంగ ఓట్ల కుట్రలో భాగమైన అధికారులను అరెస్టు చేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు అక్కల బాపు యాదవ్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ప్రధాన ఆసుపత్రిలో వరద నీరు చేరిక

### - వార్డులను పరిశీలించిన ఎమ్మెల్యే గండ్ర, కలెక్టర్ రాహుల్ శర్మ





**భూపాలపల్లి, ఆగస్టు - 13: (ది క్రైమ్ న్యూస్):** మంగళవారం కురిసిన భారీ వర్షానికి జిల్లా ప్రధాన ఆసుపత్రిలోని పలు వార్డులలోకి వరదనీరు చేరి రోగులు ఇబ్బంది పడిన ఘటనపై బుధవారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావుకలిసి జిల్లా ప్రధాన ఆసుపత్రిని పరిశీలించారు. వైద్యరోగ్య శాఖ ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యం వల్లే వర్షపు నీరు చేరిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆసుపత్రి పై అంతస్తు నిర్మాణం జరుగుతున్న క్రమంలో ఇంజనీరింగ్ అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోకుండా నిర్మాణం చేపట్టడం వలన వరద నీరు ఆసుపత్రి లోని వార్డులలో చేరడం జరిగిందని వెంటనే ఇంజనీరింగ్ శాఖ అధికారులతో ఫోన్ లో మాట్లాడి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు వహించాలని హెచ్చరించారు. అంతే కాకుండా గత ప్రభుత్వం హయాంలో ఆసుపత్రి నిర్మాణం జరిగిందని అప్పుడు ఆసుపత్రి నిర్మాణం తక్కువ ఎత్తులో నిర్మించడం, సరైన జాగ్రత్తలు తీసుకోకుండా సి.సీ నిర్మాణం చేపట్టారని అందువల్ల వరద నీరు ఆసుపత్రి ఆవరణలో చేరుతుందని తెలిపారు. త్వరలోనే ఆసుపత్రి ఆవరణలో గార్డెనింగ్ పనులు చేపట్టి సుందరంగా తీర్చిదిద్దుతామని రోగులు ఎవరు ఆందోళన చెందే అవసరం లేదని అన్నారు. ఆసుపత్రిని అన్ని విధాల అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరఅటెండెంట్ రాజేంద్ర ప్రసాద్, ఆర్.ఎం.ఓ దివ్య, టి జిఎంఐడిసి ఏ.ఈ రవి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ సింధూర్ విజయం

# జాతి విజయం

### - బిజెపి పెద్దపల్లి పట్టణ శాఖ ఆధ్వర్యంలో తిరంగ యాత్ర

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** బిజెపి జాతీయ పార్టీ పిలుపులో భాగంగా బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ కుమార్ ఆదేశాల మేరకు బుధవారం బిజెపి పెద్దపల్లి పట్టణ అధ్యక్షులు పెంజర్ల రాకేష్ యాదవ్ ఆధ్వర్యంలో తిరంగ యాత్ర ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు పెంజర్ల రాకేష్ మాట్లాడుతూ మే నెలలో జమ్మూ కాశ్మీర్లోని పహాల్గం ప్రాంతంలో పాకిస్తాన్ ఉగ్రవాదులు చేసిన దమనకాండకు ప్రతీకారంగా పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులను అణచివేయడానికి చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయం సాధించడం జరిగిందని, ఈ విజయాన్ని బీజేపీ జాతీయ పార్టీ దేశవ్యాప్తంగా తిరంగ యాత్ర నిర్వహించాలనే పిలుపులో భాగంగా పెద్దపల్లి పట్టణంలో తిరంగా ర్యాలీ నిర్వహించడం జరిగిందని అన్నారు . భారత సైన్యం సాధించిన విజయాలను, మోదీ ప్రభుత్వ నిబద్ధతను ప్రజలకు తెలియజేసేల తిరంగ ర్యాలీ నిర్వహించమని అన్నారు .ఈ ర్యాలీలో బీజేపీ కార్యకర్తలు, జాతీయవాదులు జాతీయ జెండాలను పట్టుకొని ర్యాలీ లో పాల్గొన్నారు. ఆపరేషన్ సింధూర్ విజయన్ని జాతి విజయంగా అందరు పంచుకోవడానికే తీరంగ ర్యాలీలు బిజెపి ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శిలారపు పర్వతాలు పెద్దపల్లి మండల అధ్యక్షులు వేల్పుల రమేష్ జిల్లా కౌన్సిల్ మెంబర్ కావేటి రాజగోపాల్, సీనియర్ నాయకులు తంగేడ రాజేశ్వరరావు, పోలసాని సంపత్ రావు, ఈర్ల శంకర్, వోల్ల తిరుపతి, ఎర్రోళ్ల శ్రీకాంత్, గుడ్ల సతీష్, బోలవేన సురేందర్, బొడ్డుపల్లి కుమార్, గాదశి సతీష్, ఉమేష్, హరీష్, మధు, శివ, సాయి, అంజి, పురేల రాజెశం, ఉదయ్, వినోద్, పవన్, ప్రశాంత్, రమేష్, శ్రీనివాస్, సందీప్, శ్యామ్, ఆకాష్, రాజు, రేవంత్ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## ఆదర్శ పాఠశాలలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు





**భూపాలపల్లి/కాటారం/ఆగస్టు -13:(ది క్రైమ్ న్యూస్):** కాటారం మండల కేంద్రంలోని ఆదర్శ హై స్కూల్లో బుధవారం ముందస్తుగా కృష్ణాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు వేసిన గోపికలు, శ్రీకృష్ణుడి వేషధారణలతో పలువురిని ఆకట్టుకున్నాయి. ఉట్టికొట్టే కార్యక్రమంలో చిన్నారులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ జనగామ కరుణాకర్ రావు, కరస్పాండెంట్ జనగామ కార్తీక్ రావు, ప్రిన్సిపాల్ కృషిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

## అక్రమ నిర్మాణాలపై నిర్లక్ష్యానికి కారణం ఏంటో? బాధ్యత ఎవరిది?

### - అధికారులు స్పష్టమైన వైఖరిని తెలియజేయాలి
### - సిపిఎం మండల కార్యదర్శి ఆత్కూరి శ్రీకాంత్



**భూపాలపల్లి/ కాటారం/ ఆగస్టు -13: (ది క్రైమ్ న్యూస్):** కాటారం సబ్ డివిజన్ కేంద్రంలో అక్రమ నిర్మాణాలపై నిర్లక్ష్యానికి కారణం ఏమిటో అధికారులు స్పష్టమైన వైఖరి తెలియజేయాలని సిపిఎం పార్టీ కాటారం మండల కార్యదర్శి ఆతురి శ్రీకాంత్ ఒక లేఖలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాటారం సబ్ డివిజన్లో మండల పరిధిలోని కొన్ని గ్రామపంచాయతీలలో ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు చేపడుతున్న అధికారులు నోటీసుల వరకే పరిమితమై ఆ నిర్మాణాలు పూర్తికావస్తున్న అధికారులు ఎందుకు స్పందించడం లేదు అర్థం కావటం లేదని వివరణ కోరితే అడిగిన ప్రతిసారి నేను నోటీసులు ఇస్తున్నామని చెప్పడం తప్పితే రోజు రోజుకు పెరుగుతున్న అక్రమ నిర్మాణాలకి బాధ్యత ఎవరిది అనేది అర్థం కాని ప్రశ్న అని అక్రమ నిర్మాణాలపై అధికారుల నిర్లక్ష్యానికి కారణం ఏంటో అర్థం కాని పరిస్థితి నెలకొందని అన్నారు. కాటారంలో ప్రస్తుతం కబ్జాదారులతో అధికారులు కుమ్మక్కయ్యారు అనేది చాలా స్పష్టంగా కనబడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కబ్జాదారులు రోజురోజుకీ అధికారుల అండతోనే చెలరేగిపోతున్నారని తెలిపారు. ఏ అధికారికి చెప్పాలో అర్థం కాని పరిస్థితి దాపురించింది. కిందిస్థాయి అధికారుల నుంచి కలెక్టర్ వరకు వినతి పత్రాలు ఇచ్చిన ఫలితం లేకపోయిందని, నిరుపేద ప్రజలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఎన్నిసార్లు మొరపెట్టినా భూమిలేదని చెబుతున్నారు అధికారులకు ఈ అక్రమ నిర్మాణాలు కనబడటం లేదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా అక్రమ నిర్మాణాలను అరికట్టకపోతే ప్రజలను కూడగట్టుకుని పెద్ద ఎత్తున అధికారులపై ఆందోళనకు దిగుతామని ఆయన హెచ్చరించారు.

## వైరా టిడిపి కార్యాలయాన్ని సందర్శించిన నందమూరి రామకృష్ణ...






**ఖమ్మం ఉమ్మడి జిల్లా, ప్రతినిధి, ఆగస్టు 13 (ది క్రైమ్ న్యూస్):** వైరా మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని దివంగత నేత ఎన్టీఆర్ తనయుడు నందమూరి రామకృష్ణ బుధవారం సందర్శించారు.. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ మండల పట్టణ నాయకులు అభిమానులు ఆయనను మర్యాదపూర్వకంగా ఆహ్వానం పలికి స్వాగతించి శాలువాలతో సత్కరించారు .. దమ్మపేట మండలం లో ఎన్టీఆర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి వెళ్లి వస్తూ మార్గమధ్యంలో కార్యాలయాన్ని సందర్శించినట్లు ఆయన తెలిపారు.. వైరా నియోజకవర్గ మాజీ ఇంచార్జి చెరుకూరి చలపతి మాట్లాడుతూ ఎల్లవేళలా పార్టీ పట్ల నిబద్ధత కలిగిన ఎన్టీఆర్ అడుగుజాడల్లో నడిచే గొప్ప నాయకులు, మీరు మమ్మల్ని పలకరించటం మాకు ఎంతో సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు అనంతరం వైరా మండల అధ్యక్షులు కీలార్ సురేందర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ పేరు మీద ఈ ఆఫీసు స్థలము రిజిస్ట్రేషన్ చేశామని అదేవిధంగా ఈ ఆఫీసు నిర్మాణానికి లోకేష్ ఆర్థిక సాయం చేశారని గుర్తు చేశారు ఈ కార్యక్రమంలోని వైరా పట్టణ అధ్యక్షులు బొల్లెపల్లి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు పమ్మి అర్జున్ రావు, కార్యదర్శి గుడ్ల నాగేశ్వరావు, సూర్యదేవర వెంకటకృష్ణ,.సిహెచ్ కాంతారావు,. కట్ల నరసింహారావు, భోగేశ్వర రావు,. ప్రదీప్ కుమార్,మండల కార్యదర్శి గాలి రామకృష్ణ, మాదినేని రామారావు, పర్స రామకృష్ణ కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# బీసీ సంక్షేమ సంఘం డిమాండ్..

## • రిజర్వేషన్ సాధన కై ఈ నెల 31 యుద్ధ బేరి..

**జగిత్యాల, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** జగిత్యాల జిల్లా కేంద్రంలో జరిగిన బిసి సంక్షేమ సంఘం సమావేశంలో బిసి సంక్షేమ సంఘం నాయకులు మాట్లాడుతూ వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలకు ఎట్టి పరిస్థితులలో 42% బీసీ రిజర్వేషన్లు అమలు చేస్తూ ఎన్నికలకు వెళ్లాలని బీసీ సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ల సాధనకై ఈ నెల 31న బీసీల యుద్ధభేరిని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బీసీల యుద్ధబేరి పోస్టర్?ను ఆవిష్కరించారు. పార్టీ పరంగా 42% టికెట్లు ఇస్తామంటే సరిపోదు, దీనివలన బీసీలకు ఉపయోగమే లేదు, చట్టపరంగానే హక్కుగా 42% ఇవ్వాలని అన్నారు. బుధవారం జగిత్యాలలో బీసీ సంఘాలతో సమావేశం నిర్ణయం నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలోని బీసీ వాదం బలంగా ఉంది. ఇప్పుడు పెంచకపోతే ఎప్పుడు పెరగదు. రిజర్వేషన్ల సమస్య గురించి చర్చించి కార్యాచరణ నిర్ణయించడానికి ఆగస్టు 31న బీసీల యుద్ధభేరి మహాసభ రవీంద్రభారతిలో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ సభకు రాష్ట్రంలో అన్ని జిల్లాల ముఖ్య నాయకులు, రాష్ట్రస్థాయి నాయకులు పాల్గొనాలని తెలిపారు. 42% రిజర్వేషన్లు సాధించేవరకు వదిలిపెట్టేది లేదని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి గారు బీసీ రిజర్వేషన్ పెంచే విషయంలో ఘర్షణ వైఖరి అవలంబించకుండా, సాధించే మార్గాలు పరిశీలించాలని సూచించారు. అందుకు అఖిలపక్ష సమావేశాలు, బీసీ సంఘాల సమావేశాలు, న్యాయ నిపుణులతో, అడ్వకేట్ల సమావేశాలు జరిపి సమాలోచన చేసి పరిష్కార మార్గాలు సాధించాలని కోరారు. ఇందుకోసం చట్టపరమైన, న్యాయపరమైన మార్గాలు వెతకాలని కోరారు. బీసీ సంఘాలు, ప్రజాసంఘాలు చేయవలసిన కార్యక్రమం బీసీ రిజర్వేషన్లు సాధించాలంటే సానుకూలంగా కేంద్రంలో ఉండి, అఖిలపక్షంతో, అన్ని రాజకీయపార్టీలతో మాట్లాడి పరిష్కరించాలి, సాధించాలి. కేంద్రంలో ఘర్షణ వైఖరితో ఉండడం, కేంద్ర మంత్రులను విమర్శించడంలాంటి చర్యలతో రిజర్వేషన్లు సాధించడానికి ఎలా సాధ్యమవుతుంది. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రిజర్వేషన్ సాధించడానికి మార్గాలు వెతకాలి, ఘర్షణ వైఖరి కాదు, ఏమాత్రం సరిపోదు, ప్రభుత్వం స్థానిక సంస్థలలో 42% రిజర్వేషన్లు ఇవ్వడానికి ఇష్టం లేక సమస్య పక్కదారి పట్టించడానికి ప్రయత్నం చేస్తుంది. కేంద్రంపై వ్యతిరేక ప్రచారం మానుకోవాలన్నారు. కేంద్రంపై పెట్టి తప్పించుకునే ప్రయత్నం చేస్తుంది. స్థానిక సంస్థల ఎన్నికలు జరిపి అధికారం ఎవరికి ఉంది. రాజ్యాంగం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంది, బీసీ రిజర్వేషన్లు కూడా నిర్ణయించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంది. 42% రిజర్వేషన్లు ఇస్తామని కామారెడ్డి డిక్లరేషన్ ఎవరు చేశారు, కాంగ్రెస్ చేసింది. అమలు చేసే బాధ్యత కాంగ్రెస్ పక్కకు పెట్టి తప్పించుకునే ఆలోచన మానుకోవాలి. అన్ని పార్టీల మద్దతు కూడా తీసుకొని 42% రిజర్వేషన్ సాధించాలని కోరారు. బీసీ బిల్లుల అమలు కోసం ప్రజా పోరాటంతో పాటు అవసరమైతే న్యాయపోరాటం కూడా చేయాల్సి ఉందని అన్నారు. చట్టపరమైన అవరోధాలు ఏమీ లేవు, కేసు బలంగా ఉందన్నారు. పార్టీ పరంగా 42% టికెట్లు ఇస్తామంటే ఒప్పుకునేది లేదని, చట్టపరంగా హక్కుగా 42% రిజర్వేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బి.సి యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కొక్కు గంగాధర్, బి.సి యువజన సంఘం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ తిరుపురం రాంచందర్, బి.సి న్యాయవాదుల సంఘం జిల్లా అధ్యక్షులు కూర్మాచలం ఉమా మహేష్, బి.సి మహిళా సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి రాచకొండ రోజా (న్యాయవాది), బి.సి సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడు రాపర్తి రవి, బి.సి సంక్షేమ సంఘం సాంస్కృతిక కార్యదర్శి బొమ్మిడి నరేష్ కుమార్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి ఎలుక భగవాన్ యాదవ్, బి.సి యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అనుమల్ల సంజయ్ సామ్రాట్, బి.సి విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు దండుగుల వంశీ, బి.సి సంక్షేమ సంఘం జగిత్యాల మండలాధ్యక్షుడు గుంటి గంగారాం, బి.సి సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షురాలు బండపెల్లి మల్లీశ్వరి, బి.సి సంక్షేమ సంఘం జగిత్యాల మండలాధ్యక్షుడు బందెల మల్లయ్య, యూత్ కో-ఆర్డినేటర్ హృషికేష్, బి.సి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాని మోదీ సందేశమే హర్ ఘర్ తిరంగా

**తొర్రూరు, (ది క్రైమ్ న్యూస్):** భారతప్రధాని నరేంద్ర మోదీ సందేశాన్ని ప్రతి ఇంటికి తీసుకపోయే లక్ష్యం తోనే హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బిజెపి ఆధ్వర్యంలో భారీ మోటార్ సైకి ల్ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ బైక్ ర్యాలీ అనంతరం జరిగిన సమావేశానికి బిజెపి అర్బన్ మండలం అధ్యక్షుడు పైండ్ల రాజేష్ అధ్యకత వహించగా బిజెపి అసెంబ్లీ కన్వీనర్ పూసాల శ్రీమాన్, జిల్లా కార్యదర్శి కొలుపుల శంకర్ సంయుక్తంగా మాట్లాడుతూ దేశ భద్రత కోసం నిరంతరం పరితపించే ప్రధాని మోదీ పిలుపుమేరకు దేశవ్యాప్తంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆపరేషన్ సిందూర్ లో భారత్ సాధించిన చారిత్రాత్మకమైన విజయం భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకం అని అన్నారు. తిరంగా ర్యాలీ లో బిజెపి జిల్లా కౌన్సిల్ సభ్యులు పల్లె కుమార్, రూరల్ మండల అధ్యక్షుడు గట్టు రాంబాబు గడ్డల శేఖర్ నడిగడ్డ సందీప్ రాయపురం రాజ్ కుమార్ జలగం రవి నరుకుటి సంతోష్ నర కుట్టి చలపతి రాజ్ తాటి జగదీష్ ధరావత్ తేజస్ సిహెచ్ విజయ్ కుమార్



నూకల నవీన్ శీలం శ్రీనాథ్ తూర్పాటి సతీష్ శివ గణేష్ కరుణాకర్ చార్ల సాకేత్ తూర్పాటి గోపాల్ చార్ల అనీష్ తూర్పాటి ఆశిష్ తూర్పాటి వెంకన్న కిన్నెర సమ్మయ్య హస్తం సంపత్ నర్కుటి సాయి కిరణ్ కిన్నెర రాజు తదితరులు పాల్గొన్నారు

# రైతులకు యూరియా ఇవ్వకుంటే.... కలెక్టరేట్ ముట్టడిస్తాం

## • మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు

**ఇల్లంతకుంట, ఆగస్టు 13,(ది క్రైమ్ న్యూస్):** రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం కందికట్కూర్ లోని సహకార సంఘం గోదాం వద్ద యూరియా కోసం క్యూకట్టిన రైతుల సమస్యలు బుధవారం మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు తెలుసుకున్నారు.సిద్ధం వేణు మాట్లాడుతూ..... యూరియా కొరత లేదన్న జిల్లా వ్యవసాయ అధికారి మాటలు నీటిమూటని,పోలీస్ పహారాలో యూరియా పంపిణీ చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు పంగనామాలు పెడతూ మార్పు పేరుతో ముంచిందని ఆరోపించారు.గంటలకొద్దీ లైన్ లో నిలబడ్డ కూడా ఒక్క బస్తా యూరియా దొరికే పరిస్థితి లేదని యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నా జిల్లా కలెక్టర్ ఇప్పటి వరకు సమిక్ష నిర్వహించలేదన రైతు ప్రభుత్వం అని చెప్పే సీఎం రేవంత్ రెడ్డి మాటలన్నీ గాల్లో దీపంలాంటివంటూ ఎద్దేవా చేశారు.సీఎం ఢీల్లీ టూర్లు,మంత్రులు హెలికాప్టర్ లో గల్లీ టూర్లు వేస్తూ ఎంజాయ్ చేస్తున్నారే తప్ప రైతుల సమస్యలు పట్టించుకోవడం లేదని పదేళ్ల కేసీఆర్ పాలనలో ఏ ఒక్క రోజు రైతులు యూరియా లైన్ కట్టిన దాఖలాలు లేవని మండిపడుతూ



రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయకుంటే వేలాది మంది రైతులతో కలిసి కలెక్టరేట్ ముట్టడిస్తామంటూ సిద్ధం వేణు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## బాదం పప్పు నానబెట్టి తింటే మంచిదా?

## లేదంటే పచ్చిగా తింటే మంచిదా?

చాలా మందికి రోజూ ఉదయాన్నే నానబెట్టిన బాదంపప్పు తినడం అలవాటు. అయితే బాదంపప్పు నానబెట్టి తింటే మంచిదా.. లేదంటే అలాగే పచ్చిగా తింటే మంచిదా అనే సందేహం కూడా చాలా మందిలో ఉంటుంది. బాదంపప్పు తినడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుంది. కానీ మీరు సరైన పద్ధతిలో తింటేనే ప్రయోజనాలు పొందవచ్చు. కాబట్టి బాదంపప్పును పచ్చిగా తినాలా? నానబెట్టి ఎలా తినాలా అనే విషయం ఇప్పుడు తెలుసుకుందాం.. బాదంలో విటమిన్లు, ఖనిజాలు, ఆరోగ్యకరమైన కొవ్వులు, ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. అంతేకాకుండా బాదంలో కాల్షియం, ఫాస్పరస్ కూడా ఉన్నాయి. ఇవి శరీరానికి పోషకాలను అందిస్తాయి. బాదం పప్పును ఉదయాన్నే పరగడుపున తీసుకుంటే ప్రయోజనాలు పొందవచ్చు. ఇందుకోసంరాత్రి పడుకునే ముందు కొన్ని బాదంపప్పులను నీళ్లతో వేసి నానబెట్టాలి. తర్వాతవాటిని తొక్క తీసి ఉదయం పూటా ఖాళీ కడుపుతో తినాలి. అలాగే బాదంపప్పును స్నాక్‌గా కూడా తినవచ్చు. పచ్చి వాటి కంటే నానబెట్టిన బాదం శరీరానికి ఎక్కువ మేలు చేస్తుంది. అలాగే బాదం షేక్ చేసి కూడా తాగొచ్చు. కానీ బాదంలో కేలరీలు ఎక్కువగా ఉంటాయి. అందువల్ల బరువు పెరగడానికి దారితీయవచ్చు. అందుకే వీటిని పరిమితంగా మాత్రమే తీసుకోవాలి.నట్ఎలర్జీ ఉన్నవారు వాటిని తీసుకునే ముందు వైద్యుడిని సంప్రదించడం మర్చిపోకూడదు. ఎలర్జీ ఉన్న వారు వీటికి దూరంగా ఉండటం బెటర్.



## కొబ్బరి నీళ్లు ఏ టైమ్‌లో తాగాలి..?

## డాక్టర్లు ఏం చెబుతున్నారంటే



సమ్మర్ సీజన్‌లో ఇష్టమైన పండ్లు తింటే ఆ మజాయే వేరు. మామిడి పండ్లు, ముంజలను తినడానికి చాలామంది ఇష్టం చూపుతారు. అయితే వేసవిలో శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచుకోవడం చాలా ముఖ్యం కూడా. అందుకే బాడీని కూల్ చేసే వాటిని తీసుకోవాలి. అందులో మొదటిది కొబ్బరినీళ్లు. ఒక కొబ్బరి బోండం నీళ్లు తాగితే రోజంతా హుషారుగా ఉండవచ్చు. అదే సమయంలో బాడీని కూల్ చేస్తుంది కూడా. కొబ్బరి నీళ్లలో కాల్షియం, మాంగనీస్ లాంటివి ఉంటాయి. సమ్మర్‌లో కొబ్బరి నీళ్లు తాగడం వల్ల అనేక రకాల బెనిఫిట్స్ ఉన్నాయి. అయితే చాలామంది సమయ పాలన లేకుండా కొబ్బరి నీళ్లు తాగుతుంటాయి. అయితే సమయంలో తాగడం అనేది కూడా తెలుసుకోవాలి. కొబ్బరినీళ్లు ఏ సమయంలో తాగాలి అనే ప్రశ్న చాలమంది ఉంది. కొంతమంది ఖాళీ కడుపుతో తీసుకుంటే.. మరికొందరు మధ్యాహ్నం తాగడం మంచిదని భావిస్తుంటారు. ఈ విషయమై జైపూర్‌కు చెందిన డైటీషియన్ మాట్లాడుతూ భోజనంతో లేదా తర్వాత అసలు తాగకూడు. గుండెల్లో మంట సమస్య ఉన్నవారు ఖాళీ కడుపుతో కొబ్బరి నీటిని తాగాలి. అయితే, ఖాళీ కడుపుతో ఈ హెల్తీ డ్రింక్ తాగడం వల్ల అనేక ఇతర ప్రయోజనాలు ఉన్నాయి. ఉదయాన్నే తాగడం వల్ల జీవక్రియ పెరుగుతుంది. అంతేకాదు బరువును తగ్గిస్తుంది కూడా. కడుపు ఆరోగ్యంగా ఉంటే శరీరం అనేక వ్యాధులు, ఇతర అనారోగ్య సమస్యల నుండి రక్షించబడుతుంది. అయితే సమస్యలతో భాధపడేవారు నిపుణుల సలహా మేరకు మధ్యాహ్నం కూడా తాగవచ్చు. సమ్మర్ సీజన్ కాబట్టి కొబ్బరి నీరు తీసుకోవడం ముఖ్యం. కానీ కిడ్నీ సంబంధిత ఆరోగ్య సమస్యలతో బాధపడేవారు కొబ్బరినీళ్లు తాగకూడదు. ఇది అధిక మొత్తంలో పొటాషియం ఉంటుంది కాబట్టి మూత్రపిండాలు దెబ్బతినే ప్రమాదం పెరుగుతుంది. అలాంటివారు డాక్టర్ల సలహా తీసుకోవాల్సి ఉంటుంది.

# గంజాయి రహిత సమాజం ప్రతి ఒక్కరి బాధ్యత

## వెల్గటూర్ ఎస్సై ఉమ సాగర్...



**ఎండపల్లి (ది క్రైమ్ న్యూస్):** యువత గంజాయిబారిన పడి విలువైన జీవితాన్ని కోల్పోవద్దని ఎస్సై ఉమ సాగర్ అన్నారు. జగిత్యాల జిల్లా ఎండపల్లి మండల కేంద్రంలో ఎస్సై ఉమ సాగర్ ఆధ్వర్యంలో స్థానిక ప్రజలకు గంజాయిపై బుధవారం అవగాహనా కల్పించారు. అనంతరం అందరితో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై ఉమ సాగర్ మాట్లాడుతూ...గంజాయి, మాధక ద్రవ్యల పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని యువత చేడుమార్గాన్ని ఎంచుకొని జీవితలను కోల్పోవద్దన్ని తెలిపారు. మి సమీపంలో యువత గంజాయి సేవించినట్లు గుర్తిస్తే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. కుటుంబాలను చిన్నబిన్నం చేసే గంజాయి పట్ల అప్రమత్తంగా ఉండాలని మాదకద్రవ్యాలు, అసాంఘిక కార్యకలాపాలు వంటి వాటికి యువత దూరంగా ఉండి ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తేవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యానికి మేలు చేసే సోంపు షర్బత్..

### శరీర ఉష్ణోగ్రతను ఐసులా కరిగించే సూపర్ డ్రింక్ మీ కోసం..

ఎండ వేడిమి రోజురోజుకూ పెరుగుతోంది. ఏసీలు, కూలర్లు, శీతల పానీయాల వినియోగం పెరిగింది. ఐస్‌క్రీమ్‌ల నుండి స్మూతీస్ వరకు, లస్సీ నుండి ఇంట్లో తయారుచేసిన నిమ్మరసం, మజ్జిగ వరకు అందరూ ఆరోగ్యకరమైన, శరీరానికి చలువ చేసే ఆహారాన్ని కోరుకుంటున్నారు.. బాటిల్, రిఫ్రిజిరేటెడ్ పానీయాలు కెమికల్ ఆధారంగా తయారు చేస్తారు. కాబట్టి అవి వాటి ప్రత్యేక రుచిని కలిగి ఉంటాయి. కానీ, ఇంట్లో తయారుచేసిన జ్యూస్‌లు మరింత రుచిని కలిగి ఉంటాయి. అలాంటిదే వేసవిలో మనకు చలువు చేసే ఒక పానీయం ఉంది. ఇంట్లోనే ఈజీగా తయారు చేసుకోగల ఈ షర్బత్ ఎండవేడిమి, మంటను తగ్గించి మిమ్మల్నీ కూల్‌గా ఉంచుతుంది. అదేంటో ఇక్కడ తెలుసుకుందాం. సాధారణంగా మనమందరం సోంపును మౌత్ ఫ్రెషనర్‌గా ఉపయోగిస్తాము. చాలా మంది దీనిని వివిధ డెజర్ట్‌లకు కూడా కలుపుతారు. సోంపు షర్బత్ అనేది ప్రజలందరికీ ఎంతగానో నచ్చే చల్లని జ్యూస్. ఇది సాధారణంగా పసుపు రంగులో ఉంటుంది. దాని ప్రత్యేకమైన రుచి, వాసనకు పేరుగాంచింది. ఇది వేసవిలో చాలా ఉపయోగకరంగా ఉంటుంది. దీన్ని తయారు చేయడానికి ఎక్కువ శ్రమపడాల్సిన అవసరం కూడా ఉండదు. ఇది శరీరంలోని వేడి నుండి ఉపశమనాన్ని అందజేయడమే కాకుండా ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. సోంపు షర్బత్‌ను తయారు చేయడానికి ప్రధాన పదార్థాలు సోంపు గింజలు, నిమ్మకాయ రసం, చక్కెర, నీరు. ఇకపోతే, ముందుగా ఈ సోంపు ఆరోగ్య ప్రయోజనాలను పరిశీలించినట్టయితే.. 1. జీర్ణక్రియలో.. ఇది జీర్ణక్రియను ప్రోత్సహించడానికి వేసవి కాలంలో శరీరాన్ని చల్లబరచడానికి సహాయపడుతుంది. కడుపు ఉబ్బరం, గ్యాస్, అజీర్ణం వంటి జీర్ణ సమస్యలను తగ్గించడంలో సహాయపడే లక్షణాలను కలిగి ఉన్నాయి. ఇవి జీర్ణ ఎంజైమ్‌ల ఉత్పత్తిని ప్రేరేపిస్తాయి. ఇవి మంచి జీర్ణక్రియకు సహాయపడతాయి. అందుకే మనం ఎప్పుడు హొటల్ కి డిన్నర్ కి వెళితే భోజనం అయ్యాక సోంపు అందిస్తారు. 2 . ఫ్రెషెన్స్ బ్రీత్ .. యాంటీమైక్రోబయల్ లక్షణాలను కలిగి ఉన్నాయి. దీని కారణంగా సోంపు నమలడం వల్ల శ్వాసను తాజాగా ఉంచుతుంది. ఇది లాలాజల ఉత్పత్తిని ప్రేరేపిస్తుంది. ఇది నోటిలోని బ్యాక్టీరియాను తొలగించేందుకు సహాయపడుతుంది. 3. మలబద్ధకం కోసం ప్రయోజనకరమైన.. సోంపు తేలికపాటి భేదిమందు లక్షణాలను కలిగి ఉంటుంది. ఫైబర్ అధికంగా ఉండటం వల్ల ఇది ప్రేగు కదలికను ప్రేరేపిస్తుంది. ఇది మలబద్ధకం నుండి ఉపశమనాన్ని అందించడంలో సహాయ పడుతుంది. 4. కడుపులో మంటను తగ్గిస్తుంది.. కడుపులో గ్యాస్‌ను తొలగించడంలో సహాయపడే కార్మినేటివ్ లక్షణాలను కలిగి ఉంటుంది. జీర్ణాశయంలోని కండరాలను సడలించడం, గ్యాస్ ఉత్పత్తిని తగ్గించడం ద్వారా ఉబ్బరం, కడుపులో అసౌకర్యాన్ని తగ్గించడంలో సోంపు బాగా సహాయపడుతుంది. 5. యాంటీ ఆక్సిడెంట్ గుణాలు.. సోంపు శరీరంలోని హానికరమైన ఫ్రీ రాడికల్స్‌ను తటస్థం చేయడంలో సహాయపడే ఫ్లేవనాయిడ్లు, ఫినోలిక్స్ వంటి యాంటీఆక్సిడెంట్లను కలిగి ఉంటాయి. ఇది మంటను తగ్గిస్తుంది. గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధుల నుండి రక్షించడంలో సహాయపడుతుంది. మీరు క్రమం తప్పకుండా సోంపును తీసుకుంటే అది మీ ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. సోంపుతో షర్బత్ తయారీకి కావాల్సిన పదార్థాలు, ఎలా తయారు చేయాలో ఇక్కడ తెలుసుకుందాం.. 2 టేబుల్ స్పూన్లు సోంపు 1/2 కప్పు చక్కెర మీరు కావాలంటే చక్కెరకు బదులుగా తేనెను కూడా ఉపయోగించవచ్చు. 1 నిమ్మకాయ రసం 1 లీటరు నీరు తాజా పుదీనా ఆకులు మరింత రుచి కోసం, రోజ్ వాటర్ ను కొద్దిగా కలుపుకోవచ్చు. సోంపు షర్బత్ ఆరోగ్య ప్రయోజనాలు: సోంపు షర్బత్ జీవక్రియను పెంచి, కొవ్వు కరుగుటకు సహాయపడుతుంది. శరీర ఉష్ణోగ్రతను చల్లబరుస్తుంది. వేసవిలో శరీర ఉష్ణోగ్రత పెరిగి, డీహైడ్రేషన్‌కు దారితీస్తుంది. సోంపు షర్బత్ చల్లగా ఉండటం వల్ల శరీరాన్ని చల్లబరుస్తుంది. డీహైడ్రేషన్‌ను నివారిస్తుంది. తిన్న తర్వాత తీసుకుంటే, నోటి దుర్వాసనను తొలగిస్తుంది. సోంపు గింజల్లో యాంటి బాక్టీరియల్ లక్షణాలు ఉంటాయి. ఇవి నోటిలోని బ్యాక్టీరియా పెరుగుదలను నిరోధించి, నోటి దుర్వాసనను తొలగిస్తాయి. సోంపు షర్బత్‌ను ఎక్కువగా తీసుకోవడం వల్ల కడుపు నొప్పి, విరేచనాలు వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది. కాబట్టి ఏదైనా సరే మోతాదుకు మించి తీసుకోవటం మంచిది కాదు.

## ఈ ఐదుగురు మెంతులకు దూరంగా ఉండాలి.. లేకుంటే ప్రమాదమే..!



అనేక ఆరోగ్య సమస్యలను అధిగమించడానికి, అద్భుతమైన ప్రయోజనాలను పొందడానికి మెంతి గింజలను తీసుకుంటారు. మెంతి గింజల వల్ల కలిగే ప్రయోజనాల గురించి చాలా తక్కువ మందికి మాత్రమే తెలుసు. అయితే ఆహారం రుచిని పెంచేందుకు ఈ గింజలను రకరకాలుగా ఉపయోగిస్తాం. మెంతి గింజలను సాధారణంగా ఔషధంగా లేదా ఆహారంతో తీసుకుంటారు. ఇవి చాలా ఆరోగ్యకరమైనవి. కానీ కొంతమంది మెంతి గింజలను తీసుకోవడం ద్వారా సమస్యలను ఎదుర్కోవచ్చు. మీ శరీరంలో కింద పేర్కొన్న కొన్ని సమస్యలు ఉంటే, మీరు మెంతులు తినకూడదని నిపుణులు సూచిస్తున్నారు. మెంతులను ఎవరు తీసుకోకూడదు డయాబెటిస్: మెంతి గింజలు చక్కెర స్థాయిని నియంత్రించడంలో సహాయపడేందుకు ఎంతగానో ఉపయోగపడతాయి. అయితే కొన్ని సందర్భాల్లో దీని వినియోగం మధుమేహాన్ని మరింత పెంచే అవకాశం ఉంది. మధుమేహ రోగులు మెంతి గింజలను తీసుకునే ముందు వారి వైద్యుడిని సంప్రదించాలి. అలర్జీ: కొందరికి మెంతి గింజల వల్ల అలర్జీ రావచ్చు. అందువల్ల మీరు మెంతులు వైద్యపరమైన ప్రతిచర్య ఏదైనా సూచనను కలిగి ఉంటే, మీరు దానిని నివారించాలి. అల్సర్: మెంతుల వినియోగం అల్సర్ రోగులకు హానికరం. ఈ రోగులు మెంతి గింజలను తీసుకోవడం ద్వారా సమస్యలను ఎదుర్కొంటారు. హార్మోన్ల అసమతుల్యత: కొన్ని సందర్భాల్లో మెంతి గింజల అధిక వినియోగం హార్మోన్ల స్థాయిలను భంగం చేస్తుంది. అందుకే హార్మోన్ల అసమతుల్యత లక్షణాలు ఉన్న వ్యక్తులు మెంతి గింజలను తీసుకునే ముందు వైద్యుడిని సంప్రదించాలి. శరీర ఉష్ణోగ్రత అసమతుల్యత: కొంతమందికి మెంతులను తీసుకోవడం వల్ల శరీర ఉష్ణోగ్రతలో అసమతుల్యత ఏర్పడవచ్చు. ఇది శారీరక సమస్యలను కలిగిస్తుంది. ఈ సమస్యలన్నీ ప్రతి వ్యక్తికి రావని గమనించండి. అయితే మీకు ఈ సమస్యలు ఏవైనా ఉంటే మీరు మెంతి గింజలను తీసుకునే ముందు వైద్యుడిని సంప్రదించాలి.

# విశ్వజి



## ఈ సీజన్ లో డయాబెటిస్ రోగులకు సూపర్ పండు ఇదే!

నేరేడు పండు.. వర్షాకాలంలో దొరికే అద్భుతమైన పండు. చాలామంది డయాబెటిస్ బాధితులు ఏ పండ్లు తినాలి అని ఆలోచిస్తూ ఉంటారు. వర్షాకాలంలో దొరికే ఈ సీజనల్ పండు డయాబెటిస్ బాధితులకు ఎంతో బాగా ఉపయోగపడుతుంది. నేరేడు పండు తినడం వల్ల అనేక అనారోగ్య సమస్యల నుంచి బయటపడతారు నేరేడు పండ్లు మధుమేహాన్ని కంట్రోల్ చేయడంతో పాటు బరువు తగ్గడంలో దోహదం చేస్తాయి. నేరేడు పండ్లలో ఫుల్ పోషకాలు ప్రకృతి సిద్ధంగా లభించే నేరేడు పండ్లు మనకు సంపూర్ణ ఆరోగ్యాన్ని ఇవ్వడానికి ఎంతో బాగా ఉపయోగపడతాయి. నేరేడు పండులో ఫుల్ గా పోషకాలు ఉంటాయి. నేరేడు పండులో విటమిన్ సి, విటమిన్ బి, క్యాల్షియం, మెగ్నీషియం, ఫాస్ఫరస్, ఐరన్ తో పాటు ఇతర పోషకాలు ఉంటాయి. నేరేడు పండులో పుష్కలంగా ఉండే పోషకాలు మన శరీరానికి కావలసిన ఆరోగ్య ప్రయోజనాలను ఇస్తాయి. డయాబెటిస్ బాధితులకు బెస్ట్ పండ్లు నేరేడు పండ్లలో ఫైబర్ పుష్కలంగా ఉండటం వల్ల ఇది రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయం చేస్తుంది. నేరేడు పండు గ్లైసిమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండే పండు, కాబట్టి ఇది డయాబెటిస్ పేషెంట్స్ కు ఎంతో బాగా పనిచేస్తుంది. అయినప్పటికీ డయాబెటిస్ పేషెంట్స్ నేరేడు పండ్లను కూడా ఎక్కువ తినకూడదు. 10 నుండి 12 పండ్లను మాత్రమే తినాలి. %ుాశీషవతీవస దీఎ% నేరేడు పండ్లతో ఆరోగ్యం నేరేడు పండ్లను తినడం వల్ల రక్తంలోని హిమోగ్లోబిన్ సమతుల్యం అవుతుంది. నేరేడు పండ్లలో ఉండే విటమిన్ సి కంటి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. నేరేడు పండ్లలో యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి మన చర్మ ఆరోగ్యాన్ని కాపాడతాయి. సమతుల్య ఆహారాన్ని తీసుకోవాలని భావించేవారికి నేరేడు పండ్లు ఒక మంచి ఎంపిక. నేరేడు పండ్లు ఇలాగే తినాలి నేరేడు పండ్లు మన శరీరంలో వ్యర్థాలను బయటకు పంపించడానికి, కడుపుని శుభ్రం చేయడానికి, జీర్ణశక్తిని మెరుగుపరచడానికి దోహదం చేస్తాయి. అన్నిటికంటే డయాబెటిస్ బాధితులకు ఎంతో బాగా ఉపయోగపడే నేరేడు పండ్లను తినండి అయితే ముఖ్యంగా మితంగా తినాలి అనే విషయాన్ని ప్రతి ఒక్కరు కచ్చితంగా గుర్తు పెట్టుకోండి.


## ఈ 'చిన్న అలవాటు' తో షుగర్ అదుపులో - మరెన్నో లాభాలు..!!



చిన్న అలవాటు ఎన్నో ప్రయోజనాలు అందిస్తుంది. మారుతున్న కాలంతో ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. ఆహారంతో పాటుగా జీవనశైలిలో మార్పులతో ఎన్నో అనారోగ్య సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది. కాగా, మన వంటింట్లో వినియోగించే పదార్థాల్లోనే ఎన్నో ఔషధ గుణాలు కలిగినవి ఉన్నాయి. సుగంధ ద్రవ్యాల్లో ఒకటైన సోంపు గింజల వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. ఆయుర్వేదంలో కూడా ఒక శక్తివంతమైన ఔషధంగా పరిగణిస్తారు. రోజూ సోంపు నీరు తాగటం ద్వారా ఊహించని ఫలితాలు పొందవచ్చు చాలామంది భోజనం తర్వాత కాస్తంత సోంపును నోట్లో వేసుకుంటారు. ఇందులో ఉండే ఫైబర్ జీర్ణక్రియకు సహాయపడుతుందని నిపుణులు చెబుతున్నారు. సోంపులో ఉండే ఫైబర్, యాంటీ-ఇన్ఫ్లమేటరీ లక్షణాలు జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తాయి. కడుపు ఉబ్బరం, గ్యాస్, అజీర్తి వంటి సమస్యలను తగ్గించడంలో సహాయపడుతుంది. సోంపు నీళ్ల జీర్ణక్రియను మెరుగుపరచడం ద్వారా, శరీరంలోని మెటబాలిజంను పెంచుతాయని నిపుణులు చెబుతున్నారు. సోంపులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు శరీరంలోని వ్యర్థాలను, విష పదార్థాలను బయటకు పంపడానికి సహాయ పడతాయి. సోంపులో పొటాషియం అధికంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఇది శరీరంలో సోడియం స్థాయిలను సమతుల్యం చేసి, రక్తపోటును అదుపులో ఉంచుతుంది. సోంపు నీళ్ల రక్తంలోని చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడతాయని నిపుణులు చెబుతున్నారు. ఇది ఇన్సులిన్ ఉత్పత్తిని మెరుగుపరచి, డయాబెటిస్ అదుపులో ఉండటానికి దోహదపడుతుందని చెబుతున్నారు. సోంపు నీటిలో యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు ఆరోగ్య రమైన, మెరిసే చర్మానికి దోహదం చేస్తాయి. సోంపు నీరు రక్తపోటు, కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడటం ద్వారా గుండె ఆరోగ్యానికి దోహదం చేస్తుంది. సోంపు శ్వాసకోశంలోని శ్లేష్మం, కఫాన్ని తొలగించడంలో సహాయపడతాయి. సోంపులో విటమిన్-ఎ పుష్కలంగా ఉంటుంది. ఇందులో ఉండే ఫైటోఈస్ట్రోజెన్‌లు రుతుక్రమంలో వచ్చే నొప్పిని, తిమ్మిరిని తగ్గించడానికి సహాయపడడంతో పాటు మోనోపాజ్ ఆగిన లక్షణాలు వంటి హార్మోన్ల అసమతుల్యతను తగ్గించటానికి దోహదం చేస్తుంది.

### పరగడుపునే అల్లం రసాన్ని తాగండి-

## డయాబెటిస్, హైబీపీకి చెక్..!!



అల్లం ప్రతీ ఇంటా ఉంటుంది. ఆహార పదార్థాల్లో ఎక్కువగా వినియోగిస్తాం. అల్లం రుచి.. వాసన మాత్రమే కాదు. ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయి. ఆయుర్వేద ప్రకారం అల్లంకు ఎంతగానో ప్రాము ఖ్యత ఉంది. పలు రకాల ఔషధాల తయారీకి కూడా అల్లాన్ని ఉపయోగిస్తుంటారు. రోజూ ఉదయం పరగడుపునే 1 టీస్పూన్ అల్లం రసం సేవిస్తే ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. అల్లంలో ఉండే అనేక సమ్మేళనాలు ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. జీర్ణ వ్యవస్థ మొదలు రక్తపోటు నియంత్రణ వరకు అల్లం మేలు చేస్తుందని చెబుతున్నారు. అల్లంలో ఉన్న ఔషధ గుణాలు పలు రకాల అరోగ్య సమస్యల పరిష్కారినికి మేలు చేస్తాయి. అల్లం రసం తాగడం వల్ల జీర్ణాశయ ఎంజైమ్‌లు ఉత్పత్తి అవుతాయి. దీంతో జీర్ణ శక్తి పెరుగుతుంది. అల్లంలో జింజరాల్స్, షోగోల్స్ అనే సమ్మేళనాలు ఉంటాయి. ఇవి ఆహారం సులభంగా కదిలేలా చేస్తాయి. దీంతో ఆహారం సులభంగా జీర్ణం అవుతుంది. అలాగే జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. జీర్ణశక్తి పెరుగుతుంది. కడుపు ఉబ్బరం, అజీర్తి, గ్యాస్, పొట్టలో అసౌకర్యం వంటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. మెటబాలిజం కూడా పెరుగుతుంది. అధిక బరువు తగ్గటానికి ల్లం దోహదం చేస్తుంది. అల్లం రసాన్ని పరగడుపునే సేవిస్తుంటే అందులో ఉండే యాంటీ ఇన్ ఫ్లమేటరీ గుణాలు వాపులు, నొప్పులను తగ్గిస్తాయి. %ూశ్రీంశీ =ఖుం% 'అన్నదాత సుఖీభవ' అర్హుల జాబితా, వారికే నిధులు- పేరు లేకుంటే ఇలా చేయండి..!! ఆర్థరైటిస్ సమస్యలు ఉన్నవారికి అల్లం రసంతో ఉపశమనం ఉంటుంది. అల్లంలో యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్ ఫ్లమేటరీ సమ్మేళనాలు అధికంగా ఉండడం వల్ల ఫ్రీ ర్యాడికల్స్ నిర్మూలించి శరీర రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా మారుతుంది. ఇన్‌ఫెక్షన్లు, రోగాలకు శరీరం వ్యతిరేకం గా పోరాడుతుంది. అల్లం రసం సేవించడం వల్ల శరీరం ఇన్సులిన్‌ను సమర్థవంతంగా ఉపయోగించుకుంటుందని పలు నివేదికలు వెల్లడిస్తున్నాయ. ఫలితంగా షుగర్ లెవల్స్ తగ్గుతాయి. ఇక, అల్లం రసం తాగడం వల్ల శరీరంలో రక్త సరఫరా మెరుగు పడుతుంది. బీపీ నియంత్రణలోకి వస్తుంది చెబుతున్నారు. అల్లంలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. శరీరంలోని అంతర్గత వాపులు తగ్గిపోతాయి. దీంతో రోజంతా ఉత్సాహంగా ఉంటారు. ఇలా అల్లం రసం ద్వారా ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చు

## ఈ అలవాట్లను మార్చుకోకపోతే.. డాక్టర్లు కూడా మిమ్మల్ని రక్షించలేరు!

బరువు పెరగడం అనేది చాలా మందిని వేధించే సమస్య. కొందరికి ఇది ఆరోగ్య సమస్యల కారణంగా సంభవించినప్పటికీ, ఎక్కువ మందికి వారి రోజువారీ అలవాట్లే ప్రధాన కారణం. మనం చేసే చిన్న చిన్న పొరపాట్లు, నిర్లక్ష్యంగా తీసుకునే ఆహారం, జీవనశైలిలో మార్పులు క్రమంగా మన బరువును పెంచుకుంటూ పోతాయి. ఈ బరువు పెంచే అలవాట్లను గుర్తిస్తే, మనం ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపవచ్చు. జంక్ ఫుడ్, ప్రాసెస్డ్ ఫుడ్: మొదటగా ఆహారం విషయానికి వస్తే, చాలా మంది సమయం లేకపోవడం లేదా ఇతర కారణాల వల్ల సరైన ఆహారం తీసుకోరు. దీనికి బదులుగా జంక్ ఫుడ్, ప్రాసెస్డ్ ఫుడ్ లేదా అధిక కేలరీలు ఉండే ఆహార పదార్థాలను ఎక్కువగా తీసుకుంటారు. పిజ్జాలు, బర్గర్లు, ఫ్రెంచ్ ఫ్రైస్ వంటి ఆహారాల్లో కేలరీలు, కొవ్వులు , చక్కెరలు అధికంగా ఉంటాయి. వీటిని తరచుగా తీసుకోవడం వల్ల శరీరానికి అవసరమైన పోషకాలు అందకపోయినా, అధిక మొత్తంలో కేలరీలు మాత్రం చేరుతాయి. ఇది క్రమంగా బరువు పెరగడానికి దారితీస్తుంది. భోజనం చేసే వేళల్లో మార్పులు: తరువాత, చాలా మందికి భోజనం చేసే వేళలు కూడా సరిగా ఉండవు. ఒకరోజు ఉదయం 8 గంటలకు తింటే, మరోరోజు 11 గంటలకు తినడం వల్ల జీర్ణక్రియ వ్యవస్థ గందరగోళానికి గురవుతుంది. అంతేకాకుండా, చాలా మంది రాత్రిపూట ఆలస్యంగా భోజనం చేస్తారు. రాత్రిపూట జీర్ణక్రియ నెమ్మదిగా జరుగుతుంది కాబట్టి, ఆహారం సరిగ్గా జీర్ణం కాక కొవ్వుగా మారే అవకాశం ఉంది. నిద్రపోయే ముందు భారీగా తినడం కూడా బరువు పెరగడానికి ఒక ముఖ్య కారణం. శీతల పానీయాలు: ఇక పానీయాల విషయానికి వస్తే, చాలా మంది శీతల పానీయాలు, చక్కెర కలిపిన జ్యూస్‌లు , ఇతర తీపి పానీయాలను ఎక్కువగా తాగుతారు. వీటిలో కేలరీలు చాలా ఎక్కువగా ఉంటాయి, కానీ పోషక విలువలు మాత్రం శూన్యం. వీటిని తాగడం వల్ల కడుపు నిండిన భావన కలగదు, కానీ శరీరానికి మాత్రం అధిక మొత్తంలో చక్కెర చేరుతుంది. ఇది ఇన్సులిన్ నిరోధకతకు దారితీసి, బరువు పెరగడానికి కారణమవుతుంది. నీరు తక్కువగా తాగడం కూడా బరువు పెంచే అలవాట్లలో ఒకటి. నీరు జీవక్రియను మెరుగుపరచడానికి మరియు ఆకలిని నియంత్రించడానికి సహాయపడుతుంది. కాబట్టి, తగినంత నీరు తాగకపోతే శరీరం డీహైడ్రేషన్‌కు గురవ్వడమే కాకుండా, బరువు కూడా పెరిగే అవకాశం ఉంది.

# మార్కెట్

## అమ్మకాల ఒత్తిడికి అవకాశం!

దేశీయ స్టాక్ మార్కెట్లు గత వారం మళ్లీ నష్టాల్లోకి జారుకున్నాయి. మదుపరులు లాభాల స్వీకరణకు పెద్దపీట వేశారు. ఆయా రంగాల షేర్లను దూరం పెడుతూ కొనుగోళ్లకు అంతగా ఆసక్తి కనబర్చలేదు. విదేశీ ఇన్వెస్టర్లు సైతం పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే గత వారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 626.01 పాయింట్లు లేదా 0.74 శాతం కోల్పోయి 83,432.89 వద్ద నిలిచింది. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 176.80 పాయింట్లు లేదా 0.68 శాతం పడిపోయి 25,461 దగ్గర స్థిరపడింది. అయితే రుతు పవనాలు ఇంకా దేశవ్యాప్తంగా విస్తరించకపోవడంతో వ్యవసాయంపై గుబులు పట్టుకుంటున్నది. అలాగే పశ్చిమాసియాలో ఇజ్రాయెల్ దాడులు ఇప్పటికీ కొనసాగుతుండటం కొంత ఆందోళనకరంగానే ఉన్నదని చెప్పవచ్చు. దీంతో ఇన్వెస్టర్లు ఈ వారం అమ్మకాల ఒత్తిడిలోనే ఉండవచ్చన్న అంచనాలైతే ఉన్నాయి. ఇక ఎప్పట్లాగే డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ, గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, విదేశీ సంస్థాగత మదుపరుల (ఎఫ్ఐఐ) పెట్టుబడులు, దేశీయ మార్కెట్లను నిర్దేశించనున్నాయి. అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 25,100 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 24,900 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. కానీ సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 25,700-25,900 స్థాయికి వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.



## మధ్యతరగతికి భారీ ఊరట.. ఎనిమిదేళ్ల కనిష్టానికి రిటైల్ ద్రవ్యోల్బణం..!

సామాన్యులకు ముఖ్యంగా మధ్యతరగతి కుటుంబాలకు భారీ ఊరట లభించింది. దేశంలో రిటైల్ (చిల్లర) ద్రవ్యోల్బణం గత ఎనిమిదేళ్లలో ఎన్నడూ లేనంత కనిష్ఠస్థాయికి పడిపోయింది. ఈ ఏడాది జూలై నెలకుగాను రిటైల్ ద్రవ్యోల్బణం కేవలం 1.55 శాతంగా నమోదైనట్లు ప్రభుత్వం విడుదల చేసిన ప్రాథమిక గణాంకాలు స్పష్టంచేశాయి. 2017 జూలై తర్వాత రిటైల్ ద్రవ్యోల్బణం ఇంత తక్కువగా నమోదుకావడం ఇదే తొలిసారి. జూన్ నెలలో 2.10 శాతంగా ఉన్న రిటైల్ ద్రవ్యోల్బణం ఒక్క నెలలోనే 55 బేసిస్ పాయింట్లు తగ్గి 1.55 శాతానికి పడిపోయింది. ఆహార పదార్థాల ధరలు గణనీయంగా తగ్గడమే రిటైల్ ద్రవ్యోల్బణం తగ్గుదలకు ప్రధాన కారణమని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఆహార ద్రవ్యోల్బణం ఏకంగా మైనస్ 1.76 శాతానికి పడిపోయింది. 2019 జనవరి తర్వాత ఆహార ధరలు ఈ స్థాయిలో తగ్గడం ఇదే మొదటిసారి. ముఖ్యంగా పప్పుధాన్యాలు, కూరగాయలు, తృణధాన్యాలు, గుడ్లు, చక్కెర లాంటి



నిత్యావసరాల ధరలు దిగిరావడం సామాన్యుడికి పెద్ద ఉపశమనం కలిగించింది. రవాణా, కమ్యూనికేషన్, విద్యా రంగాల్లోనూ ధరలు తగ్గుముఖం పట్టాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాలు రెండింటిలోనూ ద్రవ్యోల్బణం తగ్గింది. గ్రామీణ ప్రాంతాల్లో రిటైల్ ద్రవ్యోల్బణం జూన్‌లో 1.72 శాతం ఉండగా జూలైలో 1.18 శాతానికి తగ్గింది. అదేవిధంగా పట్టణ ప్రాంతాల్లో 2.56 శాతం నుంచి 2.05 శాతానికి దిగివచ్చింది. రెండు ప్రాంతాల్లోనూ ఆహార పదార్థాల ధరలు రుణాత్మక స్థాయిలోనే నమోదయ్యాయి. అయితే, కొన్ని రంగాల్లో మిశ్రమ ఫలితాలు కనిపించాయి. గృహ నిర్మాణ రంగంలో ద్రవ్యోల్బణం 3.17 శాతం వద్ద స్థిరంగా ఉండగా, ఆరోగ్య రంగంలో స్వల్పంగా 4.57 శాతానికి పెరిగింది. ఇంధనం, విద్యుత్ రంగాల్లో కూడా స్వల్ప పెరుగుదల నమోదైంది. దీనిపై ఎల్ %డ% టీ గ్రూప్ చీఫ్ ఎకనామిస్ట్ సచ్చిదానంద్ శుక్లా మాట్లాడుతూ.. ద్రవ్యోల్బణం తగ్గడం ఇది వరుసగా తొమ్మిదోసారి అన్నారు. బహుశా ఇదే కనిష్ఠ స్థాయి కావచ్చని అభిప్రాయపడ్డారు. 2026 మార్చి నాటికి ద్రవ్యోల్బణం ఇప్పుడున్న దానికి మూడు రెట్లు ఎక్కువగా ఉండే అవకాశం ఉందని అంచనా వేశారు.

## పాన్ కార్డు పోయిందా? చింతించకండి..

### నిమిషాల్లో డూప్లికేట్ కోసం అప్లై చేయండి ఇలా!

పాన్ కార్డు పోగొట్టుకోవడం లేదా దొంగిలించబడటం అనేది ఈ రోజుల్లో చాలా సాధారణం అయిపోయింది. ఎన్నో ముఖ్యమైన పత్రాలతో పాటు పాన్ కార్డును కూడా ఎక్కడో పెట్టి మర్చిపోవడం లేదా అనుకోకుండా పోగొట్టుకోవడం సహజంగా జరుతుంది. కానీ పాన్ కార్డు లేకపోతే అనేక పనులు ఆగిపోతాయి. ముఖ్యంగా ఆర్థికపరమైన విషయాల్లో చాలా చిక్కులు ఎదురవుతాయి. అయితే మీరు అస్సలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు! పోగొట్టుకున్న పాన్ కార్డును తిరిగి పొందడం ఇప్పుడు చాలా సులభం. మీరు ఇంట్లో కూర్చొనే ఆన్‌లైన్‌లో డూప్లికేట్ పాన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. పాన్ కార్డు కేవలం ఒక ప్లాస్టిక్ ముక్క మాత్రమే కాదు, అది మీ గుర్తింపుకు చిహ్నం. ఈ రోజుల్లో పాన్ కార్డు ఒక ముఖ్యమైన పత్రంగా మారిపోయింది. గ్యాస్ కనెక్షన్ తీసుకోవాలన్నా, కొత్తగా బ్యాంకు ఖాతా తెరవాలన్నా, ఇంకా మరెన్నో ముఖ్యమైన పనులకు పాన్ కార్డు తప్పనిసరి. ఒకవేళ మీ పాన్ కార్డు పోతే, మీరు చాలా ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుంది. అందుకే, పాన్ కార్డు పోగొట్టుకున్న వెంటనే డూప్లికేట్ కోసం దరఖాస్తు చేసుకోవడం చాలా ముఖ్యం. ఇప్పుడు డూప్లికేట్ పాన్ కార్డు కోసం ఎలా దరఖాస్తు చేసుకోవాలో తెలుసుకుందాం రండి.. డూప్లికేట్ పాన్ కార్డు కోసం



దరఖాస్తు చేసుకునే విధానం: అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించండి: మొదటగా మీరు (నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్) అధికారిక వెబ్‌సైట్‌కు వెళ్లాలి. వెబ్‌సైట్ చిరునామాను గూగుల్‌లో సెర్చ్ చేసి తెలుసుకోవచ్చు లేదా నేరుగా వెబ్‌సైట్‌కు వెళ్లడానికి ప్రయత్నించవచ్చు. వివరాలను నమోదు చేయండి: వెబ్‌సైట్‌లో డూప్లికేట్ పాన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకునే విభాగానికి వెళ్లండి. అక్కడ మీరు మీ పాన్ కార్డు నంబర్ (గుర్తుంటే), మీ 10 అంకెల ఆధార్ నంబర్ మరియు, మీ పుట్టిన తేదీని నమోదు చేయాలి. మీరు ఈ వివరాలను జాగ్రత్తగా , సరిగ్గా నమోదు చేయాలి.

# రాష్ట్రంలో ప్రజాస్వామ్యం అపహాస్యం

## శాంతిభద్రతలు లేవనడానికి జడ్పీటిసి ఎన్నికలే నిదర్శనం

## పోలీసులే దగ్గరుండి రిగ్గింగ్‌కు సహకరిస్తే ఎలా

## వైకాపా ఏజెంట్లు లేకుండానే ఎన్నికల నిర్వహణ

## ఇంత దిగజారుడు వ్యవహారం ఎక్కడా చూడలేదు

## చంద్రబాబుకు ఇవే చివరి ఎన్నికలు కావచ్చు

## రామాకృష్ణా అనుకుంటూ గడపాల్సిన వయసులో ఇదేనా

## మీడియా సమావేశంలో వైకాపా అధినేత జగన్ విమర్శలు



అమరావతి,ఆగస్ట్13 : ఏపీలో శాంతిభద్రతలు లేవనడానికి.. పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికల సందర్భంగా దాడులే నిదర్శనమని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. సాక్షాత్తూ కలెక్టర్ సమక్షంలో దొంగ ఓట్లు వేయడం, పోలీసులే దగ్గరుండి రిగ్గింగ్ జరిపించడాన్ని ప్రస్తావిస్తూ చంద్రబాబు ప్రభుత్వంపై ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. చంద్రబాబుకు ఇక ఇవే చివరి ఎన్నికలని,రామాకృష్ణా అనుకుంటూ కాలం గడపాల్సిన వయసులో ఇంత అరాచకమెందుకని ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం కనబడటం లేదు. ప్రజాస్వామ్యం లేదన్నది ఎన్నికల్లో రుజువైంది. రాష్ట్రంలో ఎలాంటి పరిస్తితులున్నాయో చెప్పడానికి పులివెందుల,ఒంటిమిట్ట ఎన్నికలే ఉదాహరణ. పోలింగ్ బూత్ లలో వైఎస్సార్‌సీపీ ఏజెంట్లు- లేరు. వైఎస్సార్‌సీపీ ఏజెంట్లు- బూత్ లలో లేకుండా చేసి రిగ్గింగ్ చేసుకున్నారు. పోలీసుల ప్రోద్భలంతో రిగ్గింగ్ చేసుకున్నారు. దేశంలో పోలింగ్ బూత్ ఏజెంట్లు- లేకుండా ఎన్నికలు జరిగింది ఇక్కడే .పోలింగ్ బూత్ ఏజెంట్లకు కొన్ని హక్కులు.. బాధ్యతలుంటాయ్. నకిలీ ఓటర్లను గుర్తించడం, అభ్యంతరాలను తెలియజేయడం , పోలింగే వివరాలను తెలుసుకోవడం వంటి బాధ్యతలుం టాయి. పోలింగ్ ఏజెంట్లను నియమించుకునేందుకు ఫామ్ -12 ఇస్తారు. వైఎస్సార్‌సీపీ ఏజెంట్ల నుంచి ఫామ్ -12 ను పోలీసులు,టిడిపి వాళ్లు లాక్కున్నారు. పోలింగ్ ఏజెంట్లు- లేకుండా ఎన్నిక జరగడం చరిత్రలో ఎక్కడా చూడలేదు. ప్రజాస్వామ్యం ఇంతలా దిగజారిపోయిన పరిస్థితులు ఏపీలోనే చూస్తున్నాం. ఎన్నిక ముగిసిన తర్వాత బ్యాలెట్ బాక్స్ సీల్ పై కూడా ఏజెంట్ సంతకం తీసుకుంటారు. ఇవన్నీ ఎన్నికలో జరిగాయా?. ఏజెంట్లే లేకుండా జరిగితే వాటిని ఎన్నికలు అంటారా?.. అని ప్రశ్నించారు. ఇదే తరహాలో ఎన్నికలు జరిపితే హాస్యాస్పదమే అవుతుంది. ఇంతటి దానికి ఎన్నికలు జరపడం దేనికి. ప్రజలకు మంచి చేయాలనే ఉద్దేశం ఈ ప్రభుత్వానికి లేదు. దోచుకో.. పంచుకో.. తినుకో.. ఇది వాళ్ల విధానం అంటూ దుయ్యబట్టారు. ఒకప్పుడు బందిపోట్ల పేరు చెబితే వినిపించే చంబల్ లోయను మరిపించేలా చంద్రబాబు పులివెందుల ఎన్నిక జరిపారరి విమర్శలు గుప్పించారు. సాక్షాత్తూ పోలీసులు దగ్గరుండి ప్రోత్సహించారు. చంద్రబాబుకు ఇదే నా ఛాలెంజ్.. ప్రజలు మీకు ఓటు- వేస్తారనే నమ్మకం ఉంటే ఎన్నికలను రద్దు చేయండి. కేంద్ర బలగాల సమక్షంలో ఎన్నిక జరపండి.. ప్రజాస్వామ్యంలో మీకు ఓట్లు- వేసే అవకాశం లేదు. ప్రతీ బూత్ లో వెబ్ కాస్టింగ్, సీసీ ఫుటేజ్ ఇచ్చే ధైర్యం మీకుందా?. ఎవరెవరు బయటి నుంచి వచ్చారు.. ఎవరెవరు బూత్ లను ఆక్రమించుకున్నారో ఆధారాలిస్తా. అడ్డగోలు రాజకీయాలు చేసే వాళ్లను మోసగాడు అంటారు. ఏ ఎన్నిక జరిగినా ఆ ఊర్లో ప్రజలే అక్కడ ఓటేస్తారు ... గతంలోనూ అదే జరిగింది. ప్రత్యేకంగా ఈ ఎన్నికల్లో చంద్రబాబు పోలింగ్ బూత్ లను మార్చేశారు. పోలింగ్ బూత్ లు మార్చడం వల్ల నాలుగు వేల ఓట్ల పై ప్రభావం పడింది. పోలింగ్ బూత్ లకు వెళ్లకుండా దారిలోనే అడ్డుకున్నారు. పులివెందుల ఎన్నికలు ఆరు పంచాయతీల పరిధిలో జరిగాయి. ఈ ఆరు పంచాయతీల్లో 700 మంది పోలీసులను పెట్టారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన టీడీపీ నేతలు,కార్యకర్తలు ఈ గ్రామాల్లో పాగా వేశారు. పోలీసులే వారిని ప్రోత్సహించారని జగన్ ఆరోపించారు.

# భారీ వర్షాల నేపథ్యంలో బయటకు రావద్దు

## నగర ప్రజలకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ హెచ్చరిక

హైదరాబాద్,ఆగస్ట్13 : భారీ వర్షాలు కురుస్తాయంటూ వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో అవసరమైతే తప్ప.. బయటకు రావద్దని హైదరాబాద్ నగర ప్రజలకు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సూచించారు. బుధవారం సాయంత్రం నుంచి శుక్రవారం ఉదయం వరకు భారీ వర్షాలు కురవనున్నాయంటూ వాతావరణ శాఖ తెలిపిందని.. దీంతో అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు ఆయన సూచించారు. బుధవారం హైదరాబాద్‌లో రంగనాథ్ మాట్లాడుతూ.. ఎంతటి విపత్తు ఎదురైనా.. వాటిని ఎదుర్కొనేందుకు తామంతా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. జీహెచ్ఎంసీ, ట్రాఫిక్, జలమండలి, విద్యుత్ అధికారుల సమన్వయంతో పని చేస్తున్నామని ఆయన వివరించారు. అలాగే లోతట్టు- ప్రాంతాల్లో భారీగా వరద నీరు వస్తే.. ప్రజలను రక్షించేందుకు బోట్స్‌తో సహా అన్నింటిని సిద్ధం చేశామని చెప్పారు. అయితే రాత్రి సమయంలో వర్షపాతం అధికంగా నమోదయ్యే అవకాశాలు ఉండడంతో.. రాత్రి నుంచి హైడ్రా బృందాలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. నాలాల కబ్జాల కారణంగానే రహదారులపైకి భారీగా వరద నీరు వస్తుందని ఆయన తెలిపారు. ఇక ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో దాదాపు 400కి పైగా వాటర్ లాగింగ్ పాయింట్స్ ఉన్నాయన్నారు. అలాగే మేజర్ వాటర్ లాగింగ్ పాయింట్స్ వద్ద ఇప్పటికే సిబ్బంది ఉన్నారన్నారు. ఒక వేళ భారీ వర్షాలు కురిస్తే.. సహాయక చర్యల్లో పాల్గొనాలని యువతకి హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సూచించారు.

# వరుడిని భుజాలపై వాగు దటించిన బంధువులు

కరీంనగర్,ఆగస్ట్13 : వరద ఉధృతి కారణంగా పెళ్లికొడుకును భుజాలపై మోసుకెళ్లి వాగు దాటించారు. ఈ ఘటన కరీంనగర్ జిల్లా గన్నేరువరంలో జరిగింది. పెళ్లికి వెళ్లాల్సిన వరుడు ఇవతలే చిక్కు పడడంతో ఈ రకంగా వాగు దాటించారు. ఊర చెరువు మత్తడి ప్రవాహం ఎక్కువై రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో బంధువులు వరుడిని మోసుకెళ్లి అవతలి ఒడ్డుకు చేర్చారు. లో లెవల్ కల్వర్టు సమస్యతో ఏటా వర్షాకాలంలో ప్రజలు ఇలాంటి ఇబ్బందులే ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# మేకకు ఆకుల కోసం వెళ్ల నాలాలో పడ్డ వ్యక్తి

## నిచ్చెన వేసి కాపాడిన స్థానికులు

హైదరాబాద్,ఆగస్ట్13 : మేకకు ఆహారం కోసం ఆకులు కోయడానికి వెళ్లిన ఓ వ్యక్తి.. పట్టుతప్పి నాలాలో పడిపోయాడు. హైదరాబాద్‌లోని పాతబస్తీ పరిధి యాకుత్‌పురాలో ఈ ఘటన బుధవారం చోటుచేసుకుంది. గౌస్ అనే వ్యక్తి తన మేక కోసం ఆకులు కోస్తూ.. ఉధృతంగా ప్రవహిస్తున్న నాలాలో ప్రమాదవశాత్తూ పడిపోయాడు. స్థానిక ఎంఐఎం కార్పొరేటర్ మహమ్మద్ వాసే.. స్థానికుల సాయంతో అతడిని కాపాడారు. నిచ్చెన వేసి తాడు సాయంతో బయటకు లాగారు. అతడు క్షేమంగా బయటపడటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. హైదరాబాద్ పరిధిలో భారీ వర్షాల కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేసిన విషయం తెలిసిందే.

# ఉచిత బస్సులతో మా బతుకులు రోడ్డున పడతాయి

## ఆటో డ్రైవర్లు ఆందోళన

కర్నూలు,ఆగస్ట్13 : ప్రభుత్వ ఉచిత బస్సు నిర్ణయంతో ఆటోలపై ఆధారపడి జీవిస్తున్న తమ బతుకులు రోడ్డున పడతాయని ఆటో డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆర్టిసి బస్సులో మహిళలకు ఉచిత ప్రాణాన్ని ఆటో సంఘాల తరఫున స్వాగతిస్తున్నాం. ఆటో నడిస్తే తప్ప కుటుంబ పోషణ లేదు ప్రభుత్వ విధానం వల్ల ఉపాధి కోల్పోయి తమ కుటుంబాలు వీధిన పడతాయి ప్రభుత్వం తమను గుర్తించి అన్ని విధాల ఆదుకోవాలన్నారు. ప్రస్తుతం ఆటోలు ఎక్కేవారు తక్కువ అయ్యారు ప్రభుత్వ నిర్ణయంతో ఆటో డ్రైవర్లు తీవ్రంగా నష్టపోతారు. అప్పు చేసి మరి ఫైనాన్స్ తో ఆటోలను కొనుగోలు చేశామన్నారు. ఉచితం ప్రకటించడం వల్ల మా కుటుంబాలు వీధిన పడే అవకాశం ఉంది జీవనోపాధి కోల్పోయే ప్రమాదం ఉంది. ప్రభుత్వం వెంటనే మమ్మల్ని ఆదుకోవాలని కోరుతున్నాము లైసెన్స్ ఉన్న ప్రతి డ్రైవర్ కు వాహన మిత్ర కింద 15 వేల రూపాయలు భృతి చెల్లించాలి. ఆటో డ్రైవర్ల పిల్లల చదువులకు ఉచిత విద్యా విధానం అమలు చేయాలి. రవాణా రంగా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు.

# పులివెందుల, ఒంటిమిట్టలో వైకాపా అరాచకాలు

## జగన్, వైకాపా నేతలపై చర్యలు తీసుకోండి

## ఎన్నికల సంఘానికి టిడిపి నేతల ఫిర్యాదు

విజయవాడ,ఆగస్ట్13 : పులివెందుల, ఒంటిమిట్టలో అరాచకాలకు పాల్పడిన వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి, వైసీపీ నేతలపై చర్యలు తీసుకోవాలని టిడిపి నేతలు ఇసికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని తెలుగుదేశం నేతలు బుధవారం కలిశారు. ఏపీ ఎన్నికల కమిషనర్‌ను మండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, విద్య మౌలిక వసతుల కమిటీ- ఛైర్మన్ రాజశేఖర్ కలిసి ఈ మేరకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మీడియాతో టీడీపీ నేతలు మాట్లాడారు. అరాచకానికి, రాజ్యాంగ వ్యతిరేక పరిపాలనకు జగన్ మోహన్ రెడ్డి మారుపేరని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య ఆరోపణలు చేశారు. ఐదేళ్లలో రాష్ట్రాన్ని జగన్ అధోగతిపాలు చేశారని మండిపడ్డారు. పులివెందుల, ఒంటిమిట్ట ప్రాంతాల్లో జెడ్పీటీ-సీ ఉప ఎన్నికలు జరగడాన్ని ప్రజలు సంతోషిస్తున్నారని చెప్పుకొచ్చారు. చంద్రబాబు పాలనపై ఎలక్షన్ కమిషన్ సంతోషాన్నివ్యక్తం చేసిందని తెలిపారు. పులివెందుల, ఒంటిమిట్ట ఎలక్షన్ పూర్తి అయ్యాక వైసీపీ అభ్యర్థులు, నేతలు మాట్లాడిన మాటలపై జగన్ ఏం చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. ఒక పోలీసు అధికారిని బాడీ షేమింగ్ చేస్తారా అని నిలదీశారు. వైసీపీ నేతల రిగ్గింగ్, దుర్మార్గం, బూత్ క్యాప్చరింగ్ లేకుండా పులివెందుల, ఒంటిమిట్ట ఉప ఎన్నికలు జరిగాయని వర్ల రామయ్య పేర్కొన్నారు. తల్లికి వందనం ద్వారా లబ్ధిదారులకు కూటమి ప్రభుత్వం లబ్ధి చేకూరిస్తే దానిని రాక్షస పాలన అని జగన్ ఎలా అంటారని ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజధాని అమరావతి నిర్మించడం, సంపద సృష్టించడం జరుగుతుంటే దానిని రాక్షస పాలన అంటారా అని ఫైర్ అయ్యారు. 71శాతం పూర్తయిన పోలవరాన్ని జగన్ ధ్వంసం చేస్తే, ఆ పనులను కూటమి ప్రభుత్వం గాడిన పెట్టడాన్ని ఏమంటారని నిలదీశారు. క్రిమినల్స్‌కి సీట్లు- ఇచ్చిన జగన్‌కు చంద్రబాబు గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని విమర్శించారు. టీ-డీపీ నేతల ఫొటోలు మార్ఫింగ్ చేసి కామెంట్లు- చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. త్వరలో మార్ఫింగ్‌ల నిగ్గు తేలుస్తామని ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ వార్నింగ్ ఇచ్చారు. ఏపీలో గత ఐదేళ్ల జగన్ పాలనలో రెండు వేలకు పైగా ఎంపీటీసీలను ఏకగ్రీవం చేసుకున్నారని మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఆరోపణలు చేశారు. జెడ్పీటీసీ ఎన్నికల్లో వందకుపైగా జెడ్పీటీ-సీలు ఏకగ్రీవం చేసుకున్నారని విమర్శించారు. అధికారులను నిందిస్తారా.. డీఐజీ కోయ ప్రవీణ్ ఎలక్షన్లు జరిపిస్తే ఆయన గురించి అభ్యంతరకరంగా మాట్లాడుతారా అని మండిపడ్డారు. పులివెందుల, ఒంటిమిట్టలలో ఉప ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని చెప్పుకొచ్చారు. శాసన సభకు జగన్ వచ్చి ప్రశ్నిస్తే.. 164 మంది కూటమి ఎమ్మెల్యేలు సమాధానం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. తమకు న్యాయ వ్యవస్థల మీద గౌరవం ఉండటంతోనే కోర్టులకు వెళు తున్నామని ఉద్ఘాటించారు. పోలీసు అధికారులను అపహాస్యం చేసిన దానిపై చర్యలు తీసుకోవాలని ఎలక్షన్ కమిషన్‌ని కోరామని దేవినేని ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. దెయ్యాలు వేదాలు వల్లించినట్లు-గా జగన్ మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ విమర్శించారు. వైసీపీ గుర్తింపుని ఎన్నికల సంఘం శాశ్వతంగా రద్దు చేయాలని కోరారు. ఎన్నికల్లో పోటీ- చేయకుండా జగన్, ఆయన పార్టీని బహిష్కరించాలని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ సూచించారు.

# ప్రజలకు భయం పోయి..జగన్‌కు పట్టుకుంది

## పులివెందులలో ప్రజాస్వామ్యం నిలిచింది

## దొంగ ఓట్ల జమానా జగన్ హయాంలోనే ప్రారంభం

## అందుకు అనంత జిల్లాలయే నిదర్శనం

## మీడియా సమావేశంలో పయ్యావుల కేశవ్

అమరావతి,ఆగస్ట్13 : పులివెందుల ప్రజలకు భయం పోయింది.. జగన్‌కు భయం పట్టుకుందని మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. బుధవారం సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉద్రిక్తతలు సహజమన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు బాగున్నాయని చెప్పారు. జగన్ హయాంలో పోలీసులపై అనేక ఒత్తిళ్లు పెట్టారని, తమ ప్రభుత్వంలో ఆ శాఖ స్వచ్ఛందంగా పనిచేస్తోందని పేర్కొన్నారు. గతంలో వైకాపా ఎంపీ అవినాష్‌రెడ్డిని సీబీఐ కూడా టచ్ చేయలేకపోయింది. అరెస్టు చేయడం సాధ్యం కాదని గతంలో నివేదికలు పంపారు. కానీ మా ప్రభుత్వంలో కానిస్టేబుల్ వెళ్లి అవినాష్‌రెడ్డిని అడ్డుకున్నారు. వైకాపా నేతలు ప్రజాస్వామ్యంపై మాట్లాడుతుంటే హాస్యాస్పదంగా ఉంది. ప్రజలు, క్యాడర్‌ను రెచ్చగొట్టేందుకు జగన్ అనేక ప్రయత్నాలు చేశారు. పులివెందుల ప్రజలు ధైర్యంగా వచ్చి ఓటేశారు. రేపు వచ్చే ఫలితాలను స్వీకరించేందుకు జగన్ సిద్ధంగా ఉండాలి. అసెంబ్లీ ఫలితాలనే జగన్ ఇంకా స్వీకరించడం లేదు. ఓటమికి కారణాలు వెతుక్కోవడం వైకాపా నేతలకే చెల్లింది. పోలీసులు సరిగా పనిచేయడాన్ని ఆ పార్టీ భరించలేకపోతోంది. ఓట్ల చోరీకి మూలం వైకాపానే కదా. ఉరవకొండ, తిరుపతి, విశాఖ, పర్చూరును మర్చిపోయారా?మేం ప్రజలను నమ్ముకున్నాం.. మీరు దొంగ ఓట్లను నమ్ముకున్నారని మంత్రి పయ్యావుల వ్యాఖ్యానించారు. దొంగఓట్ల గురించి రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ , మాణిక్యం ఠాగూర్ ఎందుకు మాట్లాడటం లేదని మంత్రి పయ్యావుల కేశవ్ ప్రశ్నించారు. వైసీపీ దొంగఓట్ల వ్యవహారాన్ని ఉరవకొండ నుంచి మొదలుపెట్టిందని గుర్తు చేశారు. తాము ప్రజల్ని నమ్ముకున్నామని, దొంగఓట్లను నమ్ముకోలేదని స్పష్టం చేశారు.ఈ దొంగఓట్ల విషయంలో వైసీపీ వారే.. హాట్ లైన్ ద్వారా రాహుల్ గాంధీకి చెప్పి నేర్పించినట్టు ఉందని పయ్యావుల కేశవ్ ఆరోపించారు. కేంద్రంలోని ఎన్డీఏలో బలమైన, నమ్మకమైన భాగస్వామ్యంతో ఉన్నామని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఒకప్పుడు తమ పార్టీ మెంబరే అని తెలిపారు. మీకు కేసీఆర్ మధ్య సంబంధ బాంధవ్యాలు ఏమైపోయాయని, గిఫ్టులు రిటర్న్ గిఫ్టులు ఏమైపోయాయని విమర్శించారు. వైసీపీ నేతలు ప్రజాస్వామ్యంపై మాట్లాడుతుంటే హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రజలు, క్యాడర్‌ను రెచ్చగొట్టేందుకు జగన్ అనేక ప్రయత్నాలు చేశారని ఆరోపించారు. పులివెందుల ప్రజలు ధైర్యంగా వచ్చి ఓటేశారని పేర్కొన్నారు. రేపు వచ్చే పులివెందుల ఫలితాలను స్వీకరించేందుకు జగన్ సిద్ధంగా ఉండాలని సూచించారు. సీఎం చంద్రబాబు ఇప్పుడు జాతీయ స్థాయిలో గొప్పలీడర్ అని మంత్రి పయ్యావుల పేర్కొన్నారు. మరో పదేళ్లపాటు- చంద్రబాబే ముఖ్యమంత్రిగా ఉంటారని ధీమా వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళ్తుందని తెలిపారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు బాగున్నాయని చెప్పారు. జగన్ హయాంలో పోలీసులపై అనేక ఒత్తిళ్లు పెట్టారని, తమ ప్రభుత్వంలో ఆ శాఖ స్వచ్ఛందంగా పనిచేస్తోందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వాన్ని విమర్శచడం పక్కన పెట్టి వైసీపీ నేతలు వచ్చే ఎన్నికల బరిలో నిలిచేందుకు అర్హులుగా ఉంటారో లేదో చూసుకోవాలని పయ్యావుల హితవుపలికారు.

# తాళ్ల సాయంతో గర్భిణిని వాగు దాటించిన పోలీసులు

మంచిర్యాల,ఆగస్ట్13 : జిల్లాలో భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. తాండూరు మండలంలోని నర్సాపూర్ వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో మారుమూల గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. దొడ్డిగూడెంలో తొమ్మిది నెలల గర్భిణి యమునకు పురిటి నొప్పులు వచ్చాయి. ఆమెను వాగు దాటించేందుకు కుటుంబసభ్యులు ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న ఎస్సై కిరణ్ కుమార్.. పోలీసు సిబ్బంది, ఈతగాళ్లను ఘటనాస్థలికి పంపారు. వారు తాళ్ల సాయంతో గర్భిణిని వాగు దాటించి అంబులెన్సులో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ ఆమె మగబిడ్డకు జన్మనిచ్చినట్టు- వైద్యులు తెలిపారు.

# ఎపిలో ఓట్ చోరీ గురించి రాహుల్ మాట్లాడరేం

## రేవంత్ ద్వారా చంద్రబాబుతో టచ్‌లో ఉన్న రాహుల్

## చంద్రబాబుకు కాంగ్రెస్‌తో అంతర్గత ఒప్పందం

## వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి

అమరావతి,ఆగస్ట్13 : ఓట్ చోరీ వ్యవహారంలో కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీకి వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సూటి ప్రశ్నను సంధించారు. దేశంలో అత్యధికంగా ఓట్ల గోల్‌మాల్ జరిగింది ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లోనేనని.. అలాంటిది రాహుల్ గాంధీ ఏపీ గురించి ఎక్కడా ఎందుకు ప్రస్తావించడం లేదని ప్రశ్నించారు.బుధవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్రకార్యాలయంలో పులివెందుల, ఒంటిమిట్ట అక్రమ ఎన్నికలపై వైఎస్ జగన్ మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంలో ఓట్ల దొంగతనం వ్యవహారంపై ఇండియా కూటమికు మద్దతు గురించి జగన్‌కు మీడియా నుంచి ప్రశ్న ఎదురైంది. దానికి ఆయన స్పందిస్తూ.. గతేడాది ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరగకముందు.. జరిగిన తర్వాత ఉన్న ప్రకటించిన ఓట్లకు.. లెక్కించిన ఓట్ల సంఖ్యకు సమారు 12.5శాతం వ్యత్యాసం ఉంది. ఆ మొత్తం 48లక్షల ఓట్లు-. అంటే దేశంలో ఏ రాష్ట్రంలో జరగని విధంగా ఏపీలో అత్యధికంగా ఓట్ల చోరీ జరిగింది. మరి ఓట్ల చోరీ గురించి అవకతవకలు జరిగాయని అంటున్న రాహుల్ గాంధీ.. దీని గురించి ఎందుకు మాట్లాడడం లేదన్నారు. ఎందుకంటే.. రేవంత్ ద్వారా చంద్రబాబు కాంగ్రెస్ అధిష్టానంతో టచ్‌లో ఉన్నారు. చంద్రబాబుతో రాహుల్ గాంధీ హాట్‌లైన్‌లో టచ్‌లో ఉన్నారు. అందుకే చంద్రబాబు గురించి ఏపీ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణికం ఠాకూర్ ఒక్క కామెంట్ కూడా ఎందుకు చేయరు?. ఏపీలో ఎన్నో స్కాంలు జరుగుతున్నాయి. వాటిని కాంగ్రెస్ ఎందుకు ప్రశ్నించదని వైఎస్ జగన్ అన్నారు. ఓట్ల గోల్‌మాల్‌పై మేం గతంలో కోర్టుకు వెళ్లాం. ప్రత్యేకించి ఒంగోలు ఓటింగ్ విషయంలో న్యాయ పోరాటం చేశాం అనే సంగతిని జగన్ గుర్తుచేశారు. అలాగే.. ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ న్యూఢిల్లీ అసెంబ్లీ నియోజకవర్గంలో 2013 నుంచి వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారని, నాలుగోసారి అదే స్థానం నుంచి పోటీ- చేసి ఓడిపోయారని, ఓటమి పాలైన అరవింద్ కేజ్రీవాల్ గురించి ఎందుకు మాట్లాడడం లేదు? అని రాహుల్ గాంధీని వైఎస్ జగన్ ప్రశ్నించారు.

# భారీ వర్షాలతో కలెక్టర్ అప్రమత్తం

## విజయవాడలో పలు ప్రాంతాల్లో పర్యటన

విజయవాడ,ఆగస్ట్13 : ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తుండటంతో పాటు- పై నుంచి కృష్ణానదికి భారీగా వరద నీరు చేరుతున్న నేపథ్యంలో బుధవారం ఉదయం జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, మున్సిపల్ కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్ర తో కలసి నగరంలో సుడిగాలి పర్యటన చేశారు. ఉదయం 6 గంటల నుండి పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్, నిర్మలా కాన్వెంట్ రోడ్, గుణదల సెయింట్ జోన్స్ స్కూల్ ఈఎస్ఐ రోడ్, దేవీనగర్, మధ్యకట్ట తదితర ప్రాంతాలలో పర్యటిస్తూ అధికారులకు సూచనలు ఆదేశాలు జారీచేశారు. ఈ సందర్భంగా ఇరిగేషన్, రెవెన్యూ, పంచాయతీరాజ్, మునిసిపల్ అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రానున్న రెండు మూడు రోజుల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్థాయని వాతావరణ శాఖ సూచించిన నేపథ్యంలో క్షేత్రస్థాయిలో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పులిచింతల, మున్నేరు, క్యాచ్‌మెంట్ ప్రాంతాల ద్వారా కృష్ణాకు వరదనీరు పోటెత్తే అవకాశం ఉందని... రానున్న రోజుల్లో క్రమంగా 5 లక్షల క్యూసెక్కులకు పెరిగే అవకాశం ఉందన్నారు. గ్రామ, వార్డు సచివాలయం యూనిట్‌గా 24 గంటలు ప్రత్యేక వరద పర్యవేక్షణ బృందాల ఏర్పాటు- చేస్తున్నామన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో వరద హెచ్చరికల బోర్డులను తప్పనిసరిగా ఏర్పాటు- చేయాలన్నారు. వరద సంబంధించి ఎప్పటికప్పుడు పరిస్థితిని పరీవాహక గ్రామాల ప్రజలకు మైక్, టామ్ టామ్ ద్వారా తెలియజేయాలన్నారు. 91549 70454 నంబరుతో కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు- చేయడం జరిగిందని బుడమేరుకు వరదలంటూ వచ్చే వదంతులను నమ్మవద్దని ప్రచార మాధ్యమాల ద్వారా ప్రచారం చేయాలన్నారు. స్థానికంగా కురిసిన వర్షాల వల్ల అక్కడక్కడా నీళ్లు ఉన్నాయే తప్ప ప్రస్తుతం వరద ముప్పు లేదన్నారు బుడమేరు రెగ్యులేటర్ వద్ద నిరంతర పర్యవేక్షణకు బృందాల ఏర్పాటు- చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఇబ్రహీంపట్నం మండలం చినలంక, పెదలంక ప్రాంతాల్లోనూ అప్రమత్తంగా ఉండాలన్నారు మున్నేరుతో పాటు- పులివాగు వంటి వివిధ వాగుల్లో ప్రవాహాలపై అధికారులు నిరంతర పర్యవేక్షణతో పాటు- ముందు జాగ్రత్తగా లోతట్టు- ప్రాంతాలను పునరావాస శిబిరాలతో మ్యాపింగ్ చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. కొండ ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండేలా అప్రమత్తం చేయాలని కార్పొరేషన్ అధికారులకు కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. జిల్లా కలెక్టర్ పర్యటనలో నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ ఎం, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు, చీఫ్ సిటీ- ఎ÷-లానర్ కె.సంజయ్ రత్నకుమార్, జోనల్ కమిషనర్ కె.ప్రభుదాస్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబు శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గుంటూరు జిల్లాలో భారీ వర్షాలు


## రైళ్లకు అధికారుల హెచ్చరికలు

గుంటూరు,ఆగస్ట్13 : రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలకు వరద నీరు రైలు పట్టాల పైకి వచ్చి చేరుతోంది. భారీ వర్షాలకు పిడుగురాళ్ల-బెల్లంకొండ మధ్య వంతెన నంబర్-59 వద్ద చేరిన నీరు ప్రమాద హెచ్చరిక మార్క్‌కు చేరుకుంది. గుంటూరు- తెనాలి మధ్య వంతెన నంబర్-14 వద్ద, వెజెండ్ల-మణిపురం మధ్య వంతెన నంబర్-14 వద్ద కూడా అదే పరిస్థితి నెలకొంది. దీంతో రైల్వే ప్రయాణికుల భద్రతను దృష్టిలో పెట్టుకొని 30 కి.మీ. వేగంతో మాత్రమే వెళ్లాలని రైల్వేశాఖ తన సిబ్బందికి అత్యవసర హెచ్చరికలు జారీ చేసింది. సిబ్బంది కూడా పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నారని, నీరు తగ్గిన తర్వాత మళ్లీ సాధారణ వేగం ప్రారంభమవుతుందని రైల్వే అధికారులు తెలిపారు.



# జల్సా మరోమారు సెప్టెంబర్ 2న విడుదల

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా సెప్టెంబర్ 2న ఆయన అభిమానుల కోసం 'జల్సా' సినిమాను మళ్లీ రీ రిలీజ్ చేయబోతున్నారు మేకర్స్. ఈ విషయాన్ని గీతా ఆర్ట్స్ సంస్థ సోషల్ మీడియా వేదికగా అధికారికంగా ప్రకటించింది. గతంలో 2022లో కూడా పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా 'జల్సా' సినిమాను 4కె వెర్షన్‌లో రీ-రిలీజ్ చేశారు. అయితే అప్పుడే ఈ చిత్రం రూ.3 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టి రీ-రిలీజ్ సినిమాల్లో కొత్త రికార్డులను సృష్టించింది. అయితే ఈ సినిమాను మళ్లీ చూడటానికి అభిమానులు ఆసక్తి చూపుతుండడంతో సెప్టెంబర్ 2న రీ రిలీజ్ చేయబోతున్నారు మేకర్స్.




## కూలీ, వార్-2 లకు పోటీగా ధూమకేతు

### బెంబేలెత్తిస్తున్న బెంగాల్ మూవీ

ఆగస్టు 14న గురువారం కూలీ, వార్2 మూవీలు పెద్ద ఎత్తున రిలీజ్ కాబోతున్నాయి. వీటిపై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. మకూలీలో సీనియర్ యాక్టర్లు వార్2లో యంగ్ అండ్ డైనమిక్ హీరోలు మీ సినిమానా మా సినిమానా అన్నట్లుగా పోటీ- పడుతున్నారు. ఎవ్వరూ ఎక్కడా తగ్గట్లేదు. ఆడియన్స్‌ని థియేటర్లకు రప్పించేందుకు చేస్తున్న ప్రమోషన్స్ పీక్స్‌కి చేరాయి. ఈ దశలో మరో మూవీ రిలీజ్ అయ్యేందుకు సాహసం చేస్తుందా. కానీ మేం చేస్తాం అంటోంది ఓ బెంగాలీ ఫిల్మ్. వార్2, కూలీ చిత్రాలతో పోటీ పడుతూ 'ధూమకేతు' అనే బెంగాలీ ఫిల్మ్ పశ్చిమ బెంగాల్లో ఆగస్టు 14నే రిలీజ్ అవుతోంది. వార్2, కూలీకి ఈ సినిమాకు ఏంటీ- పొంతన అని తక్కువగా తీసిపారేయొద్దు. ఉత్తరాదిలో వార్2. సౌత్‌లో కూలీ సినిమాలకు ఫుల్ అటెన్షన్ క్రియేట్ అవుతుంది. కానీ బెంగాల్‌లో మాత్రం ధూమకేతుకు విపరీతమైన క్రేజ్ ఏర్పడింది. ఎంతలా అంటే ప్రీ బుకింగ్స్ సేల్స్‌లో ఈ లోకల్ సినిమాను వార్2 కూడా బీట్ చేయలేనంతలా. ధూమకేతు ఇప్పటి వరకు 21 వేల టికెట్లు- అమ్ముడవగా, వార్2కి




కేవలం 6 వేల టికెట్లు- మాత్రమే తెగాయన్నది మార్కెట్ వర్గాల టాక్. ఇక కూలీని పెద్దగా పట్టించుకోవడం లేదు బెంగాల్ ఆడియన్స్. ఈరేంజ్ బిజినెస్ ఇప్పటి వరకు ఏ బెంగాలీ సినిమాకి జరగలేదని అంటున్నాయి అక్కడి మార్కెట్ వర్గాలు. అంతేకాదు బెంగాల్ వ్యాప్తంగా తొలి రోజే 400 ప్లస్ షోలు పడనున్నాయట. రన్నింగ్‌లో ఈ సంఖ్య మరింత పెరిగే ఛాన్స్ ఉందట. ఇంతలా హైప్ క్రియేట్




చేస్తున్న ధూమకేతు .. ఈ మధ్యలో తెరకెక్కిన ఫిల్మ్ కూడా కాదు.. ఎప్పుడో పదేళ్ల క్రితం మొదలు పెట్టి.. 8 ఏళ్ల క్రితం పూర్తైన సినిమా. పలుమార్లు రిలీజ్ వాయిదా పడుతూ ఎట్టకేలకు ఇప్పటికీ మోక్షం దక్కించుకుంది. బెంగాల్ సూపర్ స్టార్ దేవ్, శుభశ్రీ గంగూలీ సిక్త్ -టైమ్ జోడీ కడుతుండటంతో బెంగాల్ వ్యాప్తంగా విపరీతమైన హైప్ క్రియేట్ అయింది. ఈ ఇద్దరు గతంలో జూనియర్ ఎన్టీఆర్, సమంత, కాజల్ నటించిన బృందావనం బెంగాల్ రీమేక్ వర్షన్ ఖోకా420 వర్షన్‌లో కలిసి నటించారు. ఈ సినిమా బెంగాల్‌లో బ్లాక్ బస్టర్ సక్సెస్ అందుకుంది. దీంతో ఈ జంటకు హిట్ పెయిర్‌గా క్రేజ్ వచ్చింది. ఈ హిట్‌పెయిర్ ఇప్పుడు ధూమకేతుతో మరోసారి జంటగా రాబోతున్నారు. ఆగస్టు14న రిలీజ్ అవుతోన్న ధూమకేతు ఒకవేళ పాజిటివ్ టాక్ తెచ్చుకుంటే బెంగాల్‌లో వార్2 కలెక్షన్లకు గండిపడినట్లే అవుతుంది.

## నేడు థియేటర్లలోకి కూలీ రాక


### తలైవా వల్లనే దీనికి క్రేజ్ వచ్చిందన్న లోకేశ్


ఎప్పుడూ తన సినిమా సంగతులను పంచుకునే లోకేశ్ కనగరాజ్ వాటి విడుదలకు ముందు కచ్చితంగా పోస్ట్ పెడుతుంటారు. దీంతో 'కూలీ' విడుదలకు ముందు ఆయన పెట్టే పోస్ట్‌పై కొన్ని రోజులుగా అందరిలో ఆసక్తి నెలకొంది. ఆయన దర్శకత్వంలో రజనీకాంత్ కీలక పాత్రలో నటించిన చిత్రం 'కూలీ'. నాగార్జున, ఆమిర్‌ఖాన్, సత్యరాజ్, శ్రుతిహాసన్, సౌబిన్ షాహిర్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఆగస్టు 14న ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ఆయన ఈ సినిమాను ఉద్దేశిస్తూ రజనీకాంత్‌కు థాంక్స్ చెబుతూ పోస్ట్ పెట్టారు. ఆయన వల్లే ఈ సినిమాపై ప్రేక్షకులు ఇంత ప్రేమ చూపుతున్నారని పేర్కొన్నారు. చిత్రీకరణకు సంబంధించిన ఫొటోలను పంచుకున్నారు. నా సినీ ప్రయాణంలో 'కూలీ'కి ఎప్పుడూ ప్రత్యేక స్థానం ఉంటుంది. ఈ సినిమా ఇంత బాగా రావడానికి, దీనిపై ఇంత మంది ప్రేమ చూపించడానికి కారణం తలైవానే. నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు ఆయనకు ఎప్పటికీ కృతజ్ఞతతో ఉంటా. 'కూలీ' చిత్రీకరణలో ఎన్నో మధురక్షణాలు ఉన్నాయి. వాటిని ఎప్పటికీ నా మనసులో దాచుకుంటాను' అని తెలిపారు. రజనీకాంత్ ఇండస్ట్రీకి వచ్చి మరో రెండు రోజుల్లో 50ఏళ్లు పూర్తి కానున్న సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఎంతో మందిలో స్ఫూర్తినింపుతున్నందుకు కృతజ్ఞతలు చెప్పారు. అపూర్వ రాగంగల్'తో రజనీకాంత్ ఇండస్ట్రీలోకి అడుగు పెట్టారు. 1975 ఆగస్టు 15న ఈ సినిమా విడుదలైంది. మరో రెండు రోజుల్లో దీనికి 50 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా సోషల్ మీడియాలో శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. తలైవాకు కంగ్రాట్స్ చెబుతూ సినీ ప్రముఖులు పోస్ట్‌లు పెడుతున్నారు. నటుడిగా నేను మొదటి సినిమా మీతోనే చేశా. నా గురువులలో మీరూ ఒకరు. ఎంతో మందిలో స్ఫూర్తి నింపుతున్నందుకు ధన్యవాదాలు. మీరు మరిన్ని సినిమాలతో అలరించాలని కోరుకుంటున్నాను అని హృతిక్ రోషన్ అన్నారు. ఒక మనిషి.. ఒక కిరీటం.. 50 సంవత్సరాలు. ఈ గోల్డెన్ జూబ్లీని 'కూలీ'తో సెలబ్రేట్ చేసుకుందాం సంగీత దర్శకుడు అనిరుధ్ అన్నారు.



# నానితో శేఖర్ కమ్ముల మూవీ

టాలీవుడ్ స్టార్ డైరెక్టర్ శేఖర్ కమ్ముల వైవిధ్యమైన కథలతో ప్రేక్షకులకి మంచి వినోదం పంచుతున్న విషయం తెలిసిందే. ఆయన తెరకెక్కించిన ప్రతి చిత్రం కూడా బాక్సాఫీస్ దగ్గర మంచి వసూళ్లే రాబట్టింది. ఇటీ-వల కుబేర అనే చిత్రంతో పలకరించాడు. ఈ మూవీ కూడా మంచి విజయం సాధించింది. ఇక ఇప్పుడు నానితో ఓ ప్రాజెక్ట్ చేయనున్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి. నేచురల్ స్టార్ నాని తన కెరీర్‌ను వైవిధ్యంగా మలుస్తున్నాడు. ప్రేమకథలతో, కుటుంబ డ్రామాలతో ప్రేక్షకుల మనసు దోచిన నాని, ఇటీవల 'హిట్ 3'లాంటి డార్క్ యాక్షన్ థ్రిల్లర్‌తో వైవిధ్యాన్ని చూపించాడు. ప్రస్తుతం శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో 'ది ప్యారడైజ్' చిత్రం చేస్తున్నాడు. ఈ మూవీ తర్వాత శేఖర్ కమ్ముల దర్శకత్వంలో ఓ మూవీ చేయనున్నాడనే వార్త ఫిల్మ్ సర్కిల్స్‌లో చక్కర్లు కొడుతోంది. ఇటీవలే 'కుబేర' మూవీతో మళ్లీ ఫామ్‌లోకి వచ్చిన శేఖర్ కమ్ముల, నానితో కలిసి ఎలాంటి కథను సినిమాగా తీయబోతున్నారా అనే ఆసక్తి పెరుగుతోంది. వీరిద్దరి కాంబినేషన్‌లో ఇది తొలి సినిమా కావడం, ఇద్దరికీ భిన్నమైన ఫాలోయింగ్ ఉండటంతో ఈ ప్రాజెక్ట్‌పై అప్పుడే హైప్ క్రియేట్ అయింది. ఈ మూవీలో హీరోయిన్‌గా సాయిపల్లవి పేరు వినిపిస్తుంది. ఇది నిజమైతే, ఇది నాని - సాయిపల్లవి జోడీకి మూడో సినిమా అవుతుంది. గతంలో వీరిద్దరూ కలిసి నటించిన 'ఎంసీఏ' (2017), 'శ్యామ్ సింగరాయ్' (2021) మంచి విజయం సాధించాయి. ప్రేక్షకుల నుంచి హిట్ పెయిర్‌గా గుర్తింపు కూడా పొందారు. శేఖర్ కమ్ములకు సాయిపల్లవి ఫేవరెట్ హీరోయిన్. ఇద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'ఫిదా' ఆమెకు స్టార్‌డమ్ తీసుకొచ్చింది. ఆ తర్వాత 'లవ్‌స్టోరీ' కూడా మంచి స్పందన తెచ్చుకుంది. తెలంగాణ యాసలో సాయిపల్లవి చెప్పిన డైలాగులు ఇప్పటికీ ప్రేక్షకులను ఆకట్టు-కుంటు-న్నాయి. ఇప్పుడు అదే దర్శకుడు, అదే హీరోయిన్, కొత్తగా నానితో జత కట్టడం విశేషం. సాయిపల్లవి ఇటీవలే నాగచైతన్యతో నటించిన 'తండేల్' సినిమాతో బ్లాక్‌బస్టర్ అందుకుంది. ఇప్పుడు బాలీవుడ్‌లో రూపొందుతున్న భారీ మైథాలజికల్ మూవీ 'రామాయణ' లో సీత పాత్రలో నటిస్తోంది. ఈ చిత్రంలో రణ్‌బీర్ కపూర్ రాముడిగా, యష్ రావణుడిగా నటించగా, 2026 లేదా 2027 దీపావళికి రిలీజ్ చేయాలని మేకర్స్ లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే నాని - శేఖర్ కమ్ముల ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన ఎప్పుడు వస్తుందా అని ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.






## పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై ముంబై సంస్థ కేసు

టాలీవుడ్ బడా నిర్మాణ సంస్థపై కేసు నమోదయింది. తమను మోసం చేసారని పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై ముంబైకి చెందిన ఐవివై ఎంటర్‌టెన్‌మెంట్స్ కేసు పెట్టింది. వివరాలలోకెళితే పీపుల్స్ మీడియా సంస్థ నిర్మాణంలో రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా రాజాసాబ్ అనే సినిమాను నిర్మిస్తోంది. అత్యంత భారీ బడ్జెట్ పై చాలా కాలంగా ఈ సినిమాను నిర్మిస్తోంది పీపుల్స్ మీడియా. అయితే వందల కోట్ల బడ్జెట్ తో పీపుల్స్ మీడియా నిర్మిస్తున్న ఈ సినిమాకు ముంబై కు చెందిన ఈ సంస్థ ఆర్థిక భాగస్వామిగా వ్యవహరిస్తోంది. సినిమా షూటింగ్ కు అయ్యే ఖర్చు తదితర వాటికి ఆర్థిక వనరులు సమకూర్చేలా ఇరు సంస్థలు ఒప్పందాలు చేసుకున్నాయి. గ్రాండ్‌గా షూటింగ్ స్టార్ట్ చేసిన పీపుల్ మీడియా మేకర్స్ ఈ సినిమా షూటింగ్ ను అనుకున్న టైమ్ లో ఫినిష్ చేయలేక పోయారు. ఇప్పటికే రాజాసాబ్ అనేకసార్లు రిలీజ్ వాయిదా పడుతూ వచ్చింది. ఈ నేపథ్యంలో పీపుల్ మీడియా తమ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని, సినిమా షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయజేకుండా, తమకు ఎలాంటి సమాచారం అందించడం లేదని, మేము ఇచ్చిన డబ్బులు ఎలా ఉపయోగించారనే దానిపై వివరణ కూడా వివరన ఇవ్వలేదని చెబుతూ ఢిల్లీ కోర్టులో కేసు నమోదు చేసింది. అలాగే మేము ఇచ్చిన డబ్బులో ప్రస్తుతం రూ. 218 కోట్లు- తిరిగి ఇవ్వాలని ఈ సంస్థ డిమాండ్ చేస్తోంది. ఇదిలా ఉండగా ఈ సినిమా ఇంకా నాన్-థియేట్రికల్ డీల్‌ను క్లోజ్ కాలేదని, అనుకొని కారణాల వలన రిలీజ్ వాయిదా వేసామని కావాలని తమ పరువుకు భంగం కలిగిస్తున్నారని ఐవివై సంస్థపై కోర్టును ఆశ్రయించింది పీపుల్స్ మీడియా.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com

# స్పోర్ట్స్

# పాకిస్థాన్‌తో భారత్ మ్యాచ్ ఆడవద్దు

మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్

ఆసియా కప్ 2025 టోర్నీలో పాకిస్థాన్‌తో భారత్ మ్యాచ్ ఆడవద్దని మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్ అన్నాడు. సరిహద్దుల్లో సైన్యం పోరాడుతున్న సమయంలో పాకిస్థాన్‌తో క్రికెట్ మ్యాచ్ ఆడటం సమంజసం కాదన్నాడు. దేశం కంటే ఏదీ ముఖ్యం కాదని అభిప్రాయపడ్డాడు. ఇరుదేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఆసియాకప్ 2025 వేదికగా జరిగే భారత్-పాక్ మ్యాచ్‌పై నీలినీడలు కమ్ముకున్నాయి. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ఇరు దేశాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ టోర్నీలో పాకిస్థాన్‌తో మ్యాచ్‌లను యువరాజ్ సింగ్ సారథ్యంలో భారత లెజెండ్స్ బహిష్కరించింది. సెమీఫైనల్ చేరిన తర్వాత కూడా పాక్‌తో ఆడలేక టోర్నీ నుంచి వైదొలిగింది. దాంతో ఆసియాకప్ 2025పై అందరి దృష్టి నెలకొంది. సెప్టెంబర్ 9 నుంచి ఈ టోర్నీ ప్రారంభం కానుండగా.. భారత్, పాక్ జట్లు సెప్టెంబర్ 14న తలపడనున్నాయి. ఈ టోర్నీలో ఇరు జట్లు మొత్తం మూడుసార్లు తలపడే అవకాశం ఉంది. పాక్‌తో ఆడే విషయంపై బీసీసీఐ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. తాజాగా ఈ వ్యవహారంపై మాట్లాడిన హర్భజన్ సింగ్.. పాకిస్థాన్‌తో ఆడవద్దని బీసీసీఐకి సూచించాడు. ఒక్క మ్యాచ్ ఆడకపోతే పోయేదేం లేదన్నాడు.'ఏది



ముఖ్యమో.. ఏది కాదో తెలుసుకోవాల్సిన అవసరం బీసీసీఐకి ఉంది. నా వరకైతే.. సరిహద్దుల్లో పోరాడే సైనికులే ముఖ్యం. వారి త్యాగాల వల్ల దేశంలో మనమంతా హాయిగా ఉండగలుగుతున్నాం. సైనికుల త్యాగాలతో పోల్చితే పాక్‌తో మ్యాచ్ అనేది చాలా చిన్న విషయం. భారత ప్రభుత్వ వైఖరి కూడా అలానే ఉంది. బార్డర్‌లో సైన్యం పోరాడుతున్న వేళ పాక్‌తో క్రికెట్ ఆడటం సమంజసం కాదు. పెద్ద పెద్ద సమస్యలను పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉంది. వాటితో పోలిస్తే క్రికెట్ చాలా చిన్న విషయం. ఎప్పుడైనా సరే దేశానికి తొలి ప్రాధాన్యం ఇవ్వాలి. ఏ ఆటగాడు, యాక్టర్‌కు అయినా గుర్తింపు రావడానికి ఈ దేశం ప్రధాన కారణం. ఇతర వృత్తిలో ఉన్నా దేశం కంటే ఎవరూ గొప్ప కాదు. దేశానికి ఇచ్చే ప్రాధాన్యతతో పోల్చినప్పుడు.. ఒక్క క్రికెట్ మ్యాచ్ ఆడకపోతే ఏమీ కాదు. బోర్డర్‌లో మన సైనికులు నిరంతరం కాపు కాస్తూ.. శత్రు దేశంతో పోరాడుతున్నారు. వారు ఎప్పుడు ఇంటికి వస్తారా? అని వారి కుటుంబ సభ్యులు ఎదురు చూస్తున్న క్రమంలో మనం ఆ దేశంతో క్రికెట్ ఆడాలా?'అని హర్భజన్ సింగ్ ప్రశ్నించాడు.

## మూడు ఫార్మాట్లకు శుభ్‌మన్‌ను కెప్టెన్ చేయండి

### మాజీ సెలెక్టర్ దేవాంగ్ గాంధీ

భారత క్రికెట్ జట్టు కెప్టెన్సీ వ్యవహారంపై ఇప్పుడు దేశవ్యాప్తంగా పెద్ద చర్చ జరుగుతోంది. టీ20 ప్రపంచకప్ 2024 తర్వాత రోహిత్ శర్మ టీ20ల నుంచి తప్పుకోవడంతో, బీసీసీఐ స్ప్లిట్ కెప్టెన్సీ (వేర్వేరు కెప్టెన్లు) విధానాన్ని అధికారికంగా అమల్లోకి తెచ్చింది. ప్రస్తుతం టీ20లకు సూర్యకుమార్ యాదవ్, వన్డేలకు రోహిత్ శర్మ, టెస్టులకు యువ సంచలనం శుభ్‌మన్ గిల్‌లు సారథ్యం వహిస్తున్నారు. ఈ ముగ్గురు కెప్టెన్ల విధానంపై మాజీ సెలెక్టర్ దేవాంగ్ గాంధీ ఆసక్తికరమైన, సంచలన వ్యాఖ్యలు చేశారు. భారత క్రికెట్‌కు దీర్ఘకాలంలో స్ప్లిట్ కెప్టెన్సీ విధానం సరిపోదని దేవాంగ్ గాంధీ అభిప్రాయపడ్డారు.ఆల్-ఫార్మాట్ కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్‌ను ఎంపిక చేయాలని ఆయన బలంగా వాదిస్తున్నారు. "స్ప్లిట్ కెప్టెన్సీ ఇతర దేశాల్లో పనిచేయవచ్చు, కానీ ఇండియాలో మాత్రం సాధ్యం కాదు. ఎందుకంటే మన జట్టుకు ఆలోచనా విధానంలో స్థిరత్వం అవసరం. అన్ని ఫార్మాట్లలో అద్భుతంగా రాణిస్తున్న ఒక ఆటగాడు ఒక ఫార్మాట్‌కు కెప్టెన్‌గా ఉన్నప్పుడు, మిగిలిన ఫార్మాట్లకు కూడా అతనే నాయకత్వం వహించాలి" అని దేవాంగ్ గాంధీ అన్నారు.గిల్‌ను ఆల్-ఫార్మాట్ కెప్టెన్‌గా నియమించాలనే తన అభిప్రాయానికి దేవాంగ్ కొన్ని బలమైన కారణాలు చెప్పారు.2017లో విరాట్ కోహ్లీకి ఎలాంటి మద్దతు ఉండేదో, ఇప్పుడు గిల్‌కు కూడా అలాంటి సపోర్టు ఉందన్నారు.కోహ్లీ ఎలాగైతే ధోనీ సారథ్యంలో ఎదిగాడో, గిల్ కూడా కోహ్లీ, రోహిత్ శర్మ లాంటి దిగ్గజాల మధ్య కెప్టెన్సీకి మెరుగులు దిద్దుకున్నాడని వెల్లడించారు.గిల్ అన్ని విభాగాల్లోనూ రాణించాడని గాంధీ ప్రశంసించారు.టెస్ట్ కెప్టెన్‌గా గిల్‌ను నియమించడం ద్వారా చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ ముందుచూపుతో వ్యవహరించారని గాంధీ పేర్కొన్నారు. అయితే, 2026 టీ20 ప్రపంచకప్ తర్వాత సూర్యకుమార్ యాదవ్‌కు బదులుగా ఎవరు కెప్టెన్సీ తీసుకుంటారనే దానిపై బీసీసీఐ స్పష్టమైన సంకేతాలు ఇవ్వాలని గాంధీ సూచించారు.గిల్ అరంగేట్రం చేసినప్పటి నుంచి వన్డేల్లో అతని సగటు 59.04. ఇటీవల ఇంగ్లాండ్‌లో జరిగిన 5 టెస్టుల సిరీస్‌లో కెప్టెన్‌గా గొప్ప ఒత్తిడిని అధిగమించి సత్తా చాటాడు.అంతేకాకుండా, ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్ సారథిగా తన నాయకత్వ లక్షణాలను నిరూపించుకున్నాడు. 2000వ దశకం ప్రారంభం నుంచి భారత్ గెలిచిన ఐసీసీ ట్రోఫీలు అన్నీ కూడా ఆల్-ఫార్మాట్ కెప్టెన్ల హయాంలోనే వచ్చాయని గాంధీ గుర్తు చేశారు.గిల్ అన్ని ఫార్మాట్లలో సత్తా చాటాడు. ఈ కారణాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటే, శుభ్‌మన్ గిల్‌ను భారత్‌కు భవిష్యత్ ఆల్-ఫార్మాట్ కెప్టెన్‌గా తీర్చిదిద్దడమే సరైన నిర్ణయం అని దేవాంగ్ గాంధీ స్పష్టం చేశారు.



## పాకిస్థాన్‌ను చిత్తు చేసిన విండీస్

### 2-1తో మూడు వన్డేల సిరీస్ విండీస్ వశం

వెస్టిండీస్ క్రికెట్ జట్టు చరిత్ర సృష్టించింది. తాజాగా పాకిస్థాన్?తో జరిగిన మూడో వన్డేలో 202 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన విండీస్ జట్టు నిర్ణీత 50 ఓవర్లకు 294/6 పరుగులు చేసింది. అనంతరం ఛేదనలో పాకిస్థాన్ తేలిపోయింది. 29.2 ఓవర్లలో 92 పరుగులకే ఆలౌటైంది. ఈ విజయంతో విండీస్ 2-1తో మూడు వన్డేల సిరీస్?ను దక్కించుకుంది.సొంతగడ్డపై జరిగిన ఈ సిరీస్?లో విండీస్ సత్తా చాటింది. సిరీస్?లో జరిగిన తొలి మ్యాచ్?లో ఓడినప్పటికీ, తర్వాత రెండు వన్డేల్లో పుంజుకొని అద్భుత విజయాలు నమోదు చేసింది. దీంతో 34 ఏళ్ల తర్వాత తొలిసారి పాకిస్థాన్?పై వెస్టిండీస్ వన్డే సిరీస్ నెగ్గింది. దీంతో విండీస్ ఫ్యాన్స్? ఆనందంలో మునిగిపోయారు. కాగా, వెస్టిండీస్ చివరిసారిగా 1991లో జరిగిన వన్డే సిరీస్‌లో పాకిస్థాన్‌ను ఓడించింది.కాగా, ఈ మ్యాచ్?లో వెస్టిండీస్ కెప్టెన్ షాయ్ హోప్ సూపర్ సెంచరీతో అదరగొట్టాడు. 94 బంతుల్లో 10 ఫోర్లు, 5 సిక్సర్లతో 120 పరుగులు చేశాడు. ఎడాపెడా బౌండరీలతో స్కోర్ బోర్డును పరుగులు పెట్టించాడు. దీంతో వెస్టిండీస్ మంచి స్కోర్ 294-6 చేసింది. అనంతరం 295 పరుగుల ఛేదనలో దిగిన పాకిస్థాన్?ను విండీస్ బౌలర్లు ఆటాడేసుకున్నారు. ఏకంగా ఐదుగురు బౌలర్లు డకౌట్ అయ్యారు. ఇందులో కెప్టెన్ రిజ్వాన్ (0) సున్నాకే ఔట్ అవ్వగా, బాబర్ ఆజమ్ (9) స్వల్ప స్కోరుకే పెవిలియన్ చేరాడు. ఈ మ్యాచ్?లో పాక్ 92 పరుగులకే ఆలౌట్ అవ్వడంపై సోషల్ మీడియాలో ఆజట్టుపై ట్రోల్స్ వస్తున్నాయి. వెస్టిండీస్ జట్టులో హోప్ ఒక్కడే 120 రన్స్? చేయగా, పాక్ జట్టు మొత్తం కలిసి 92 పరుగులే చేసిందని పాక్?ను నెటిజన్లు ట్రోల్ చేస్తున్నారు. ఈ లెక్కన హోప్ ఒక్కడే పాక్?పై 28 రన్స్?తో నెగ్గాడంటూ కామెంట్లు చేస్తున్నారు.విండీస్ బౌలర్ జెయిడెన్ సీల్స్ ఈ మ్యాచ్?లో ఆదరగొట్టాడు. ఈ ఒక్కడే 6 వికెట్లు నేలకూల్చి పాక్ పతనాన్ని శాసించాడు. టాప్ 4 వికెట్లు సీల్స్?కే పడ్డాయి. ఓపెనర్లు సైమ్ ఆయూబ్ (0), అబ్దుల్లా (0) ఇద్దర్నీ సీల్స్ డకౌట్?గా పెవిలియన్ పంపాడు. ఆనంతరం రిజ్వాన్, బాబర్ ను కూడా ఔట్ చేసి విండీస్?కు బ్రేక్ ఇచ్చాడు. చివర్లో నసీమ్ షా, హసన్ అలీ వికెట్లు కూడా కూల్చాడు. ఇలా సీమ్స్ ఆరు వికెట్లతో సత్తా చాటగా, గుడాకెశ్ 2, రోస్టన్ చేజ్ 1 వికెట్ దక్కించున్నారు.పాక్? జట్టులోని ఇద్దరు అనుభవజ్ఞులైన బ్యాటర్లు బాబర్ ఆజామ్, మహ్మద్ రిజ్వాన్ ఫెయిల్ అయ్యారు. రిజ్వాన్ డకౌట్ కాగా, బాబర్ 23 బంతుల్లో 9 పరుగులకే పెవిలియన్ చేరాడు. దీంతో ఈ ఇద్దరిపై సోషల్ మీడియాలో ట్రోల్స్ ఎక్కువయ్యాయి. మూడో వన్డేలో మొదట బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ 50 ఓవర్లలో 6 వికెట్లకు 294 పరుగులు చేసింది. సిరీస్ నిర్ణయాత్మక మ్యాచ్‌లో వెస్టిండీస్ ఇంత పెద్ద స్కోరును చేరుకోవడంలో కెప్టెన్ షాయ్ హోప్ కీలక పాత్ర పోషించాడు. అతను బ్యాటింగ్‌తో తన జట్టును ముందుండి నడిపించాడు. షాయ్ హోప్ సెంచరీ చేశాడు. ఇది వన్డే క్రికెట్‌లో అతనికి 18వది, పాకిస్తాన్‌పై అతని రెండవ సెంచరీ. షాయ్ హోప్ కేవలం 94 బంతుల్లో 10 ఫోర్లు, 5 సిక్సర్లతో అజేయంగా 120 పరుగులు చేశాడు. కెప్టెన్ హోప్ విధ్వంసక బ్యాటింగ్ కారణంగా, మొదటి 42 ఓవర్లలో 6 వికెట్లకు 185 పరుగులు చేసిన వెస్టిండీస్ జట్టు చివరి 8 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా 109 పరుగులు జోడించింది. సిరీస్ నిర్ణయాత్మక మ్యాచ్‌లో పాకిస్థాన్‌కు 295 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించారు. నేటి క్రికెట్ యుగంలో ఈ లక్ష్యం అసాధ్యం కాదు. కానీ, వెస్టిండీస్‌పై దానిని ఛేదించడంలో పాకిస్తాన్ చాలా కష్టపడింది, మొత్తం జట్టు కలిసి 100 పరుగులు కూడా చేయలేకపోయింది, ఆ లక్ష్యాన్ని చేరుకోవడం గురించి చెప్పనక్కర్లేదు. మూడవ వన్డేలో, పాకిస్తాన్ జట్టు 92 పరుగులకే ఆలౌట్ అయింది. ఫలితంగా, వెస్టిండీస్ ఈ మ్యాచ్‌లో 202 పరుగుల తేడాతో గెలిచింది. ఇది పరుగుల పరంగా పాకిస్తాన్‌పై అతిపెద్ద ఓటమిగా నిలిచింది. ఈ సందర్భంలో, 2015లో క్రైస్ట్‌చర్చ్‌లో జరిగిన వన్డేలో 150 పరుగుల తేడాతో ఓడిపోయిన రికార్డును అది బద్దలు కొట్టింది.వన్డే క్రికెట్‌లో వెస్టిండీస్ 200ం పరుగులు సాధించి విజయం నమోదు చేయడం ఇది నాల్గవసారి. కెప్టెన్ షాయ్ హోప్ బ్యాటింగ్‌తో పాకిస్తాన్‌ను దెబ్బతీయడంలో కీలక పాత్ర పోషించగా, జేడెన్ సీల్స్ బంతితో విధ్వంసం సృష్టించాడు. అతను ఒంటి చేత్తో పాకిస్తాన్ జట్టులో సగం మందిని పెవిలియన్ చేరాడు. అతను 7.2 ఓవర్లలో 18 పరుగులకు 6 వికెట్లు పడగొట్టాడు. ఇది అతని కెరీర్‌లో అత్యుత్తమ ప్రదర్శనగా నిలిచింది.



## ఐసీసీ ర్యాంకింగ్స్‌లో భారత్ సత్తా

### టాప్ 2లోకి రోహిత్ శర్మ

టీమ్ఇండియా వన్డే కెప్టెన్ రోహిత్ శర్మ తాజా ఐసీసీ ర్యాంకింగ్స్?లో సత్తా చాటాడు. ఒక స్థానం మెరుగుపర్చుకొని రెండో ప్లేస్? దక్కించుకున్నాడు. ప్రస్తుతం హిట్?మ్యాన్ 756 రేటింగ్స్?తో రెండో స్థానంలో కొనసాగడం విశేషం. యంగ్ బ్యాటర్ శుభ్?మన్ గిల్ తన అగ్రస్థానం పదిలం చేసుకున్నాడు. 784 రేటింగ్ పాయింట్స్?తో గిల్ టాప్?లో ఉండగా, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ 736 రేటింగ్స్?తో నాలుగో ప్లేస్?లో ఉన్నాడు. ఇలా టాప్ 2 ర్యాంకులు మనోళ్లవే కాగా, టాప్ 5లో ముగ్గురు టీమ్ఇండియా బ్యాటర్లు ఉండడం విశేషం.అయితే 2025 ఐపీఎల్ తర్వాత రోహిత్ ఇప్పటిదాకా బరిలోకి దిగలేదు. రోహిత్ ఆఖరి మ్యాచ్? ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ ఆడాడు. అప్పట్నుంచి మళ్లీ టీమ్ఇండియా వన్డేలు ఆడలేదు. అయినప్పటికీ హిట్ మ్యాన్ ఒక స్థానం మెరుగుపర్చుకోవడం విశేషం. ఇప్పటిదాకా ఆ స్థానంలో ఉన్న పాకిస్థాన్ స్టార్ బ్యాటర్ బాబర్ ఆజమ్ రీసెంట్?గా వెస్టిండీస్?తో వన్డే సిరీస్?లో ఫెయిల్ అయ్యాడు. మూడు మ్యాచ్?ల్లో కేవలం 56 పరుగులే చేశాడు. దీంతో బాబర్ 751 రేటింగ్స్?తో మూడో స్థానానికి పడిపోయాడు.


## జహీర్ ఖాన్‌పై వేటుకు లక్నో సూపర్ జెయింట్స్ సిద్ధం!

### భారీ మార్పులు చేయనున్న యాజమాన్యం

ఐపీఎల్ 2026 వేలానికి ముందు లక్నో సూపర్ జెయింట్స్ జట్టులో భారీ మార్పులు చోటు చేసుకోనున్నాయి. ఐపీఎల్ 2025 సీజన్‌లో లక్నో సూపర్ జెయింట్స్.. కనీసం ప్లే ఆఫ్స్ కూడా చేరకుండా ఇంటిదారి పట్టడంపై టీమ్ ఓనర్ సంజీవ్ గోయెంకా ఆగ్రహంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే అతను జట్టు సపోర్ట్ స్టాఫ్‌ను మార్చాలని టీమ్ మేనేజ్‌మెంట్‌ను ఆదేశించినట్లు తెలుస్తోంది.లక్నో సూపర్ జెయింట్స్ హెడ్ కోచ్ జస్టిన్ లాంగర్‌తో పాటు టీమ్ కన్సల్టెన్సీ జహీర్ ఖాన్‌పై వేటు వేసేందుకు ఆ జట్టు సిద్ధమైనట్లు వార్తలు వస్తున్నాయి. ఇప్పటికే బౌలింగ్ కోచ్‌గా భరత్ అరుణ్‌ను లక్నో నియమించుకుంది. జహీర్ ఖాన్ స్థానంలో కొత్త కన్సల్టెంట్ కోసం అన్వేషణ మొదలు పెట్టినట్లు జట్టు వర్గాలు పేర్కొన్నాయి.ఐపీఎల్ 2022 సీజన్‌లో లీగ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన లక్నో సూపర్ జెయింట్స్..ఇప్పటి వరకు 4 సీజన్లు ఆడింది. ఇందులో రెండు సార్లు ప్లే ఆఫ్స్ చేరింది. ఈ రెండు సార్లు టీమ్ మెంటార్‌గా గౌతం గంభీర్ ఉన్నాడు. ముందు గంభీర్.. ఆ తర్వాత కేఎల్ రాహుల్ జట్టును వదిలేసారు. ఐపీఎల్ 2025 మెగా వేలంలో రిషభ్ పంత్‌ను రూ. 27 కోట్ల రికార్డ్ ధరకు లక్నో కొనుగోలు చేసింది. కానీ అతను మాత్రం దారుణంగా విఫలమయ్యాడు. ఆఖరి మ్యాచ్‌లో సెంచరీ సాధించాడు. గంభీర్ తర్వాత లక్నో కన్సల్టెంట్‌గా జహీర్ ఖాన్ బాధ్యతలు చేపట్టాడు. అతని పర్యవేక్షణలో జట్టు ప్లే ఆఫ్స్‌కు చేరలేకపోయింది. మరోవైపు సంజీవ్ గోయెంకా లక్నో ఫ్రాంచైజీ సామ్రాజ్యాన్ని విస్తరించాడు. సౌతాఫ్రికా 20 లీగ్, హండ్రెడ్ లీగ్‌తో పాటు ఫుట్‌బాల్ లీగ్స్‌లో గోయెంకా గ్రూప్ పెట్టుబడులు పెట్టింది. దాంతో ఈ మూడు క్రికెట్ జట్లను చూసుకునేందుకు ఒకే కన్సల్టెంట్‌ను నియమించుకోవాలని గోయెంకా నిర్ణయించుకున్నారు. దాంతోనే జహీర్ ఖాన్‌కు ఉద్వాసన పలికి కొత్త కన్సల్టెంట్ కోసం అన్వేషణ ప్రారంభించారు. జహీర్ ఖాన్‌పై వేటు వేయడాన్ని ఆ జట్టు వర్గాలు ధ్రువీకరించాయి. సంజీవ్ గోయెంకా డబ్బులు బాగా ఖర్చు పెట్టినా.. తక్షణ ఫలితాలను ఆశిస్తాడు. ఈ క్రమంలోనే కేఎల్ రాహుల్.. గోయెంకా నుంచి ఇబ్బందులు ఎదుర్కొని జట్టును వీడాడు. హెడ్ కోచ్‌తో పాటు జహీర్ ఖాన్ స్థానంలో ఎవర్నీ తీసుకుంటాడా? అనేది చర్చనీయాంశంగా మారింది.



## కామన్వెల్త్ క్రీడలకు బిడ్- భారత ఒలింపిక్ సంఘం ఆమోదం




ఒలింపిక్ తర్వాత అత్యంత ఆదరణ ఉన్న, ఎక్కువ దేశాలు బరిలో నిలిచే కామన్వెల్త్ క్రీడలకు ఆతిథ్యం ఇచ్చేందుకు భారత్ సిద్ధమవుతోంది. 2030 క్రీడలను గుజరాత్‌లో నిర్వహించేందుకు బిడ్ దాఖలు ఇప్పటికే వార్తలు వచ్చాయి. 2030 కామన్వెల్త్ క్రీడలకు ఆతిథ్యం ఇవ్వడానికి భారత ఒలింపిక్ సంఘం బిడ్‌కు ఆమోదం తెలిపింది. ఆగస్టు 31 గడువుకు ముందే ప్రతిపాదనలను సమర్పించాలని ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో నిర్ణయించింది. కామన్వెల్త్ క్రీడలకు 2010లో తొలిసారి భారత్ ఆతిథ్యం ఇచ్చింది. మరోసారి నిర్వహించాలనే ఆలోచనలో ఉన్న కేంద్ర ప్రభుత్వం, 2030లో జరిగే పోటీల కోసం ముమ్మర కసరత్తు చేస్తోంది. 2036 ఒలింపిక్ క్రీడల నిర్వహణకు ఆసక్తి కనబరుస్తున్న కేంద్రం, వాటిని కూడా గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లోనే నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించింది. అంతకుముందే కామన్వెల్త్ క్రీడల సమర్థ నిర్వహణ ద్వారా దేశ శక్తి సామర్థ్యాలను ప్రపంచానికి చాటి చెప్పాలని యత్నిస్తోందని నిపుణులు అంటున్నారు.